
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 292

గురువారం 6-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కష్టం ఇవ్వను..

చైతన్య పోరాటం చేస్తున్న భోపాల్ యువతిపై ప్రత్యేక కథనం - 11లో



భారత జట్టులో తిలక్ వర్మ

వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌కు ఎంపికైన హైదరాబాద్ క్రికెటర్ - 12లో



బాబాయ్, ఇక తప్పుకో!

ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ సభకు 18 మంది, చీలిక వర్గం నేత అజిత్ పవార్ సభకు 32 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

వివరాలు 6లో ▸



ఈడీని కట్టడి చేయాల్సిందే

ఈడీకి అపరిమిత అధికారాలు కట్టబెట్టారని.. సుప్రీంకోర్టు తక్షణమే జోక్యం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోరారు.


వివరాలు 6లో ▸



ముగిసిన సైనిక ఆపరేషన్

వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో 12 మంది పాలస్తీనావాసులు, ఒక ఇజ్రాయెల్ జవాన్ మృతి చెందారు.

వివరాలు 6లో ▸



ఆ నిందితుడు అరెస్టు

మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో గిరిజన యువకుడిపై మూత్ర విసర్జన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 6లో ▸

త్వరితగతిన పోలవరం

పూర్తయ్యేలా చూడాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ వినతి

- సవరించిన అంచనా రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపండి
- తొలి దశ వేగవంతానికి రూ.17,144 కోట్లు ఇవ్వండి
- ఢిల్లీలో ప్రధాని మోదీతో సీఎం జగన్ భేటీ.. గంటా 20 నిమిషాలు పాటు సాగిన సమావేశం
- అపరిష్కృత అంశాలను పరిష్కరించండి.. బకాయిల విడుదల.. విభజన హామీల అమలు
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపు
- కొత్త వైద్య కళాశాలలకు సహకారం
- హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ భేటీ



ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన హామీలు సహా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు, జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో హేతుబద్ధత, విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, నూతన వైద్య కళాశాలలకు ఆర్థిక సాయం తదితర అంశాలపై ప్రధానితో సుమారు గంటా ఇరవై నిమిషాలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా ఎంతో దోహద పడుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, సుదీర్ఘ కాలంగా ఇది పెండింగ్‌లో ఉందని ప్రధాని నరేంద్రమోదీకి గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతాయని, ఇది కేంద్ర జల శక్తి శాఖ పరిశీలనలో ఉందని వివరించారు. తొలి దశ నిర్మాణానికి, కేంద్ర ఆర్థిక శాఖ

మిగతా 2వ పేజీలో ▶



నిరుపేదలకు భూమి

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో పంపిణీకి సన్నాహాలు

- వ్యవసాయం ద్వారా మరింతగా నిలదొక్కుకునేలా ఊతం
- 23 జిల్లాల్లో 54 వేల ఎకరాలు గుర్తింపు.. 47 వేల మంది లబ్ధిదారుల ఎంపిక
- వైఎస్సార్, సత్యసాయి జిల్లాల్లో ఎక్కువ భూమి.. అవకతవకలకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ యాప్ ద్వారా పట్టాలు
- పట్టాపై లబ్ధిదారుని పేరు, సర్వే, ఆధార్, ఖాతా నంబర్లు, విస్తీర్ణం, భూ స్వభావం
- త్వరలో మంత్రివర్గంలో ఆమోద ముద్ర

పేదల అభ్యున్నతి దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తోంది. కూలినాలి చేసుకుని కష్టంగా బతుకు బండి లాగుతున్న వారిని, కౌలుకు తీసుకుని ఆరుగాలం శ్రమిస్తున్న వారిని భూ యజమానులుగా చేయనుంది. తద్వారా 'ఈ భూమి మాదే' అని అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు గర్వంగా చెప్పుకునేలా చేయాలని తాపత్రయ పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 54 వేల ఎకరాల భూ పంపిణీకి వేగంగా చర్యలు తీసుకుంటోంది.

సాక్షి, అమరావతి: సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్రంలో నిరుపేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ భూములు పంపిణీ చేయనుంది. 23 జిల్లాల్లో 54 వేల ఎకరాలను అర్హులైన పేదలకు పంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో అర్హులైన సుమారు 47 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఆయా జిల్లాల అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం కూడా దాదాపు పూర్తయింది. భూమి లభ్యతను బట్టి ఒక్కో

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మరో 3 రోజులు వర్షాలు



బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో మూడు రోజులు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పిడుగులు పడే అవకాశం కూడా ఉందని హెచ్చరించింది.

వివరాలు 2లో ▸

చరిత్రలో నిలిచిపోయేలా 'అంబేడ్కర్ స్మృతి వనం'



విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం నిర్మాణ పనులను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి మేరుగు నాగార్జున తదితరులు బుధవారం పరిశీలించారు. పనుల వివరాలపై అధికారులను ఆరా తీశారు.

వివరాలు 10లో ▸

సుప్రీంకోర్టుకు మరో ఇద్దరు న్యాయమూర్తులు



జస్టిస్ ఎస్వీ భట్టి



జస్టిస్ ఉజ్జల్ భూయాన్

ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి, ప్రస్తుతం కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది.

వివరాలు 14లో ▸

అత్యధిక బీమా పరిహారం 'అనంత'కే

ఫ్యాక్ట్ చెక్



దేశమంతా ప్రశంసిస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమాపై నిత్యం కాకి లెక్కలతో ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తుండగా.. రైతుల ముసుగులో టీడీపీ నేతలు రభస చేస్తున్నారు. రైతులెవరూ అభ్యంతరం చెప్పకున్నా పచ్చ ముఠాలను రోడ్లపైకి తీసుకొచ్చి పొలిటికల్ డ్రామాలకు తెరతీశారు.

వివరాలు 10లో ▸

ఇంకొంచెం



అలా చేస్తే యూత్‌కు అవకాశం ఇచ్చినట్లేగా సార్.. అన్ని పార్టీలు అమలు చేస్తే ఎంత బావుండు!

ఏపీలో ధాన్యం ఉత్పత్తి వ్యయం తక్కువే

క్వింటాల్ ధాన్యం ఉత్పత్తికి సగటు వ్యయం రూ.1,061

- దేశంలో క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి సగటు వ్యయం రూ.1,360
- పంజాబ్ తర్వాత ఏపీలోనే తక్కువ
- అధికంగా మహారాష్ట్రలో క్వింటాల్‌కు రూ.2,619.. కేరళలో రూ.1,659 వ్యయం
- కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: ధాన్యం ఉత్పత్తి వ్యయం పంజాబ్ తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనే తక్కువగా ఉంది. దేశ సగటుతో పోల్చినా రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి వ్యయం తక్కువగానే ఉంది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తాజా గణాంకాల్లో వెల్లడించింది. పంజాబ్‌లో క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి వ్యయం రూ.808 ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,061గా నమోదైంది. దేశంలో క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి సగటు వ్యయం రూ.1,360 ఉన్నట్టు తెలిపింది. వ్యవసాయ భూమి లీజుతోపాటు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, కుటుంబ సభ్యుల శ్రమ, పశువుల శ్రమ, ఇరిగేషన్ చార్జీలు, పెట్టుబడి వ్యయం, వడ్డీలను కలిపి

మిగతా 2వ పేజీలో ▶

వైద్య పథకాలు భేష్



ఆరోగ్య శాఖ అధికారి నివాస్‌తో సమావేశమైన మహారాష్ట్ర వైద్య శాఖ బృందం సభ్యులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలు చాలా బాగున్నాయని మహారాష్ట్ర వైద్య శాఖ బృందం ప్రశంసించింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం, నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర పథకాల అమలును కొనియాడింది. ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పథకాల గురించి తెలుసుకోవడానికి ముంబై డైరెక్టర్–1 (హెల్త్ సర్వీసెస్) డాక్టర్ స్వప్నిల్ లాలే, జాయింట్ సెక్రటరీ అశోక్ తదితరులు ఏపీలో పర్యటిస్తున్నారు.

- వివరాలు 2లో

- కంప్యూటర్ సైన్స్‌కు పోటాపోటీగా డిమాండ్
- ముంబైలో 66 ర్యాంక్‌తో క్లోజ్.. హైదరాబాద్ ఐఐటీలో 604 ర్యాంక్ వరకే
- అమ్మాయిలకు కాస్త మెరుగైన పరిస్థితి.. ముంబై ఐఐటీలో 291 వరకూ సీటు
- హైదరాబాద్‌లో 1,300 ర్యాంకు విద్యార్థినికి లాస్ట్ సీటు
- జమ్మూలో 9 వేలు దాటినా అమ్మాయిలకు సీఎస్‌సీ సీటు



ప్రధాన ఐఐటీల్లో టాపర్స్‌కే చోటు

జోసా రెండో విడత కౌన్సెలింగ్ ఓపెన్ కేటగిరీలో సీఎస్‌సీకి అవకాశం నిల్!

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి సీట్ల కేటాయింపు అథారిటీ (జోసా) తొలి విడత కౌన్సెలింగ్‌లో ప్రధాన ఐఐటీల్లో అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్లకే సీట్లు వచ్చాయి. ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్‌సీ)ని ఎంచుకోవడంతో ఓపెన్ కేటగిరీలో విపరీతమైన పోటీ పెరిగింది. టాప్ ర్యాంకర్లకు ప్రధాన ఐఐటీల్లో సీట్లు రావడంతో వీళ్లంతా ఇప్పటికే సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. ఈ నేపథ్యంలో రెండో విడత కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు సీట్లు మిగిలే అవకాశం ఉండదని తెలుస్తోంది. టాప్ 66 ర్యాంకుల వరకూ వాళ్లు పెట్టుకున్న తొలి ఆప్షన్‌కే సీట్లు వచ్చాయి. వీళ్లంతా ముంబై ఐఐటీలో ఓపెన్ కేటగిరీ కింద సీఎస్‌సీ ఆప్షన్ ఇచ్చినవారే కావడం గమనార్హం. హైదరాబాద్ ఐఐటీలో 604 ర్యాంకు వరకూ సీఎస్‌సీలో సీట్లు వచ్చాయి. ఇందులో వంద ర్యాంకు వరకూ తొలి ప్రాధాన్యతలో సీట్లు వస్తే, మిగతావి రెండో ప్రాధాన్యత కింద వచ్చాయి. పోటీ జాబితాలో మద్రాస్ ఐఐటీ కూడా ఉంది. ఇక్కడ 42 నుంచి 144వ ర్యాంకు వరకూ మాత్రమే సీట్లు వచ్చాయి. జమ్మూ ఐఐటీలో ఆప్షన్లు తక్కువ రావడంతో 4,458వ ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి.

దేశంలోని వివిధ ఐఐటీల్లో తొలి విడత జోసా కౌన్సెలింగ్‌లో ఓపెన్ కేటగిరీ కింద సీఎస్‌సీలో ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకులు ఇలా ఉన్నాయి..

ఐఐటీ	అబ్బాయిలు		అమ్మాయిలు	
	ఓపెనింగ్	క్లోజింగ్	ఓపెనింగ్	క్లోజింగ్
బాంబే	1	16	56	291
భువనేశ్వర్	159	2,806	3,423	4,527
మండి	1,426	2,710	4,715	6,012
ఢిల్లీ	16	115	91	419
ఇండోర్	895	1,320	1,970	2,768
కాన్పూర్	164	261	523	702
హైదరాబాద్	158	604	636	1,300
జోధ్‌పూర్	1,554	2,270	4,212	5,206
మద్రాస్	42	144	319	479
రూర్కీ	263	396	774	1,165
గాంధీనగర్	1,620	2,096	3,197	3,197
గౌహతి	398	601	1,422	1,718
తిరుపతి	2,089	3,445	5,063	6,016
జమ్మూ	3,050	4,458	8,521	9,840
పాలక్కడ్	3,507	4,531	8,281	8,432

అమ్మాయిలకు కాస్త మెరుగే..

అమ్మాయిలు జనరల్ కేటగిరీతో పాటు ప్రత్యేకంగా కేటాయించిన సూపర్ న్యూమరరీ సీట్ల కోసం కూడా పోటీ పడ్డారు. అయితే, అబ్బాయిలతో పోలిస్తే వీరికి ప్రధాన ఐఐటీల్లో కూడా 290వ ర్యాంకు వరకూ సీఎస్‌సీ బ్రాంచిలో ఓపెన్ కేటగిరీలో సీట్లు వచ్చాయి. ప్రతీ ఐఐటీలోనూ అబ్బాయిలకు రెండంకెల ర్యాంకుకు సీటు వస్తే, అమ్మాయిలకు మూడంకెలు వచ్చినా సీఎస్‌సీలో సీటు వచ్చింది. హైదరాబాద్ ఐఐటీలో 5 వేలు దాటిన వారికీ ఓపెన్ కేటగిరీలో కంప్యూటర్ సైన్స్ సీటు దక్కింది. రాష్ట్ర ఎంసెట్‌లో సాధారణంగా టాప్ కాలేజీల్లో 3 వేల లోపు ర్యాంకుకే కటాఫ్ ఉంటోంది. ఈ లెక్కన ఐఐటీల్లో ర్యాంకులు పొందిన బాలికలకు చాలా చోట్ల మంచి బ్రాంచీల్లో సీట్లు లభించాయి. రాష్ట్ర స్థాయిలోని ఎంసెట్‌తో పోలిస్తే.. జాతీయస్థాయిలోని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అమ్మాయిల పోటీ తక్కువగా ఉందని జోసా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జమ్మూ ఐఐటీకి ఆప్షన్లు ఇచ్చేందుకు బాలికలు పెద్దగా మొగ్గు చూపలేదని సమాచారం. ఉత్తర, దక్షిణాది నుంచి బాలికలు ఈ ఐఐటీకి వెళ్లేందుకు ఇష్టపడకపోవడమే కారణమని తెలుస్తోంది. దీంతో ఇక్కడ 9 వేల ర్యాంకు దాటినా కంప్యూటర్ సైన్స్‌లో ఓపెన్ కేటగిరీ అమ్మాయిలకు సీట్లు వచ్చాయి.

ఎరువులు ఫుల్.. ఇబ్బందులు నిల్



- పక్కా ప్రణాళిక ప్రకారం రైతులకు సరఫరా.. 2023–24 సీజన్‌లో ఆర్బీకేల ద్వారా 10.20 లక్షల టన్నులు
- సొసైటీల ద్వారా రూ.7.23 లక్షల టన్నులు.. బఫర్ స్టాక్ స్కీమ్ కింద మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా
- స్థానిక అవసరాలకు తగినట్టుగా ముందస్తుగా నిల్వకు ఏర్పాట్లు

3లో




సీఐడీ విచారణకు రామోజీ, శైలజ డుమ్మా

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ బుధవారం సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. ఏ–3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లు విచారణకు హాజరై.. చందాదారుల నిధులను మళ్లించామని, ఇదంతా తమ ప్రధాన కార్యాలయం ఆదేశాలతోనే చేశామని వెల్లడించినట్టు సమాచారం.

- వివరాలు 14లో

పేదలకు భరోసాతో.. పెత్తందారులు బతికేదెలా?

ఫ్యాక్ట్ చెక్

- నాలుగేళ్లలో పేదలకు డీబీటీ, నాన్ డీబీటీతో రూ.3.15 లక్షల కోట్లకుపైగా లబ్ధి
- కోవిడ్‌లోనూ కొనుగోలు శక్తి తగ్గకుండా నగదు బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- గ్రామీణ సుస్థిరాభివృద్ధి దిశగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన
- టమాటా ధరలు పెరిగిన మర్నాడే రైతు బజార్లలో సబ్సిడీపై విక్రయం
- నాలుగేళ్లలో రూ.70 కోట్ల విలువైన 15 వేల టన్నుల ఉల్లి, టమాటా, బత్తాయి కొనుగోలు
- కేంద్ర అజమాయిషీలోని గ్యాస్, పెట్రోల్ రేట్లతో రాష్ట్రానికి ఏం సంబంధం?
- వాటి రేట్లు రాష్ట్ర ప్రభుత్వమే పెంచిందనే తరహాలో 'ఈనాడు' బండ రాతలు

13లో

క్లుప్తంగా...

23 రకాల పనులతో వర్షాకాలంలోనూ 'ఉపాధి'

సాక్షి, అమరావతి: వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పనులు కావాలని వచ్చే వారందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ కొత్త పనులను గుర్తిస్తోంది. మురుగు నీరు లేదా వరద నీరు మళ్లింపు కాల్వల తవ్వకం, బ్రిడ్జిలు, పైపు కల్వర్టుల వద్ద పూడిక తీత, రోడ్లు, నీటి పారుదల కాల్వ వెంబడి మొక్కలు నాటడం, కొండలపై నుంచి పారే వర్షపు నీరు నిల్వకు వీలుగా ట్రెంచ్‌ల నిర్మాణం, తదితర 23 రకాల పనుల వివరాలను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని జిల్లా, మండల స్థాయి అధికారులకు తెలియజేసింది. ఇప్పటికే అనుమతి పొందిన పనులతో పాటు అదనంగా అవకాశమున్న అన్ని చోట్ల ఈ తరహా పనులు గుర్తించి కూలీలకు పనులు కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి అధికారులను ఆదేశించారు.

అల్లూరి ఆశయ సాధన దిశగా ప్రభుత్వం అడుగులు

- అల్లూరి మనవడు శ్రీరామరాజు


అల్లూరి విగ్రహావిష్కరణలో రోజా, శ్రీరామరాజు, సత్యనారాయణరాజు తదితరులు

నగరి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధన దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన మనవడు అల్లూరి శ్రీరామరాజు అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అల్లూరి 126వ జయంతి వేడుకల సందర్భంగా చిత్తూరు జిల్లా విజయపురం బస్టాండ్ ఆవరణలో బుధవారం సీతారామరాజు విగ్రహాన్ని శ్రీరామరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి రోజా, ఎమ్మెల్సీ పీవీవీ సత్యనారాయణరాజు పాల్గొన్నారు. దీనికి ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మంత్రి రోజా మాట్లాడుతూ..అల్లూరి ఒక మహోన్నత శక్తి అని అన్నారు. ఎమ్మెల్సీ పీవీవీ మాట్లాడుతూ..అల్లూరి పోరాటం వల్లే గిరిజనుల జీవన విధానం దెబ్బ తినకుండా నేటికీ కొనసాగుతోందన్నారు.

న్యాయపరిశీలనకు 'నాడు-నేడు' టెండర్లు

సాక్షి, అమరావతి: మనబడి నాడు-నేడు ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అందించాల్సిన పరికరాల టెండర్ పత్రాలను జ్యుడిషియల్ ప్రివ్యూకు సమర్పించినట్లు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ సీఎస్ దీవన్‌రెడ్డి బుధవారం తెలిపారు. పౌడర్ కోటెడ్ గాల్వనైజ్డ్ స్టీల్ డోర్లు, డబుల్ స్కిన్ పౌడర్ కోటెడ్ జీఐ ఓపెన్‌బుల్ కేస్‌మెంటు సింగిల్ రిబేట్ విండోలకు సంబంధించి జాతీయ ఈ-ప్రొక్యూర్‌మెంటులో టెండర్లను పిలిచినట్లు పేర్కొన్నారు. ఈ టెండర్లను న్యాయపరిశీలన కోసం జ్యుడిషియల్ ప్రివ్యూ న్యాయమూర్తికి సమర్పించినట్లు వివరించారు. వీటిపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు టెండర్ డాక్యుమెంట్లను న్యాయసమీక్ష అధికారిక వెబ్‌సైట్ 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జ్యుడిషియల్.ప్రివ్యూ.ఏపీ.జీవోవీ.ఐఎన్'లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. సలహాలు, సూచనలతో పాటు అభ్యంతరాలను ఈనెల 13వ తేదీలోపు ఆ వెబ్‌సైట్లో తెలపవచ్చని పేర్కొన్నారు.

మరో 3 రోజులు వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర తీరానికి ఆనుకుని ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బుధవారం మధ్య బంగాళాఖాతం వైపునకు కదలింది. దీని ప్రభావంతో మరో 3 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. గురువారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. బుధవారం విజయనగరం జిల్లా సారధిలో 9.8 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

'పెండింగ్ బకాయిలను విడుదల చేయండి'

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకటనాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అధ్యక్షతన ఢిల్లీలో పౌరసరఫరాల శాఖ మంత్రులు, సెక్రటరీలు, ఎండీల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీలో భాగంగా కెర్నల్స్ నాణ్యత ప్రమాణాల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలన్నారు. 2012- 13 నుంచి 2017-18 వరకు రావాల్సిన రూ.1,702 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరగా సానుకూల స్పందన లభించింది. పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ ఏపీలో బియ్యం ఫోర్టిఫికేషన్ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు భూమి



▶ మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారునికి ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరం వరకు భూమి ఇవ్వనున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు వ్యవసాయ భూములు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఏడాది కిందటే కసరత్తు మొదలుపెట్టారు. అన్ని జిల్లాల్లో పేదలకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్న భూమి, అర్హులైన లబ్ధిదారుల వివరాలతో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ల పరిశీలన తర్వాత 23 జిల్లాల్లోనే భూమి అందుబాటులో ఉన్నట్లు తేలింది. వైఎస్సార్, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆశాజనకంగా భూమి అందుబాటులో ఉండగా, మరో 8 జిల్లాల్లో వెయ్యి నుంచి 4 వేల ఎకరాల లోపు భూమి లభ్యత ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 9 జిల్లాల్లో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల భూమి ఉండగా, 4 జిల్లాల్లో వెయ్యి ఎకరాల లోపు భూమి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్లు నివేదికలు ఇచ్చారు. విశాఖ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో భూమి అందుబాటులో లేదు. దీంతో భూమి లభ్యత ఉన్న 23 జిల్లాల్లో గుర్తించిన భూమిని సర్వే చేసి, డిమార్కేషన్ చేయించారు. అసైన్‌మెంట్ కమిటీల అనుమతులు కూడా లభించాయి. త్వరలో మంత్రివర్గం భూ పంపిణీకి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది.

వైఎస్సార్ జిల్లాలో 8,916 ఎకరాలు

అత్యధికంగా వైఎస్సార్ జిల్లాలో 8,916 ఎకరాలను పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత శ్రీ సత్యసాయి జిల్లాలో 7,476, కర్నూలు 4,092, నంద్యాల 3,678, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు 3,711, కాకినాడ 2,935, చిత్తూరు 2,866, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2,565 ఎకరాలను పంపిణీ చేయనున్నారు. భూ పంపిణీలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూసేందుకు ఇళ్ల పట్టాల పంపిణీ మాదిరిగా ఆన్‌లైన్ సేవా యాప్‌ను వినియోగించనున్నారు. ఈ యాప్ ద్వారానే అర్హులకు పట్టాలు జెనరేట్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. తొలుత లబ్ధిదారుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్ చేస్తారు. భూ పంపిణీ కోసం ప్రత్యేకంగా మ్యుటేషన్ చేసే అధికారాన్ని ఆర్డీఓలకు ఇచ్చారు. మామూలుగా అయితే ఈ లాగిన్ జేసీల వద్ద ఉంటుంది. ఆర్డీఓలు మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేశాక, ఆ వివరాల ఆధారంగా వీఆర్‌ఓలు తమ గ్రామాల పరిధిలోని లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. చివరిగా అవి తహశీల్దార్ లాగిన్‌లోకి వెళ్లాక ఆయన పరిశీలించి అనుమతిస్తారు. అప్పుడు లబ్ధిదారుని పేరుపై వ్యవసాయ భూమి పట్టా జెనరేట్ అవుతుంది. దీంతో లబ్ధిదారుల వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌లో, ఆన్‌లైన్ యాప్‌లోనూ ఉంటాయి. వాటిని మార్చడానికి ఏమాత్రం అవకాశం ఉండదు.

2013లో చివరి సారిగా భూ పంపిణీ

రాష్ట్రంలో చివరిసారిగా 2013లో భూ పంపిణీ జరిగింది. తక్కువ భూమి అయినా పేదలకివ్వడం అదే చివరిసారి. ఆ తర్వాత భూ పంపిణీ గురించి ఎవరూ పట్టించుకోలేదు. పేదలు మాత్రం తమ జీవనోపాధికి కొంత భూమి ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూనే ఉన్నారు. అలాంటి దరఖాస్తులు తహశీల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్లలో ఎప్పటి నుంచో మూలనపడి ఉన్నాయి. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎవరూ అడగకుండానే నిరుపేదలకు మేలు చేయాలనే సంకల్పంతో భూ పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు.

పట్టాపైనే పూర్తి వివరాల నమోదు

పట్టాలపై గతంలో మాదిరి కాకుండా లబ్ధిదారుని పూర్తి వివరాలు నమోదు చేయనున్నారు. వీటితోపాటు భూమికి సంబంధించిన సర్వే నంబర్ (లేదా ఎల్‌పీఎం నంబర్), విస్తీర్ణం, ఖాతా నంబర్, భూమి స్వభావాన్ని కూడా ముద్రించనున్నారు. సర్వే నంబరు వారీగా భూమిని గుణించి మొత్తం విస్తీర్ణాన్ని పట్టాపై కనిపించేలా ఏర్పాటు చేస్తున్నారు. పట్టాపై లబ్ధిదారుడు, భూమికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయడం వల్ల ఆ భూమిని భవిష్యత్తులో మరొకరికి బదలాయించే అవకాశం ఉండదని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఆధార్ నంబర్ కూడా పట్టాపై నమోదు చేయడం ద్వారా మరోసారి భూమి కోసం సంబంధిత లబ్ధిదారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండదు.

ఏపీ వైద్య పథకాలు భేష్

- ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య శ్రీ కార్యక్రమాలు చాలా బాగున్నాయి
- మహారాష్ట్ర వైద్య శాఖ బృందం ప్రశంసలు

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలు చాలా బాగున్నాయని మహారాష్ట్ర వైద్య శాఖ బృందం ప్రశంసించింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం, నాడు-నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర పథకాల అమలును కొనియాడింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పథకాల గురించి తెలుసుకోవడానికి మహారాష్ట్ర వైద్య శాఖ బృందం ఏపీకి వచ్చింది. ఈ బృందంలో ముంబై డైరెక్టర్-1(హెల్త్ సర్వీసెస్) డాక్టర్ స్వప్నిల్ లాలే, జాయింట్ సెక్రటరీ అశోక్, డిప్యూటీ డైరెక్టర్ టి.సంజయ్ వారే, డాక్టర్ దీప్‌చంద్ సోయం తదితరులున్నారు. వీరికి బుధవారం మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్.. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 3,257 ప్రొసీజర్స్‌తో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లే రోగులకు.. ఆరోగ్య ఆసరా కింద రోజుకు రూ.225.. నెలకు గరిష్టంగా రూ.5 వేలు చొప్పున ఇస్తున్నట్టు వివరించారు. నాలుగేళ్లలో ప్రభుత్వాస్పత్రుల్లో 49,639 పోస్టులను వైఎస్ జగన్ సర్కార్ భర్తీ చేసిందని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని.. వీటిలో 5 కాలేజీలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర వైద్య బృందం సభ్యులు స్పందిస్తూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు, పథకాలు చాలా బాగున్నాయని ప్రశంసించారు. గురువారం నుంచి 4 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తామని వారు చెప్పారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో వీరు భేటీ అయ్యారు. సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఎస్పీఎం డాక్టర్ వెంకట రవికిరణ్, సీఏవో గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలను పారిశ్రామికవేత్తల్ని చేయడం అద్భుతం

- స్వయం సహాయక సంఘాలకు ఏపీప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది
- మిషన్ శక్తి ఫౌండేషన్(అసోం) సభ్యులు ప్రశంస


పరికరాలను పరిశీలిస్తున్న అసోం టీమ్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఏపీ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహం అద్భుతమని అసోంకు చెందిన మిషన్ శక్తి ఫౌండేషన్ సభ్యులు కొనియాడారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో బుధవారం నిర్వహించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యంత్ర పరికరాల ప్రదర్శనను వారు పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, బ్యాంకుల ద్వారా అందజేస్తున్న రుణాల గురించి వారికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ వివరించారు. స్థానిక అవసరాలకనుగుణంగా పలు వ్యాపారాలపై మహిళలు దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని మహిళా మార్ట్, గన్నీ బ్యాగ్స్, పౌల్ట్రీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పేపర్ ప్లేట్లు, పచ్చళ్ల తయారీ యూనిట్లను పరిశీలించినట్లు అసోం బృంద సభ్యులు తెలిపారు. అసోంలోనూ ఏపీ విధానాలను అమలయ్యేలా ప్రభుత్వాన్ని కోరుతామన్నారు.

దిగివచ్చిన కేంద్రం.. ఫలించిన సీఎం జగన్ ఒత్తిడి

- పలుమార్లు కేంద్రానికి లేఖలు.. ఢిల్లీకి ప్రత్యేక బృందాలు
- పెనాల్టీ లేకుండా అదనపు పొగాకు కొనుగోలుకు కేంద్రం అంగీకారం
- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలుకు శ్రీకారం




సాక్షి, అమరావతి/కొరిటిపాడు (గుంటూరు): పొగాకు రైతుకు శుభవార్త. రికార్డు స్థాయిలో ధర పలుకుతున్న ప్రస్తుత తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడి ఫలితంగా పెనాల్టీ లేకుండా అదనపు ఉత్పత్తి కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. 2022-23 సీజన్‌లో 81,635 హెక్టార్లలో సాగుకు, 142 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుకు పొగాకు బోర్డు అనుమతిచ్చింది. గతేడాది డిసెంబర్‌లో విరుచుకుపడిన మాండూస్ తుపాన్ కారణంగా సగానికిపైగా పొగాకు పంటతో పాటు శనగ, ఇతర పంటలు భారీగా దెబ్బతిన్నాయి. 2021-22లో కిలో పొగాకు గరిష్టంగా రూ.210కు పైగా పలికింది. దీంతో పంటలు దెబ్బతిన్న పొగాకు రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రత్యామ్నాయం లేక పొగాకు సాగుకు మొగ్గు చూపారు. ఫలితంగా అనుమతికి మించి 85,763.50 హెక్టార్లలో పొగాకు సాగైంది. దీనికితోడు వాతావరణం కాస్త అనుకూలించడంతో హెక్టార్‌కు దిగుబడులు కూడా గణనీయంగా పెరిగాయి. రికార్డు స్థాయిలో 172 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయింది. చరిత్రలో ఇదే అత్యధిక దిగుబడి కావడం గమనార్హం. మరోవైపు గతేడాది పొగాకుకు రికార్డు స్థాయి ధరలు పలికాయి. ప్రస్తుతం సగటున కిలో రూ.245 నుంచి రూ.281 వరకు పలుకుతున్నాయి. సాధారణంగా అనుమతికి మించి ఉత్పత్తి అయిన సందర్భాల్లో ప్రత్యేక పరిస్థితులుంటే 5 శాతం పెనాల్టీతో కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇస్తుంది. గతంలో కూడా ఇలా అనుమతి ఇచ్చిన సందర్భాలున్నాయి. ఈ ఏడాది రెండోసారి విత్తుకోవడం, పంటను కాపాడుకోవడానికి, అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు పెట్టుబడులు ఎక్కువగా పెట్టాల్సి వచ్చింది. అదనపు అధీకృత ఉత్పత్తికి పెనాల్టీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే తీవ్రంగా నష్టపోతామంటూ పొగాకు రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర వాణిజ్యపన్నుల శాఖమంత్రి పియూష్ గోయల్‌కు లేఖ రాశారు. కర్ణాటకలో వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంట స్థానంలో రెండోసారి విత్తుకున్న సందర్భంలో పెనాల్టీ లేకుండా అదనపు ఉత్పత్తి విక్రయాలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. అదేరీతిలో రాష్ట్ర రైతులకు కూడా అనుమతినివ్వాలని సీఎం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాదేశాలతో పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు బృందం ఢిల్లీ వెళ్లి పలుమార్లు సంప్రదింపులు జరిపింది. పెనాల్టీ లేకుండా అదనపు అధీకృత పొగాకు ఉత్పత్తి విక్రయాలకు కేంద్రం అనుమతి ఇచ్చేందుకు కృషిచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పొగాకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. 2022-23 పొగాకు పంట కాలానికి సంబంధించి రైతులు అదనంగా పండించిన వర్జీనియా పొగాకును, రిజిస్టర్ కాని అనధికారిక పొగాకును బోర్డు వేలం కేంద్రాల్లో అపరాధ రుసుం లేకుండా అమ్ముకోవడానికి అనుమతిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ గెజిట్ విడుదల చేసిందని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు అండగా సీఎం జగన్

- ఒడిశా రాష్ట్ర యునైటెడ్ నేషనల్ పాప్యులేషన్ ఫండ్ సంస్థ ప్రతినిధులు
- కంచికచర్లలో మహిళా మార్టును సందర్శించి ప్రశంసలు


కంచికచర్లలో చేయూత మహిళా మార్ట్‌ను సందర్శించిన ఒడిశా బృందం

కంచికచర్ల (నందిగామ): ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయటం అభినందనీయమని ఒడిశా రాష్ట్ర యునైటెడ్ నేషనల్ పాప్యులేషన్ ఫండ్ సంస్థ ప్రాజెక్టు అధికారులు శ్రీనివాసరావు, శోభారాణి, రాజాప్రతాప్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఒడిశా బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ మహిళలు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వ ప్రోత్సాహంతో వివిధ రకాల షాపులు, మాల్స్ ఏర్పాటు చేయటం సంతోషకరమైన విషయమని చెప్పారు. సాధారణంగా డీమార్ట్, రిలయన్స్ మార్ట్, వివిధ ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు ఇటువంటి మార్ట్‌లు ఏర్పాటు చేస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా సంఘ మహిళలు చేయూత మహిళా మార్ట్‌లను నడపడం అభినందనీయమని ప్రశంసించారు. మహిళలు స్వయంశక్తితో ఎదుగుతున్నారన్నారు. మహిళా మార్ట్‌లో బయట మార్కెట్ ధర కన్నా తక్కువ ధరలకు నిత్యావసర సరుకులను నాణ్యంగా అందించటం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. మహిళలను అన్ని విధాలుగా ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం జగన్‌ను రాష్ట్ర ప్రజలు మర్చిపోరని చెప్పారు. అనంతరం సరుకుల వివరాలు, వాటి ధరలు, మార్ట్ పనిచేసే విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కోట భాస్కరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, ముత్యాల రోజారమణి, పుల్లమ్మ, సీసీలు యశోద, నరసింహారావు, అరుణ, రమణ, ఈవోలు, మహిళలు పాల్గొన్నారు.


ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్


నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం

త్వరితగతిన పోలవరం

▶ మొదటి పేజీ తరువాయి


ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

ఇప్పటికే రూ.12,911.15 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే తొలి దశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇది ఇస్తేనే తొలి దశ పూర్తవుతుందని చెప్పారు. పోలవరం తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు ఇచ్చేలా జల శక్తి శాఖకు ఆదేశాలివ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన తన సొంత నిధులు రూ.1,310.15 కోట్లను రీయింబర్స్ చేసి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఆయా అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాలు..

సుదీర్ఘ కాలంగా బకాయిలు

2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి ఏపీకి రావాల్సిన రూ.7,230.14 కోట్ల బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ జెన్‌కో ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా అవి త్వరగా వచ్చేలా చూడాలి. జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించడంతో ఏపీ కన్నా ఆర్థికంగా ముందున్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్‌లకు అధిక శాతం కవరేజీ ఉంది. ఈ పథకం అమ లుకు ఎంచుకున్న ప్రమాణా ల్లో హేతుబద్ధత లేదని నీతి ఆయోగ్ కూడా నిర్ధారించింది. హేతుబద్ధత లేనందున రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కడం లేదు. దీంతో రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోంది. ప్రతినెలా వినియోగించకుండా లక్ష టన్నుల బియ్యం కేంద్రం వద్ద ఉంటున్నాయి. ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి ఇస్తే సరిపోతుంది. దీనిపై మీరు (ప్రధాని) జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతు న్నాం. ఏపీ పౌర సరఫరాల శాఖకు దీర్ఘకాలంగా (2012-13 నుంచి 2017-18 వరకు) పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.1,702.90 కోట్లను మంజూరు చేయాలి.

విభజన హామీలు నెరవేర్చండి

విభజన సమయంలో ఇచ్చిన హామీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రత్యేక హోదా సహా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి. ఏపీలో పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా దోహదపడటం ద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు అడు గు లు వేస్తుంది. అందువల్ల ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి. వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి విభజన సందర్భంలో కేంద్రం హామీ ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమలో జీవనోపాధి మెరుగుపడటానికి, జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ ప్రాజెక్టు అ వసరం. స్టీల్ ప్లాంట్‌కు ముడి ఖనిజం కోసం 3 గనులను ఏపీఎండీసీకి కేటా యించాలని కోరుతున్నాం. రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాకు కనీసంగా 18 లక్షల జనాభా ఉంది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు 11 మెడికల్ కాలేజీలకు తోడు అదనంగా మరో 17 కాలేజీల నిర్మాణాలు చేపట్టాం. వీటికి ఆర్థిక సహాయం చేయాలి. సీఎం జగన్.. ప్రధానితో భేటీకి ముందు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో 45 నిమిషాలపాటు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పలు అంశాలపై చర్చించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, అయోధ్య రామి రెడ్డి, రెడ్డెప్ప, ఆర్.కృష్ణయ్య, రంగయ్య, చింతా అనూరాధ ఘన స్వాగతం పలి కారు. బుధవారం రాత్రి సీఎం జగన్ తాడేపల్లికి బయల్దేరారు.

ఏపీలో ధాన్యం ఉత్పత్తి వ్యయం తక్కువే

▶ మొదటి పేజీ తరువాయి



రాష్ట్రాల వారీగా 2022-23లో ధాన్యం క్వింటాల్ ఉత్పత్తి వ్యయాన్ని వెల్లడించింది.

ప్రభుత్వ చర్యలే కారణం

రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సేద్యానికి అవసరమైన అన్నిరకాల ఇన్‌పుట్స్‌ను రైతులకు అందుబాటులోకి తెచ్చింది. సబ్సిడీపై విత్తనాలను అందించడంతో పాటు వైఎస్సార్ రైతు భరోసా కింద వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందిస్తోంది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేయడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతింటే ఆ సీజన్ దాటకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తోంది. కూలీలకు బదులుగా వ్యవసాయ పరికరాలను వినియోగించడాన్ని ప్రోత్సహించడంతో సేద్యంవ్యయం తగ్గుతోంది. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా 50% సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందిస్తోంది. యంత్ర పరికరాల వినియోగం కారణంగా ఉత్పత్తి వ్యయం తగ్గుతోంది. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తుండటం, మెరుగైన వ్యవసాయ పద్ధతుల కారణంగా ధాన్యం ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోంది. దేశంలో ఎక్కువగా ధాన్యం పండించే రాష్ట్రాల్లో పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండగా మహారాష్ట్రలో క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి వ్యయం అత్యధికంగా ఉంది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడుల్లో ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంది. వరి పండించే రాష్ట్రాల్లో పంజాబ్, ఏపీలలో మాత్రమే క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి వ్యయం మిగతా రాష్ట్రాల కన్నా తక్కువగా ఉంది.

ధాన్యం ఉత్పత్తి వ్యయం 2022-23లో రాష్ట్రాల వారీగా.. (రూ.ల్లో)

రాష్ట్రం	క్వింటాల్‌కు ఉత్పత్తి వ్యయం	రాష్ట్రం	క్వింటాల్‌కు ఉత్పత్తి వ్యయం
		ఉత్తరప్రదేశ్	1,353
		హిమాచల్‌ప్రదేశ్	1,345
మహారాష్ట్ర	2,619	కర్ణాటక	1,237
పశ్చిమ బెంగాల్	1,658	గుజరాత్	1,230
కేరళ	1,650	బిహార్	1,201
ఒడిశా	1,597	హరియాణా	1,197
అస్సాం	1,500	ఛత్తీస్‌గఢ్	1,185
మధ్యప్రదేశ్	1,490	ఉత్తరాఖండ్	1,129
తమిళనాడు	1,409	ఆంధ్రప్రదేశ్	1,061
తెలంగాణ	1,385	పంజాబ్	808



క్లుప్తంగా...

రాజకీయ పార్టీల కోసం సీఈసీ ప్రత్యేక వెబ్‌సైట్

సాక్షి, అమరావతి: రాజకీయ పార్టీలు సేకరించే విరాళాలు, వార్షిక నివేదిక, ఎన్నికల వ్యయ పట్టికలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో సమర్పించే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నివేదికలను సులభంగా దాఖలు చేయడానికి http://iems.eci.gov.inను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం తెలిపారు. ప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం రాజకీయ పార్టీలు తమ వార్షిక నివేదికలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత అధికారులకు ఏటా సమర్పించాల్సి ఉంటుంది. నిర్దిష్ట గడువులోగా నివేదికలు సమర్పించడానికి రాజకీయ పార్టీల అధీకృత ప్రతినిధుల మొబైల్ నంబర్లు, ఈ మెయిల్స్‌కు ఈ పోర్టల్ ద్వారా రిమైండ్స్ పంపనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో నివేదికలు సమర్పించకూడదని భావించే రాజకీయ పార్టీలు దాని కారణాలను లిఖితపూర్వకంగా ఎన్నికల సంఘానికి తెలియజేస్తూ నిర్ణీత ఫార్మాట్‌లో సీడీలు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ కాపీల్లో నివేదికలను సమర్పించవచ్చన్నారు. ఇలా ఎందుకు ఆన్‌లైన్‌లో సమర్పించలేదో రాసే లేఖతో పాటు ఆ పార్టీల నివేదికలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తామన్నారు.

కోర్టుల్లో తప్పుడు పిటిషన్లు వేయడం దుర్మార్గం

1,011వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కులవాదులంతా కలిసి బాబు అండ్ కో ఆధ్వర్యంలో అమరావతి ముసుగులో కోర్టుల్లో తప్పుడు పిటిషన్లు వేయడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 1,011వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలకు ఈ ప్రాంతంలో ఇళ్లు కట్టుకునే హక్కు లేకుండా చేయాలని చూడడం కులోన్మాదం కాదా... అని ప్రశ్నించారు. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల గర్భిణికి ప్రభుత్వాస్పత్రిలో సిజేరియన్

తిరుపతి తుడా: యాభై ఏళ్ల గర్భిణికి తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో వైద్యులు విజయవంతంగా సిజేరియన్ చేశారు. ఆమె కవలలకు జన్మనిచ్చింది. చిత్తూరు జిల్లా వరత్తూరుకి చెందిన కన్నారెడ్డి భార్య సిద్ధమ్మ (50) ఇటీవల 8 నెలల గర్భంతో ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి బుధవారం తెలిపారు. పెళ్లయిన చాలా ఏళ్ల పాటు సిద్ధమ్మకు పిల్లలు లేకపోవడంతో ఐవీఎఫ్ ద్వారా చెన్నైలో సంతానోత్పత్తి కేంద్రం సహాయంతో గర్భం దాల్చినట్లు చెప్పారు. వైద్యానికి డబ్బులు లేకపోవడంతో గర్భవతిగా ఎనిమిదో నెలలో మెటర్నిటీ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. గత నెల 23న డాక్టర్ సునీత, డాక్టర్ సంధ్యతో కూడిన వైద్యుల బృందం ఆమెకు సిజేరియన్ చేశారన్నారు. మగ పిల్లలు ఇరువురు 2.1కిలోలు, 2కిలోలు బరువు ఉన్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న తల్లీబిడ్డలను మంగళవారం డిశ్చార్జి చేశామని చెప్పారు.

ప్రతి శుక్రవారం ఉమెన్ రెస్పెక్ట్ డే: వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో మహిళలపై అభ్యంతరకర పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ చెప్పారు. ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉమెన్ రెస్పెక్ట్ డే (మహిళా ఆత్మగౌరవ దినం)గా పాటిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. బుధవారం విజయవాడలో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో రాతియుగం కంటే ఘోరమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహిళలను అగౌరవపరుస్తూ పోస్టులు పెట్టినా, అసభ్యకరంగా ప్రవర్తించినా దిశ, సైబర్ మిత్ర యాప్‌ల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విజయవాడ మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు శ్రీశైలజా రెడ్డి, బెల్లం దుర్గా తదితరులు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన మహిళా ప్రతినిధులు మహిళా సమస్యలపై కమిషన్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రమిచ్చారు.

రేపటి నుంచి ఏయూలో డిజైన్ థింకింగ్‌పై సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్, ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్ ఆధ్వర్యాన ఈ నెల 7, 8 తేదీల్లో 'డిజైన్ థింకింగ్ ట్రాన్స్ డిసిప్లినరీ చాలెంజెస్, ఆపర్చునిటీస్' అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి తెలిపారు. విశాఖ బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఈ సదస్సును కేంద్ర సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అప్పటికప్పుడే... 10.86 లక్షల సమస్యలకు పరిష్కారం

- ఇప్పటివరకు 3,339 సచివాలయాల వద్ద జగనన్న సురక్ష క్యాంపులు
- బుధవారం 625 సచివాలయాల వద్ద కొనసాగిన క్యాంపులు
- 80 శాతానికి పైగా ప్రజల సమస్యలను తీర్చిన ప్రభుత్వం



కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి, అమరావతి: ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తక్షణమే తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష క్యాంపుల్లో ఇప్పటివరకు 10.86 లక్షల ప్రజల సమస్యలు పరిష్కారమయ్యాయి. వీటిని ప్రజల నుంచి వినతులు అందిన వెంటనే అప్పటికప్పుడే.. అక్కడికక్కడే పరిష్కరించారు. రాష్ట్రంలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజుల్లో బుధవారం వరకు మొత్తం 10,86,727 వినతులను అప్పటికప్పుడే, అక్కడికక్కడే క్యాంపుల్లో అధికారులు పరిష్కరించారు. ప్రతి సంక్షేమ పథకం, ప్రభుత్వ ఆఫీసుల్లో జారీ అయ్యే వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల మంజూరు వంటివాటికి సంబంధించిన అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వలంటీర్ల ఆధ్వర్యంలో ఇంటింటా అర్హులను జల్లెడ పట్టి.. వారికి ఆయా సేవలను అందజేస్తోంది.

సచివాలయాలవారీగా 31 వరకు నిర్వహణ..

అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద శనివారం (జూలై 1) నుంచి మొదలుపెట్టి ఈ నెల 31 వరకు ప్రభుత్వం క్యాంపులు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు.. 1వ తేదీన 1,305 సచివాలయాల వద్ద, 3న 387 సచివాలయాల వద్ద, 4న 1,022 సచివాలయాల వద్ద, 5 (బుధవారం)న మరో 625 సచివాలయాల వద్ద క్యాంపులు పూర్తయినట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు వెల్లడించారు. దాదాపు 36.30 లక్షల కుటుంబాలు నివాసం ఉండే పరిధిలో మొత్తం 3,339 సచివాలయాల వద్ద క్యాంపుల నిర్వహణ పూర్తయినట్టు తెలిపారు. ఈ సచివాలయాల పరిధిలో జరిగిన క్యాంపుల్లో వివిధ రకాల సమస్యలపై 13.10 లక్షల వినతులు అందాయి. ఇందులో 80 శాతానికి పైగా అంటే 10,86,727 వినతులను అధికారులు అప్పటికప్పుడే పరిష్కరించారు. వీటిలో హౌస్ హోల్డ్ లిస్టులో మార్పులుచేర్పులతోపాటు విద్యార్థులకు సంబంధించి ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల జారీ వంటివి ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటిదాకా జరిగిన క్యాంపుల్లో అందిన వినతుల్లో ఇంకా 2.22 లక్షలు పరిష్కరించాల్సి ఉందన్నారు. అవి కూడా ఆయా శాఖల అధికారుల పరిశీలనలో ఉన్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ వర్గాలు తెలిపాయి.



దిగులు తీర్చిన సురక్ష

ఏ సర్టిఫికెట్ ఎవరిస్తారో తెలియదు. ఎవరికి దరఖాస్తు చేయాలో తెలియదు. మనకిక ప్రభుత్వ సాయం అందదులే అనుకుంటున్న వారి ఇంటికి.. వలంటీర్లే వచ్చి ఏ సర్టిఫికెట్లు కావాలి అని అడిగి మరీ సేవలు చేస్తుంటే.. ప్రజల ముఖాల్లో ఆనందం అంతా ఇంతా కాదు. జగనన్న సురక్ష శిబిరాల్లో లబ్ధిదారులు ఈ ప్రభుత్వం చేస్తున్న మేలును వేనోళ్ల కొనియాడుతున్నారు. కొంతమందికి ఇంటి వద్దే వలంటీర్లు సర్టిఫికెట్లు అందజేస్తుంటే.. ఇలాంటి సర్కార్‌ను ఎప్పుడూ చూడలేదంటూ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా సురక్ష శిబిరాలు ఉత్సాహంగా జరిగాయి. వేలాది మంది ఇందులో లబ్ధిపొందారు. - సాక్షి నెట్‌వర్క్

పెన్షన్ కోసం సదరం సర్టిఫికెట్



జగనన్న సురక్షలో అధికారుల నుంచి సదరం సర్టిఫికెట్ అందుకుంటున్న ఈమె పేరు షేక్ మీరాబీ. పల్నాడు జిల్లా కారెంపూడి మండలం చినకొదమగుండ్ల గ్రామం. మూడు నెలల క్రితం ఆమె భర్త షేక్ ఖాదర్‌కు ఇన్‌ఫెక్షన్ సోకడం వల్ల కుడి కాలు తీసేశారు. గతంలో ఇద్దరు పని చేసుకుంటూ జీవనం సాగించారు. 3 నెలలుగా భర్త మంచానికే పరిమితం కావడంతో పోషణ కష్టమైంది. దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పలువురు మీరాబీకి సలహా ఇచ్చారు. ఈ విషయాన్ని వలంటీర్‌కు చెప్పగా.. వారితో దరఖాస్తు చేయించారు. బుధవారం జరిగిన గ్రామ సభలో సదరం సర్టిఫికెట్‌ను మీరాబీకి అధికారులు అందించారు. పింఛన్‌కు కూడా అధికారులు దరఖాస్తు చేయించి మంజూరుకు సిఫార్సు చేశారు. త్వరలో దివ్యాంగుల పింఛన్ వస్తుందని తెలిసి మీరాబీ సంతోషానికి అవధులు లేవు. ఎంతో దిగులుతో ఉన్న తనకు సురక్ష శిబిరాల ద్వారా జగనన్న ఎంతో మేలు చేశారంటూ ఆమె కన్నీళ్లతో సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఒక్క రోజులోనే కుల ధ్రువీకరణ పత్రం



ఈమె పేరు సీసా మచ్చాలి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం డి.గొందూరు గ్రామం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కులధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా, రెండుమూడు సార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. చివరికి నెల రోజుల తర్వాత ఆ పత్రం ఇచ్చారు. ఇప్పుడు మరోసారి కులధ్రువీకరణ పత్రం అవసరం కావడంతో జగనన్న సురక్ష ద్వారా దరఖాస్తు చేసుకుంది. ఒక్కరోజులోనే పైసా ఖర్చు లేకుండా అధికారులు పత్రం అందజేశారు. సర్టిఫికెట్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పించిన జగనన్నకు థ్యాంక్స్ అంటూ ఆనందం వెలిబుచ్చారు.

సులువుగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్



కాకినాడ జిల్లా, కిర్లంపూడి మండలం, గెద్దానాపల్లికి చెందిన జల్లిగంపల పోలారావు ఉన్నత చదువులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ అవసరమైంది. జగనన్న సురక్షలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు అతని ఇంటికి వెళ్లినప్పుడు ఆ సర్టిఫికెట్ కోసం.. అతని దగ్గర నుంచి సర్టిఫికెట్ కోసం వివరాలు, జిరాక్స్‌లు తీసుకుని అధికారులకు అందజేశారు. వారు ఆ దరఖాస్తును పరిశీలించి బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా సర్టిఫికెట్ ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీలకు సీఎం వైఎస్ జగన్ అండ

- నాలుగేళ్లుగా ఆనందంగా జీవిస్తున్నారు
- అది జీర్ణించుకోలేకే 'ఈనాడు' తప్పుడు రాతలు
- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్



కైలే అనిల్‌కుమార్



బొమ్మి ఇజ్రాయెల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉండటం వల్లే వారు సురక్షితంగా జీవించగలుగుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ అన్నారు. చంద్రబాబు జమానాతో పోల్చితే సీఎం జగన్ హయాంలో ఎస్సీ, ఎస్టీల మీద వేధింపులు తగ్గాయని తెలిపారు. లక్ష మంది ఎస్సీ, ఎస్టీల జనాభాకు నమోదైన కేసుల సగటును ఒకసారి పరిశీలిస్తే వాస్తవాలు అర్థం అవుతాయన్నారు. బుధవారం వారు వేర్వేరుగా 'సాక్షి'తో మాట్లాడారు. 2014–18 మధ్య చంద్రబాబు పాలనలో ఎస్సీలపై 3,418 వేధింపు కేసులు (ఏటా సగటున 854), ఎస్టీలపై 31 (ఏటా సగటున 8) తెలిపారు. 2019–22 మధ్య సీఎం వైఎస్ జగన్ పాలనలో ఎస్సీలపై 2,349 (ఏటా సగటున 783), ఎస్టీలపై 21 (ఏటా సగటున 7) కేసులు మాత్రమే నమోదయ్యాయని వివరించారు. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా 'ఈనాడు' బుధవారం 'జగన్ పాలనలో ఎస్సీ ఎస్టీలకు దక్కని అండ' అంటూ తప్పుడు రాతలు రాసిందని మండిపడ్డారు. రామోజీ భావించినట్లుగా సీఎం జగన్ ఎక్కడా చట్టానికి తూట్లు పొడవలేదని చెప్పారు. చంద్రబాబు కోసం రామోజీరావు.. దళితుల భుజాలపై తుపాకీ పెట్టి సీఎం జగన్‌కు గురిపెట్టారని ధ్వజమెత్తారు.

ఎస్సీ, ఎస్టీలు ఇప్పుడే గుర్తుకొచ్చారా?

కళ్లులేని కబోధి రామోజీరావుకు ఎస్సీ, ఎస్టీలు ఇప్పుడే ఎందుకు గుర్తుకొచ్చారని అనిల్ కుమార్, బొమ్మి ఇజ్రాయెల్‌లు ప్రశ్నించారు. అసలు దళిత ద్రోహి అంటే రాష్ట్రంలో ముందుగా చెప్పుకునేది చంద్రబాబు గురించే అనే విషయం రామోజీకి తెలియదా? అని నిలదీశారు. రాష్ట్రంలో ఎక్కడైనా దళితులపై దాడులు జరిగితే తొలుత ఖండించేది సీఎం జగనేనన్నారు. సీఎం ప్రజారంజక పాలన వల్లే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల జీవన శైలిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. దళితుల పుట్టుకనే అవమానించిన చంద్రబాబును ఎవరూ మరచిపోరన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంపై ఎవరెన్ని కుట్రలు పన్నినా ఫలితం ఉండదని, దళితుల సహకారంతో వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

మతతత్వ పార్టీలకు ఆదరణ ఉండదు

- చిట్‌ఫండ్ యాక్ట్ వర్తించదంటున్న మార్గదర్శిపై కేసులు పెట్టరా?
- పవన్ కళ్యాణ్ ప్రసంగాల వల్ల అయోమయం ఏర్పడింది
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



సాక్షి, అమరావతి: బీజేపీ వంటి మతతత్వ పార్టీలకు దక్షిణాది రాష్ట్రాల్లో పెద్దగా ఆదరణ ఉండదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర వేదిక ఆధ్వర్యంలో ఫిల్మ్ చాంబర్ హాల్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. చిట్‌ఫండ్ చట్టాలను పాటించాల్సిన అవసరం లేదని మార్గదర్శి నిర్వాహకులు చెబుతున్నారని, అలాంటి వారిపై ఎందుకు కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తామంటున్న యూనిఫామ్ సివిల్ కోడ్ అనవసరమని, దానికంటే ముందు దేశంలో ఆర్థిక అసమానతలు తొలగించే దిశగా దృష్టి సారించాలని కోరారు. దీనిపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన వ్యతిరేకమా, అనుకూలమా అనే దానిపై వైఖరి ఏమిటో వెల్లడించాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో వివాహ, విడాకుల సంప్రదాయం ఒక్కోలా ఉంటుందని, అన్నిటికీ ఒకే విధానాన్ని తీసుకురావడం సమంజసం కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వైఎస్ షర్మిల వస్తే కాంగ్రెస్‌కు కచ్చితంగా మంచి జరుగుతుందన్నారు.

ప్రతిపక్షాల సమావేశ ప్రభావం ఉంటుంది

కేంద్ర ప్రతిపక్షాలు బెంగళూరులో ఏర్పాటు చేస్తున్న సమావేశ ప్రభావం కచ్చితంగా ఉంటుందని ఉండవల్లి అన్నారు. రాష్ట్ర విభజనపై కేంద్రంతోను, పార్లమెంట్‌తోను, స్పీకర్‌తోను తాను గొడవ పడుతుంటే సీఎం వైఎస్ జగన్ మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు వచ్చే సర్వేలు చివరి నిమిషంలో మారే అవకాశం ఉందని, రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుందని పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వారాహి యాత్రలో ఆయన ప్రసంగాలు అయోమయానికి గురి చేసేవిగా ఉన్నాయన్నారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ ఎందుకు దెబ్బతిన్నదో, బాధ్యులెవరో, దానిని పునరుద్ధరించడానికి ఎంత ఖర్చువుతుందో, అసలు పోలవరం ప్రస్తుత పరిస్థితి ఏమిటనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. రూ.కోటి 64.5 లక్షల కోట్లు అప్పులు చేసిన కేంద్రాన్ని అధికార, ప్రతిపక్షాలు ఒక్కమాట కూడా ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. మన రాష్ట్రం నుంచి వెళ్లిన పన్నుల సొమ్ము మొత్తం కేంద్రం ఇస్తే మనకు సరిపోతుందని.. అప్పులు చేయక్కర్లేదని అన్నారు.

పార్టీ చూడకుండా పెన్షన్



శివపార్వతికి పింఛను ఇస్తున్న సచివాలయ ఉద్యోగి

మేదరమెట్ల: పార్టీ చూడకుండా నిజమైన లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహాయం చేస్తుంది అనడానికి ఇది మరో ఉదాహరణ. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని పమిడిపాడుకు చెందిన బొద్దులూరి శివపార్వతి కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె భర్త కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారు టీడీపీ సానుభూతిపరులు కాగా, ఏ ఆధారం లేని ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్ ఆమె వివరాలను తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి పంపారు. అక్కడి నేతలు ఆమెకు కిడ్నీ బాధితులకు ఇచ్చే పింఛన్ మంజూరు చేయాలని అధికారులను కోరారు. దీంతో ఆమెకు పింఛన్ మంజూరు కాగా, సచివాలయ ఉద్యోగి అంకమ్మరావు బుధవారం పింఛన్ రూ.10 వేలను శివపార్వతికి అందజేశారు.

ఎరువులు ఫుల్.. ఇబ్బందులు నిల్

స్థానిక అవసరాలకు తగినట్టుగా ఆర్బీకేలు, సొసైటీల్లో ముందస్తు నిల్వకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: పక్కా ప్రణాళికతో ఎరువుల సరఫరాకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రైతు భరోసా కేంద్రాలతోపాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(సొసైటీలు)లో కూడా ఇబ్బంది లేకుండా సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉంచేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ఎరువులు అందుబాటులో లేవన్న మాట వినిపించకూడదన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామస్థాయిలో నిల్వ చేసేందుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేస్తోంది. సాధారణంగా డిమాండ్‌లో 25 శాతం ఎరువులను మార్క్‌ఫెడ్ ద్వారా బఫర్ స్టాక్ స్కీమ్ కింద సరఫరా చేస్తుంటారు. ఈసారి డిమాండ్‌లో 50 శాతానికి పైగా ఎరువులను తొలిసారి మార్క్‌ఫెడ్ ద్వారానే సరఫరా చేయబోతున్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఖరీఫ్‌కు 14.74 లక్షల టన్నులు, రబీకి 20.67 లక్షల టన్నుల చొప్పున మొత్తం 35.41 లక్షల టన్నులు ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఆర్బీకేల ద్వారా కనీసం 10.50 లక్షల టన్నుల ఎరువుల్ని సరఫరా చేయాలని నిర్ణయించారు. మరో 7.23 లక్షల టన్నులను సొసైటీల ద్వారా సరఫరాకు ఏర్పాట్లు చేశారు. మిగిలిన ఎరువులను ప్రైవేటు డీలర్ల ద్వారా సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

గోదాములున్న సొసైటీలకు ప్రాధాన్యత

ప్రతి ఆర్బీకేకు కనీసం 20 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన ఎరువులను జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోడౌన్లలో నిల్వ చేసి అక్కడ నుంచి సొసైటీలు, ఆర్బీకేలకు ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. ఇందుకు ఏటా రూ.70 కోట్లకు పైగా ఖర్చవుతోంది. ఈ భారాన్ని మూడేళ్లుగా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ ఏడాది నిల్వ సామర్థ్యం పెంచనుండటంతో కనీసం రూ.150 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పంపిణీలో జాప్యాన్ని నివారించేందుకు రైల్వే ర్యాక్‌ల నుంచి నేరుగా ఆర్బీకేలు, సొసైటీలకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్బీకేలకు ఎరువుల లైసెన్సులు కూడా జారీ చేశారు.

సొసైటీలకు డిమాండ్ మేర సరఫరా

ఆర్బీకేల ద్వారా సరఫరాకు ప్రాధాన్యతనివ్వడం వలన సొసైటీలకు సరిపడా ఎరువులను కేటాయించడం లేదంటూ ఇటీవల కాలంలో వస్తున్న విమర్శలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆర్బీకేలతో పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే సొసైటీలకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు. మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో బుధవారం డీసీఎంఎస్ చైర్మన్లతో భేటీ అయిన మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే ఎరువుల పంపిణీపై దిశానిర్దేశం చేశారు.

రాజ్యాధికారంలో బీసీలకు భాగస్వామ్యం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దే

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సీఎం జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాధికారంలో బీసీలకు 65 శాతానికి పైగా వాటా ఇచ్చిన ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీల పక్షపాతిగా వైఎస్ జగన్ బీసీల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బీసీ బిల్లుకు మద్దతుగా నిలబడతానన్న సీఎం వైఎస్ జగన్‌ను మిగతా రాష్ట్రాల సీఎంలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని, ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ మద్దతు తెలపాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను ఆర్.కృష్ణయ్య సమక్షంలో ఏపీ బీసీ సంఘం ప్రతినిధి బృందం కలిసి బీసీల డిమాండ్లపై వినతి పత్రం ఇచ్చింది. కృష్ణయ్య వెంట బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ మారేష్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అథవాలేను కలిసి బీసీల డిమాండ్లపై చర్చించింది.

వైద్యశాఖలో 2,118 పోస్టుల మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మూడు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభించేందుకు వీలుగా కీలక ముందడుగు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో మూడు వైద్య కళాశాలలను కొత్తగా ప్రారంభించేందుకు వీలుగా కీలక ముందడుగు పడింది. ఇందులో భాగంగా ప్రభుత్వం 2,118 పోస్టులను కొత్తగా మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడం కోసం ప్రభుత్వం 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూడేళ్ల వ్యవధిలో ఈ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు చేపట్టి కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళికలు రచించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్కోచోట 150 సీట్ల చొప్పున 750 ఎంబీబీఎస్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఇదిలావుండగా వచ్చే విద్యా సంవత్సరంలో ఏఎస్ఆర్ జిల్లా పాడేరు, వైఎస్సార్ జిల్లా పులివెందుల, కర్నూలు జిల్లా ఆదోని వైద్య కళాశాలల కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఒక్కో చోట వైద్య కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 2,118 పోస్టులను కొత్తగా సృష్టించారు. ఇప్పటికే ఈ మూడు చోట్ల ఉన్న ప్రభుత్వాస్పత్రులను ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా 330 పడకల స్థాయికి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో 16 యూనిట్లతో ఆయా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడానికి వీలుగా అడిషనల్ డీఎంఈ హోదాలో సూపరింటెండెంట్, వివిధ పోస్టులను సృష్టించారు. అదేవిధంగా వైద్య కళాశాలకు సంబంధించి అడిషనల్ డీఎంఈ హోదాలో ప్రిన్సిపాల్, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, సైకియాట్రీ, జనరల్ సర్జరీ వంటి వివిధ విభాగాలు ఏర్పాటు, పరిపాలన విభాగాలకు సంబంధించిన పోస్టులను మంజూరు చేశారు. ఇదిలావుండగా అన్నమయ్య జిల్లా మదనపల్లి, ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఏర్పాటు చేస్తున్న కొత్త వైద్య కళాశాలల్లో కూడా వచ్చే ఏడాది నుంచి అకడమిక్ కార్యకలాపాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని డీఎంఈ డాక్టర్ నరసింహం 'సాక్షి'తో చెప్పారు. కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణ పనులు ఈ రెండుచోట్ల వేగంగా పూర్తవుతున్న నేపథ్యంలో 2025–26కు బదులు 2024–25లో వీటిని అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ రెండు చోట్ల పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నామన్నారు.

డిసెంబర్‌లోపు 10 లక్షల ఇళ్ల పంపిణీ

- గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- ఘనంగా ఏపీ గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

సాక్షి,, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద వచ్చే నెలలో 5 లక్షలు, డిసెంబర్ నెలాఖరు నాటికి మరో 5 లక్షలు చొప్పున మొత్తం పది లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. ఏపీ గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో గూడు లేని పేదల గోడు తెలుసుకున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్ష మందికి పైగా ఇళ్ల పట్టాల పంపిణీ చేయడంతోపాటు 21లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించారన్నారు. దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో కరోనా వల్ల రెండేళ్లు పనులు చేయలేని పరిస్థితి నెలకొందని, మిగిలిన రెండేళ్లలోనే ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తోందన్నారు. గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దావులూరి దొరబాబు మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణంలో సంస్థ ఉద్యోగుల కృషి ఎంతో ఉందని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ వచ్చే రెండేళ్లు ఇళ్ల నిర్మాణంలో ఎంతో కీలకమని, ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశ మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసి 44 ఏళ్లు పూర్తయిందని, ఇప్పటి వరకు 77 లక్షల ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎండీ శ్రీధర్, సీఎం అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు, సంయుక్త కార్యదర్శి భరత్‌గుప్తా, సంస్థ జేఎండీ శివప్రసాద్ పాల్గొన్నారు. గృహనిర్మాణసంస్థ డైరెక్టర్లు, ఉద్యోగులను మంత్రి సన్మానించారు.



అట్టడుగున ఎప్పుడూ క్షమ కనబడే
లోతైన అగాథం... ఒక తల్లి హృదయం.
- హానోరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 6 జూలై 2023

అది మన నిర్లక్ష్యానికి మూల్యమే!

నెల రోజుల క్రితం దిగ్భ్రాంతికి గురిచేసిన ఒరిస్సా ఘోర రైలు ప్రమాద ఘటనకు కారణాలు ఇప్పుడిప్పుడే విచారణలో బయటకొస్తున్నాయి. గడచిన మూడు దశాబ్దాలలో అతి దారుణమైనదిగా నమోదైన ఈ ప్రమాదానికి మానవ తప్పిదం, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలే కారణమని రైల్వే శాఖ దర్యాప్తులో వెల్లడైనట్టు వస్తున్న వార్తలు మన భారతీయ రైల్వేలోని లోపాలకు అద్దం పడుతున్నాయి. అనేక స్థాయుల్లో లోపాల వల్లే 293 మంది ప్రాణాలను బలిగొన్న బాలాసోర్ ప్రమాదం జరిగినట్టు రైల్వే భద్రతా కమిషనర్ (సీఆర్‌ఎస్) ఎ.ఎం. చౌధరి తన దర్యాప్తు నివేదికలో తేల్చినట్టు తాజా సమాచారం. దాదాపు 1200 మందికి పైగా గాయపడిన ఈ ప్రమాదంపై భద్రతా కమిషనర్ దర్యాప్తు ఏం చెబుతుందా ఎదురుచూస్తున్న వేళ ఎట్టకేలకు గత నెల 28న నివేదికను రైల్వే బోర్డుకు సమర్పించారు. మరోపక్క కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సైతం ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందా అని నేర దర్యాప్తు చేస్తున్నందున ఈ తొలి నివేదికను బయటపెట్టడం లేదు. అయితేనేం, వివిధ మార్గాల్లో బయట కొచ్చిన ఈ నివేదికలోని అంశాలు మిగిలిన దర్యాప్తుకూ, సత్వరం చేపట్టాల్సిన చర్యలకూ స్పష్టమైన సూచికలుగా నిలిచాయి.

రైల్వే సిబ్బందిని విచారించి, వాఙ్మూలాలను నమోదు చేసుకొని, అలాగే ప్రమాద స్థలం, రైల్వే ఆస్తులకు సంబంధించిన వివిధ కోణాలను పరిశీలించాక సీఆర్‌ఎస్ నివేదికను సిద్ధం చేశారు. దాదాపు 40 పేజీల నివేదికలో అవన్నీ పేర్కొన్నారు. ఒరిస్సాలోని బాలాసోర్ వద్ద బాహానగా బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో జూన్ 2న జరిగిన ఈ రైలు ప్రమాదంలో చెన్నై – కోల్‌కతా 'కోరమాండల్ ఎక్స్‌ప్రెస్' అప్ – లూప్ లైనులోకి ప్రవేశించి, అప్పటికే ఆ లైనులో ఉన్న ఓ గూడ్స్ రైలును గుద్దుకుంది. అలా ఆ రెండు రైళ్ళు గుద్దుకోవడంతో బోగీలు పట్టాలు తప్పి, పక్కనే మరో పట్టాలపై వెళుతున్న బెంగుళూరు – హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లోని చివరి కొద్ది బోగీలపై పడడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఎస్ అండ్ టి) విభాగంలో అనేక స్థాయుల్లో లోపాలతోనే ఇంతటి ప్రమాదానికి కారణమైందన్న నివేదిక సారాంశం అత్యంత కీలకం.

ఈ ఘోర రైలు ప్రమాదానికి ప్రాథమిక కారణమేమిటనే విషయంలో నెలకొన్న గందరగోళాన్ని సీఆర్‌ఎస్ నివేదిక పోగొట్టిందనే చెప్పుకోవాలి. ప్రధానంగా మూడు అంశాలను ఈ నివేదిక బయట పెట్టింది. ఒకటి – గతంలో 2018లో ఒకసారి, తాజా ప్రమాద ఘటనకు కొద్ది గంటల ముందు మరోసారి చేసిన మరమ్మతులు అరకొరగా, నిర్లక్ష్యపూరితంగా సాగాయి. ఫలితంగా సిగ్నలింగ్ వ్యవస్థ రాజీ పడ్డట్టయింది. రెండు – పదేపదే చేస్తూ వచ్చిన తప్పుల్ని ముందుగా పసిగట్టివుంటే, ఈ ఘోరం జరిగి ఉండేది కాదు. వివరంగా చెప్పాలంటే, 2018లో కేబుల్ లోపం తలెత్తింది. దాన్ని సరిచేసినా, కీలకమైన సర్క్యూట్ బోర్డ్‌పై దాన్ని మార్క్ చేయలేదు. లోపం సరిచేసేందుకు అప్పట్లో సర్క్యూట్ షిఫ్టింగ్ పని చేశారు. అందుకు ప్రామాణిక పద్ధతులేమీ పాటించనే లేదు. పైపెచ్చు టెర్మినల్స్ మీద అక్షరాలు తప్పుగా పేర్కొన్నారు. అయిదేళ్ళుగా అలక్ష్యం చేసిన ఆ లోపభూయిష్ఠమైన పని ఇప్పుడు ప్రాణాల మీదకు తెచ్చింది. మూడు – తప్పుడు వైరింగ్, కేబుల్ ఫాల్ట్ వల్ల తలెత్తే సమస్యలేమిటో నిరుడు పశ్చిమ బెంగాల్‌లోనే చూశారు. అయినా సరే దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు.

అలాగే బాహానగా బజార్ రైల్వేస్టేషన్‌కు సరిపడేలా ముందస్తు ఆమోదంతో సర్క్యూట్ డయాగ్రమ్‌ను మార్చి ఉన్నా రాంగ్ సిగ్నలింగ్ అయ్యేది కాదు. ఈ ఘోరం జరిగేది కాదు. ఎస్ అండ్ టి విభాగాన్ని వేలెత్తి చూపే ఈ లోపాలే కీలకమైన వేళ ఘోర ప్రమాదానికి కారణమై, అమాయకుల్ని బలిగొన్నాయని నివేదిక చెబుతున్న మాట. ఇక, రైల్వేలలో ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిగ్నలింగ్ విధానానికి కీలక కేంద్రస్థానం రిలే రూమ్. రైళ్ళను నియంత్రించే మెకానిజమ్‌లు, అలాగే లెవల్ క్రాసింగ్‌లకు సంబంధించిన సిగ్నలింగ్ సామగ్రి అయిన 'రిలే హట్స్' ఈ రిలే రూమ్‌లలోనే ఉంటాయి. అలాంటి రూమ్ ఏ స్థాయి వారికి, ఎలా అందుబాటులో ఉండాలనే విషయంలోనూ అనేక లోపాలున్నాయి. సీఆర్‌ఎస్ నివేదిక ఈ సంగతీ వెల్లడించింది. నివేదికను సమర్పణకు సరిగ్గా కొద్ది రోజుల ముందే రిలే రూమ్‌కు ఒకటికి రెండు తాళాలు వేయాలని రైల్వే నిర్ణయించడం గమనార్హం.

ఎప్పుడో 2018లో జరిగిన తప్పు ఇప్పుడు ప్రాణాలు బలి తీసుకుందంటే, క్రమం తప్పకుండా చేయాల్సిన చెకింగ్‌లు సవ్యంగా సాగడం లేదనే! రైల్వే స్టేషన్లలో మార్పులు చేసిన సర్క్యూట్లన్నీ సవ్యంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి, పరీక్షించడానికి ఇకపై ప్రత్యేక బృందాన్ని నియోగించాలని సీఆర్‌ఎస్ సిఫార్సు చేయడం గమనార్హం. అలాగే, ప్రమాద సందర్భంలో సత్వర స్పందనకు జోనల్ రైల్వేలలో ఏర్పాట్లను సమీక్షించాలంది. కళ్ళెదుటే లోపాలు కనిపిస్తున్నాయి గనక ఇకనైనా నిద్ర మేల్కోవాలి. లోపరహిత వ్యవస్థను సృష్టించాలి. అయితే, అందుకు అవసరమైన ప్రాథమిక వసతుల కల్పన ఎంతో ఖర్చుతో, శ్రమతో కూడింది. దీర్ఘకాలికమైన ఆ పని చేయాలంటే రాజకీయ కృత నిశ్చయం ఉండాలి. రైల్వేలో భారీగా పెట్టుబడి పెట్టాలి. పార్టీల తేడాలు లేకుండా కేంద్రంలో గద్దె మీదున్న ప్రతి ప్రభుత్వంలోనూ అవి కొరవడ్డాయి. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే వ్యవస్థల్లో ఒకటైన భారతీయ రైల్వే సవ్యంగా నడవాలంటే బండికి నట్లు, బోల్టులు అన్నీ సక్రమంగా బిగించి ఉండడం అవసరమని ఇకనైనా గ్రహించాలి. ఎడాపెడా వందే భారత్ రైళ్ళ కన్నా ప్రస్తుతం ఇదే ఎక్కువ అవసరం! ఒరిస్సా దుర్ఘటన, దానిపై సీఆర్‌ఎస్ నివేదిక ఆ సంగతే గుర్తు చేస్తున్నాయి. గుర్తుపట్టే నాథుడు లేక ఇప్పటికీ బాలాసోర్‌లో పడివున్న 80కి పైగా మృతదేహాలూ మౌనంగా ప్రశ్నిస్తున్నాయి.

ముఖ్యమంత్రి సలహానే కీలకం

విశ్లేషణ



పి.డి.టి. ఆచారి

ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు ఉందా అనేది కీలకమైన ప్రశ్న. భారత గణతంత్రంలోని గవర్నర్లకు, బ్రిటిష్ కాలంనాటి గవర్నర్ల లాగా మంత్రులను ఎంపిక చేసే అధికారం లేదు. ఆర్టికల్ 164ను రూపొందిస్తున్నప్పుడు, ఒక మంత్రిని ఎంపికచేసే, ఏకపక్షంగా తొలగించే వలసకాల గవర్నర్ అధికారాలను తొలగించారు. సీఎం సిఫార్సు చేసిన వ్యక్తిని మాత్రమే గవర్నర్ నియమించగలరని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. కాబట్టి, ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదనేది స్పష్టం.

ముఖ్యమంత్రి సలహా లేకుండా సిట్టింగ్ మంత్రిని తొలగించడం ద్వారా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి రాజ్యాంగపరంగా అరుదైన సాహసోపేత ప్రయోగం చేశారు. వాస్తవానికి, ఆదేశం జారీ చేసిన కొన్ని గంటల్లో, ఆయన దానిని నిలిపివేశారు. అయినా ఈ చర్య రాజకీయ వర్గాల్లో కలకలం రేపడంతో పాటు రాజ్యాంగవేత్తలను దిగ్భ్రాంతికి గురి చేసింది. అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకోవాలంటూ కేంద్ర హోంశాఖ సూచించిందని అనంతరం గవర్నర్ వెల్లడించారు. దేశంలోని అత్యున్నత న్యాయ అధికారిని సంప్రదించకుండా, ముఖ్యమంత్రి తప్పనిసరి సలహా లేకుండా, అసెంబ్లీలో పూర్తి మెజారిటీ ఉన్న ప్రభుత్వ మంత్రిని తొలగించాలనే అపూర్వమైన ఉత్తర్వు జారీ చేయడం విస్మయం కలిగిస్తోంది.



ముఖ్యమంత్రి సలహా లేకుండా మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు ఉందా అనేది కీలకమైన ప్రశ్న. ఆర్టికల్ 164 ప్రకారం, సీఎం సలహా మేరకు మంత్రులను గవర్నర్ నియమిస్తారు. సీఎం సిఫార్సు చేసిన వ్యక్తిని మాత్రమే గవర్నర్ నియమించగలరని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. తన మంత్రులను ఎంపిక చేయడం లేదా తొలగించడం పూర్తిగా సీఎం ప్రత్యేకాధికారం. ఒక మంత్రిని వద్దనుకుంటే, తదనుగుణంగా గవర్నర్‌కు సలహా ఇస్తాడు. పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని అనుసరించే అన్ని దేశాల్లోనూ ఇదే వాడుకగా ఉంటోంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 164, 'గవర్నర్ సంతుష్టి (ప్లెజర్)తో ఉన్నంతకాలం మంత్రులు తమ బాధ్యతలు నిర్వహిస్తారు' అని చెబుతోంది. ఇది ఒక మంత్రి మనుగడ పూర్తిగా గవర్నర్ ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉందనీ, ఏ మంత్రి పట్ల అయినా గవర్నర్ తన సంతుష్టిని ఉపసంహరించుకోవచ్చనీ అభిప్రాయాన్ని కలిగించవచ్చు. 'గవర్నర్ సంతుష్టి' అనేది ఇక్కడ కీలకమైన అంశం. దాని నిజమైన భావాన్ని అర్థం చేసుకోవాలంటే, మనం భారత ప్రభుత్వ చట్టం, 1935లోని సెక్షన్ 51కి వెళ్లాలి. సెక్షన్ 51లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం, గవర్నర్ తన విచక్షణ మేరకే మంత్రులను పదవుల్లోకి ఎన్నుకోవాలి. అదేవిధంగా సెక్షన్ 51లోని సబ్-సెక్షన్ (5) మంత్రుల ఎంపికకు, తొలగింపునకు సంబంధించి గవర్నర్ తన విధిని విచక్షణతో అమలు చేయాలని చెబుతోంది. ఆ విధంగా, భారత ప్రభుత్వ చట్టం, 1935లోని సెక్షన్ 51, మంత్రులను ఎన్నుకోవడానికీ, వారిని తొలగించడానికీ గవర్నర్‌కు విచక్షణాధికారాలను అందిస్తోంది. సంతుష్ట సిద్ధాంతం ఇక్కడ పూర్తిగా పనిచేస్తోంది.

భారత ప్రభుత్వ చట్టంలోని నిబంధనలను మన రాజ్యాంగం పెద్ద ఎత్తున పునరుత్పాదన చేసిందనేది అందరికీ తెలిసిన విషయమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 163, 164లో సెక్షన్ 51 గణనీయంగా పునరుత్పాదన అయింది. అటువంటి నిబంధనలో సంతుష్ట సిద్ధాంతం ఒకటి. కానీ రాజ్యాంగ నిర్మాతలు దీనికి సంబంధించి కీలకమైన మార్పు చేశారు. ఆర్టికల్ 164ను రూపొందిస్తున్నప్పుడు, వారు ఒక మంత్రిని ఎంపికచేసే, ఏకపక్షంగా తొలగించే వలసకాల గవర్నర్ అధికారాలను తొలగించారు. అంటే భారత గణతంత్రంలోని గవర్నర్లకు, బ్రిటిష్ కాలంనాటి గవర్నర్ల లాగా మంత్రులను ఎంపిక చేసే అధికారం లేదు. పైగా ముఖ్యమంత్రి సలహా లేకుండా మంత్రిని తొలగించే విచక్షణాధికారం గవర్నర్‌కు లేనప్పుడు సంతుష్ట సిద్ధాంతం దాని బలాన్ని కోల్పోతుంది. పైగా రాష్ట్ర కార్యనిర్వాహక అధిపతి అయిన ముఖ్యమంత్రి నుండి సలహా వచ్చినప్పుడు దాన్ని నిర్వర్తించడం లాంఛనప్రాయంగా మారుతుంది. కాబట్టి, ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టంగా నిర్ధారించవచ్చు.

గవర్నర్ తీసుకునే అలాంటి చర్య రాజ్యాంగ వ్యవస్థపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో కూడా మనం తీవ్రంగా పరిగణించాలి. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన గవర్నర్, మంత్రులను ఇష్టానుసారంగా తొలగించడం ద్వారా రాజ్యాంగ వ్యవస్థను అస్థిరపరిచే ప్రమాదం ఉంది. స్వతంత్రంగా అమలు చేయగల కార్యనిర్వాహక అధికారం గవర్నర్‌కు లేదని గుర్తుంచుకోవాలి. ఆర్టికల్ 153 ప్రకారం, రాజ్యాంగంలో పేర్కొన్న విచక్షణ విధులు మినహా, అతని అన్ని విధులు మంత్రిమండలి సహాయం, సలహాపై మాత్రమే నిర్వహించబడతాయి. 1974 నాటి శంశేర్ సింగ్ కేసులో, ఎన్నుకోబడిన ప్రభుత్వానికి సంబంధించినంతవరకు గవర్నర్ అధికారాలకు సంబంధించిన చట్టాన్ని సుప్రీంకోర్టు స్పష్టంగా నిర్దేశించింది. తదుపరి నిర్ణయాలన్నీ దానిని పునరుద్ఘాటించాయి. కాబట్టి, మన రాజ్యాంగ వ్యవస్థలో గవర్నర్ స్థానంపై చట్టం స్థిరపడింది.

అలాగే, మంత్రిని నియమించడం లేదా తొలగించడంలో గవర్నర్‌కు విచక్షణాధికారం లేదని ఆర్టికల్ 164 స్పష్టం చేసింది. రెండూ సీఎం పరిధిలోనే ఉన్నాయి. గవర్నర్‌పై కాకుండా సీఎం విశ్వాసం ఉన్నంత వరకు మాత్రమే మంత్రులు క్యాబినెట్‌లో ఉండగలరు.

గవర్నర్ అత్యున్నత రాజ్యాంగ కార్యనిర్వాహకుడు. ఆయన ఆదర్శప్రాయమైన నిష్పాక్షికతతో వ్యవహరించాలి. క్రియాశీల రాజకీయ నాయకులను గవర్నర్లుగా నియమించకూడదని రాజ్యాంగ అసెంబ్లీలో కొంతమంది సభ్యుల నుండి డిమాండ్ వచ్చింది. అటువంటి సూచనలు ఆ సమయంలో తీసుకోనప్పటికీ, రాజకీయ నాయకులు లేదా మాజీ అధికారులు రాజ్‌భవన్‌లో పని చేసిన సమయంలో ప్రశంసనీయంగా పనిచేశారు. ఈ మహోన్నతమైన, ముఖ్యమైన రాజ్యాంగ పదవిని స్వీకరించే స్త్రీ పురుషులకు ఉంటున్న అనుకూలత, అర్హతల గురించి భారతీయ సమాజం చర్చను ప్రారంభించాల్సిన సమయం ఇది. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా కొన్ని రాష్ట్రాల్లో రాజకీయాల కేంద్రం మెల్లగా రాజ్ భవన్ వైపు మొగ్గుతోంది. ఇది కచ్చితంగా సానుకూలమైన ఆలోచన మాత్రం కాదు.

వ్యాసకర్త లోక్‌సభ మాజీ కార్యదర్శి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అయ్యో పాపం!



తెలంగాణ బీజేపీలో చిత్రమైన పరిస్థితి. పదవి వీడుతున్న, పదవిలోకి వస్తున్న రాష్ట్రాధ్యక్షులు ఇద్దరూ వారి నియామకాల పట్ల సంతోషంగా లేరు.

– నిస్తులా హెబ్బర్, జర్నలిస్ట్

అదరగొట్టారు!



శక్తి, పట్టుదల, ఉక్కు నరాలను చూపిన అద్భుతమైన ప్రదర్శన! సౌత్ ఏసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న మన భారత జట్టుకు అభినందనలు.

– సచిన్ టెండూల్కర్, క్రికెటర్

పరిణామ క్రమం



నెమ్మదిగానే అయినప్పటికీ, ముల్లాలు కూడా పరిణామం చెందుతున్నారు. 1930లో ముల్లాలు ఫొటోలు తీసుకోవడం హరామ్ (నిషిద్ధం) అనేవారు. 1950 నాటి ముల్లాలు రేడియో వినడం హరామ్ అనేవారు. 1990లో ముల్లాలు టీవీ చూడటం హరామ్ అన్నారు. 2023 ముల్లాలు తమ యూట్యూబ్ ఛానల్‌కు సబ్‌స్క్రయిబ్ చేసుకొమ్మని చెబుతున్నారు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఎలా పెడుతున్నారు?



ఇండియాలో సగటున పది లక్షల మందికి ఉన్న వైద్యుల సంఖ్య: 931. పదిలక్షల మందికి ఉన్న పోలీసుల సంఖ్య: 1,528. అదే ఇండియాలో పది లక్షల మందికి ఉన్న ఎన్జీవోల సంఖ్య: 2,357.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' కన్సల్టింగ్ ఎడిటర్

ఇంత ఘోరమా?



సోషల్ మీడియాలో నేను చూసిన అత్యంత ఘోరమైన విషయం, ఒక అగ్రకులస్థుడు ఒక గిరిజన యువకుడిపై మూత్రవిసర్జన చేయడం. దాన్ని నేను మరిచిపోలేకపోతున్నా. ఇది అత్యంత ఆందోళనకరం. ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా ఇలాంటిది ఎలా జరుగుతున్నదో అర్థం కావడం లేదు.

– రజా అహ్మద్ రూమీ, రచయిత

శిక్ష పడాల్సిందే కానీ...



పర్వేశ్ శుక్లా (గిరిజనుడిపై మూత్ర విసర్జన చేసినవాడు) ఒక నేరస్థుడు. అతడు కఠిన శిక్షకు అర్హుడు. కానీ దానికి అతడి ఇల్లును బుల్‌డోజర్‌తో కూల్చడం పరిష్కారం కాదు. అందులో అతడి కుటుంబం ఉండొచ్చు. ఒక వేళ ఆ ఇల్లు అక్రమ నిర్మాణమైతే, ముందు దానికి అనుమతి ఎలా ఇచ్చారు? బుల్‌డోజర్‌ను వినియోగించే అధికార దుర్వినియోగాన్ని ఇవాళ సమర్థిస్తే, ఏదో ఒకరోజు అదే బుల్‌డోజర్ మిమ్మల్ని కూడా లక్ష్యంగా చేసుకుంటుంది.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

మితమే హితం



టొమాటోల ధర కిలో 102 రూపాయలకు పెరిగింది. హిమాచల్ ప్రదేశ్‌లో యాపిల్స్ పండించే వారికన్నా ఇది ఎక్కువ ధర. ఇందులో రైతులకు పెద్ద సందేశం ఇమిడివుంది. రైతులు తక్కువ ఉత్పత్తి చేయాలి. మిగులు ఉత్పత్తి చేయడాన్ని ఆపాలి. తక్కువ ఉత్పత్తి చేస్తే ఎక్కువ ధరలు వస్తాయి.

– దేవీందర్ శర్మ, వ్యవసాయ రంగ నిపుణులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

సమాన హక్కుల కోసమే...

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో 'ఉమ్మడి పౌర స్మృతి' (యూనిఫామ్ సివిల్ కోడ్) అమలుపై చర్చను రేకెత్తిస్తోంది. పైగా దాని రాజకీయ అజెండాలో అది భాగమై కూర్చుంది. ఈ నేపథ్యం చాలా క్లిష్టమైనది. 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్' అమలులో ఉన్నప్పుడు దీన్ని ఎందుకు అమలు చేయకూడదు అనే విషయాన్ని భారతీయ జనతా పార్టీ దేశ ప్రజల ముందు ఉంచింది. అన్ని వర్గాల ప్రజల అభిమానాలను చూరగొనే కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పౌరస్మృతిని ఎప్పుడో అమలు చేసి ఉండవలసింది. సంతుష్టీకరణ రాజకీయాలతో ఆ పార్టీ ఈ విషయంలో వెనుకడుగు వేసిందని చెప్పాలి. ఉమ్మడి పౌర స్మృతి అమలు గురించి రాజ్యాంగ సభలో అనేక వాదోపవాదాలు జరిగాయి.



చివరికి రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లోని 44 నిబంధనలో దీన్ని చేర్చారు. రాజ్యం దేశ ప్రజలందరికీ ఉమ్మడి పౌరస్మృతి చట్టాన్ని అమలు చేయాలనీ, ఇందుకు దేశ ప్రజల అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలనీ స్పష్టంగా ఈ ఆదేశిక సూత్రం నిర్దేశించింది.

అందుకే 22వ లా కమిషన్ ఈ అంశంపై దేశ ప్రజల అభిప్రాయాలను తెలియజేయండి అని కోరింది. ఉమ్మడి పౌర స్మృతి అమలు అంశం మోదీ ప్రభుత్వం ప్రతి పక్షాలను గోతుల్లో పడేసే కుట్రగా కొందరు మోదీ వ్యతిరేకులు అభివర్ణించడంలో అర్థం లేదు. 1985 షాబానో మనోవర్తిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో యూసీసీ (యూనిఫామ్ సివిల్ కోడ్) అమలు చేయాలని అనేక ప్రజా సంఘాల వాళ్లూ, ప్రజాస్వామ్య వాదులూ రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచారు. వాస్తవంగా న్యాయ వ్యవస్థ అనేక మార్లు యూసీసీ అవసరాన్ని నొక్కి వక్కాణించింది. సరళా ముద్గల్ కేసు తీర్పు (1995)లో లింగ సమానత్వాన్నీ, స్త్రీలకు సమాన హక్కులనూ అందించడానికి ఉమ్మడి పౌర స్మృతి చాలా అవసరమని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొన్నది. బీజేపీ తన హిందూ మత అజెండా అమలులో భాగంగా ఉమ్మడి పౌర స్మృతి పాటను నెత్తికి ఎత్తుకొని రాజకీయ లబ్ధి పొందేందుకు వీలుగా అడుగులు వేస్తోందని ఆ పార్టీని అనవసరంగా దూషించే, ద్వేషించే వారి వాదన పసలేనిదని కోర్టు వ్యాఖ్యలతో రుజువయింది.

ప్రపంచంలోని అన్ని ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో ఉమ్మడి పౌర స్మృతి చట్టాలు అమలౌతున్నాయనేది వాస్తవం కాదా? ఇస్లామిక్ దేశాల్లో షరియా చట్టాన్ని ఉమ్మడి పౌర స్మృతిగా ఆయా దేశాలు అమలు చేస్తున్నాయనేది అక్షర సత్యం. మన దేశంలో పోర్చుగీసు పాలనలో ఉండి, 1961లో విముక్తి పొందిన గోవా రాష్ట్రంలో యూసీసీ అమలులో ఉన్న విషయం తెలిసిందే. పోర్చుగీసు దేశ చట్టాన్నే 1962 గోవా, డామన్, డయ్యూ చట్టం అంగీకరించింది. ఇక చివరగా ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం సమాజంలో అనేక అపోహలున్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి విషయాలలో దేశ ప్రజలు అందరినీ ఒకే చట్టం కిందకి తేవడమే ఉమ్మడి పౌర స్మృతి ముఖ్యోద్దేశం. ఈ విషయంలో ముస్లిం సమాజంలోని మేధావులు, ప్రజాస్వామ్య వాదులు మతకోణం నుండి బయటకి వచ్చి, ఈ దేశంలో ముస్లిం సమాజానికి స్థిరమైన ప్రాతిపదికను ఏర్పరచడం ఎంతో అవసరం.

– ఉల్లి బాల రంగయ్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు

ప్రజాస్వామ్యాన్ని ప్రజలే రక్షించుకోవాలి!

అభిప్రాయం



చాడ వెంకటరెడ్డి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇష్టానుసారం ఎంఎల్ఏలను, ఎంపీలను నయానో భయానో లొంగదీసుకొని ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అత్యంత దుర్మార్గంగా కుప్పకూలుస్తోంది. ఈ వికృత చర్యను మరింత ముందుకు తీసుకుపోయి ప్రతిపక్ష అధికార కూటమిలోనే చీలికలు తీసుకువచ్చి, ఆయా పార్టీల అధ్యక్షుల కుర్చీలకే ఎసరు పెడుతున్నారు. అందుకు తాజా నిదర్శనమే ఎన్సీపీలో చీలిక.

నిరంకుశ, రాజ్యాంగ వ్యతిరేక బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఒక్కటవుతుండడంతో కాషాయ పార్టీకి గుబులు పుడుతోంది. ఇటీవల కర్ణాటకలో బీజేపీ ఓటమితో దక్షిణ భారతంలో ఆ పార్టీకి చోటు లేకుండా పోయింది. ఇంతలో 15 ప్రతిపక్షాలు బిహార్‌లోని పట్నాలో సమావేశమై బీజేపీకి వ్యతిరేకంగా చేతులు కలిపాయి. అందులో శరద్ పవార్ సైతం కీలక పాత్ర పోషించారు. ఈ పరిణామాలతో నిద్రపట్టని బీజేపీ ప్రతిపక్షాలను బలహీన పరచేందుకు మహారాష్ట్రలో కుటిల పన్నాగం పన్నింది. ఇప్పటికే శివసేనను చీల్చి మహారాష్ట్రలోని 'మహా వికాస్ అఘాడీ' ప్రభుత్వాన్ని కూల్చి, దొంగదారిలో బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. తాజాగా ప్రస్తుత రాజకీయాలలో అత్యంత సీనియర్ రాజకీయకుడు, ఎన్సీపీ అధ్యక్షుడు అయిన శరద్ పవార్ సొంత సోదరుని కుమారుడు అజిత్ పవార్‌కు వలవేసి ఎన్సీపీ చీలిపోయేలా చేసింది.

నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన స్వతంత్ర సంస్థలైన ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థల స్వయంప్రతిపత్తిని నీరు గారుస్తోంది. ప్రతిపక్ష ప్రభుత్వాల పట్ల గతంలో ఎన్నడూ లేని విధంగా గవర్నర్ల జోక్యం పెరిగిపోతోంది. ఇది సర్కారియా కమీషన్ సిఫారుసులకు విరుద్ధం. ఇది ఫెడరల్ విధానానికి తిలోదకాలిచ్చే వ్యవహారం. తమిళనాడు గవర్నర్ డీఎంకే మంత్రికి ఉద్వాసన పలికి ఉపసంహరించుకున్న తీరు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌ల గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకునపెడుతున్న తీరు. ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ అడుగడుగునా జోక్యం చేసుకొని ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్న వైనం గవర్నర్ల వ్యవహార శైలికి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'ప్రపంచంలోనే ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లి లాంటిది' అని ఘనంగా చెప్పు



కున్నారు. కానీ ఆయన చేస్తున్నదేమిటి? ప్రతిపక్షాలు లేని ప్రజాస్వామ్యం ఉంటుందా? ఒకవైపు స్వదేశంలో ప్రతిపక్షాలను కక్షపూరితంగా అంతమొందించే అడుగులు కదుపుతూ, మరో వైపు విదేశాలలో ప్రజాస్వామ్య పాఠాలను వల్లె వేస్తున్నారు. భావి తరాలకు ప్రజాస్వామ్యం గురించి తెలియకుండా పాఠ్యాంశాల నుండి ప్రజాస్వామ్యం పాఠాలను తొలగిస్తోంది మోదీ ప్రభుత్వం.

నరేంద్ర మోదీ ప్రమాదకర ధోరణిని గుర్తించిన సీపీఐ 2015లోనే పుదుచ్చేరిలో జరిగిన మహాసభలో దేశం ప్రమాదంలో పడబోతున్నదనీ, అందుకని రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకోవడానికి లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల, వామపక్ష శక్తులతో ఒక వేదిక ఏర్పాటు ఆవశ్యకతను నొక్కిచెపుతూ తీర్మానం చేసింది. అంతేకాదు 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, రాజ్యాంగాన్ని నిలబెట్టుకుందాం, లౌకిక వ్యవస్థను కాపాడుకునే రీతిలో అడుగులు వేద్దామని' తీర్మానించింది. దీనిని ప్రతిపక్షాలు పట్టించుకోలేదు. గత 9 ఏళ్లుగా ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తూ, ప్రశ్నించే గొంతుకులకు కళ్లెం వేస్తూ, రాజద్రోహం కేసులు పెడుతూ, భయభ్రాంతులకు గురిచేస్తున్న తీరు; సీబీఐ కేసులు, న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు పెరిగిపోయాయి. ఈడీ. ఐటీ దాడులూ పెరిగాయి. ఈ తప్పులన్నింటికీ వెల చెల్లించుకునే సమయం బీజేపీ సర్కార్‌కు ఆసన్నమయింది. ఇప్పటికే పట్నాలో ఒకసారి సమావేశమైన 15 ఎన్డీఏ వ్యతిరేక పార్టీలు జూలై 13న బెంగళూరులో రెండోసారి సమావేశం కాబోతున్నట్లు తెలుస్తున్నది. ప్రతిపక్షాల ఓట్లు చీలకుండా పరస్పర పోటీ నివారణకు ఒక అవగాహనకు రావడం మంచి పరిణామమే.

గత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి సీట్లు ఎక్కువగా వచ్చినా ఓట్ల శాతం కేవలం 36.7 శాతం మాత్రమే. అందుకనే ప్రతిపక్షాల ఓట్లు చీలకుండా చేసే ప్రయత్నం ప్రయోజనకారిగా ఉంటుంది.


75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ 50 శాతం పేదరికం ఉందంటే సిగ్గుపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు కొరవడటం, కొనుగోలు శక్తి పడిపోవడం దేనికి సంకేతాలు? ఈ అంశాలపై రాజీలేని పద్ధతులలో పాలకులపై ప్రజలు ఒత్తిడి పెంచాలి. ఎన్నికలంటే జాతర కాదు. అవి ప్రజల భవిష్యత్‌కు బాటలు వేసేవి. పవిత్రమైన ఓటును ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులను మాత్రమే గెలిపించడానికి ఉపయోగించాలి. 2024 ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలా లేదా అనేది ప్రజలే తేల్చుకోవాలి.

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

అపాత్ర దానం తగదు

వ్యవసాయ దారునికి సుక్షేత్రం, నాణ్యమైన విత్తనాలు దొరికితే ఎంత ఆనంద పడతాడో, దాతకు యోగ్యుడైన దాన గ్రహీత, దానమివ్వటానికి తగిన సంపద ప్రాప్తిస్తే అంత కంటే ఎక్కువ సంతోషపడతాడు. హాలికునికి సుక్షేత్రం ఉండి, నాసిరకం విత్తనాలు లభిస్తే మంచి పంట పండదు. అలాగే సంపద మిక్కుటంగా ఉండి, పాత్రుడైన గ్రహీత కాకపోతే, ఆ దానం తృప్తి నివ్వదు. ధనాది సంపదలు దానం చేసేటప్పుడు పాత్రుడైన వ్యక్తికి చేస్తే అది సార్థక మవుతుంది. లేకపోతే వ్యర్థ దానమౌతుంది. ఉత్తమ దానం మనిషిని కీర్తివంతుని చేస్తుంది.

వామనుడు, బలి చక్రవర్తిని మూడడుగుల నేల దానమిమ్మని అడిగాడు. అప్పుడు వామన రూపంలో వచ్చింది విష్ణువనీ, ఇతడు మూడడుగుల పేరుతో ముల్లోకాలను



జ్యోతిర్మయం

ఆక్రమించి, బ్రహ్మాండం అంతటా నిండు తాడనీ, ఈ దానం వద్దనీ గురువు శుక్రాచార్యులు చెపుతాడు. అందుకు బలి... ఎవరైతే ఉత్తమ దానాలూ, సార్థక దానాలూ చేస్తారో వారిని లోకం ఎప్పటికీ మరవదని అంటాడు.

చరిత్రలో ఎంతమంది రాజులు కాలేదు? రాజ్యాలు పొందలేదు? అహంకరించలేదు? వారంతా కాలగర్భంలో కలిసిపోయారు. వారు సంపదను మూటగట్టుకుని పోలేదు. వారి పేరైనా మనం తలచుకోము. కాని, శిబి చక్రవర్తి వంటి ప్రముఖుల్ని ఎప్పటికీ తలచుకుంటున్నాము. వారి త్యాగం, గొప్పదనం అటువంటిది అని చెపుతూ బలి, 'మహిమాన్వితుడైన హరి చేయి కిందది కావటం, దానమిచ్చే నా చేయి పైనది కావటం నాకు మాత్రమే దక్కిన అదృష్టం. ఈ సదవకాశం ముందు రాజ్యం, శరీరం ఇవేవీ ముఖ్యం కాదం'టాడు. ఇక్కడ దాన గ్రహీత సాక్షాత్తూ భగవంతుడైన హరి. ఇంతకంటే ఉత్తమ దానం బలి చక్రవర్తికి ఇంకేముంటుంది? ఉత్తమ దాతలలో మొదటి వరస ప్రముఖులలో బలి పేరుంటుంది.

పాత్రత చూడకుండా చేయగల దానం అన్నదానం ఒక్కటే. ఆకలి ఒక్కటే ఈ దానానికి అర్హత. మిగతావన్నీ పాత్రత, అవసరం ఎరిగి చేయదగ్గ దానాలే! సార్థక దానం వ్యక్తిని ఉత్తమ దాతను చేస్తుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.తదియ ఉ.10.36 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శ్రవణం ఉ.7.19 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.11.02 నుండి 12.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.45 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** రా.7.56 నుండి 9.24 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.35.



పులుల పోరాటం.. ఏనుగుల ఘర్షణ



మానవులు, అటవీ జంతువుల మధ్య పెరుగుతున్న సంఘర్షణలు

- జార్ఖండ్‌లో ఏనుగులు, మహారాష్ట్రలో పులుల దాడుల్లో ఎక్కువ మంది మృతి
- వేటగాళ్ల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్న జంతువుల్లోనూ పులులు, ఏనుగులే అధికం
- నాలుగేళ్లలో 21 శాతం పెరిగిన పులుల వేట
- స్టేట్ ఆఫ్ ఇండియా ఎన్విరాన్‌మెంట్–డౌన్ టు ఎర్త్ 2023 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి:


పర్యావరణ ప్రతికూలతల కారణంగా మానవులు, అటవీ జంతువుల మధ్య పెరుగుతున్న ఘర్షణలు ఆందోళన కలిగిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా అడవులు నరికివేస్తుండటంతో జీవ వైవిధ్యం ప్రమాదంలో పడుతోంది. ఈ క్రమంలో తమ స్థావరాలను కోల్పోతున్న జంతువులు మానవ పరిసరాల్లోకి చొరబడి దాడులకు తెగబడుతున్నాయి. దేశంలో ఏటా పులులు, ఏనుగుల దాడుల్లో మృత్యువాత పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కాగా, వన్యప్రాణుల అక్రమ రవాణాలోనూ ఈ రెండు జంతువులే అత్యధికంగా వేటగాళ్ల బారిపడటం గమనార్హం. స్టేట్ ఆఫ్ ఇండియా ఎన్విరాన్‌మెంట్–డౌన్ టు ఎర్త్ 2023 నివేదిక ప్రకారం.. 2020–21తో పోలిస్తే 2021–22లో మనుషులపై ఏనుగుల దాడులు 16 శాతం, పులుల దాడులు 2019తో పోలిస్తే 2022 నాటికి 83 శాతం పెరగడం దారి తప్పిన పరిస్థితికి అద్దం పడుతోంది.

ఐదు హాట్ స్పాట్‌లలో..

ప్రస్తుతం భారత్‌లో 3,167 పులులు ఉన్నాయి. అయితే ప్రపంచ వ్యాప్తంగా గడచిన 22 ఏళ్లలో పులులను అక్రమంగా వేటాడిన కేసుల్లో 34 శాతం భారతదేశం నుంచే ఉండటం గమనార్హం. నాలుగేళ్లలో (2018–21) ఇటువంటి ఘటనలు 21 శాతం పెరిగాయి. ప్రపంచంలో మొత్తం పులులను వేటాడి వాటి శరీర అవయవాల అక్రమ రవాణా తదితర కేసుల్లో 53 శాతం చైనా, ఇండోనేషియా, భారత్‌లోనే ఉంటున్నాయి. ప్రపంచ దేశాల్లో 1000 కంటే ఎక్కువ ప్రదేశాల్లో పులులను వేటాడే ఘటనలు నమోదయ్యాయి. భారత్‌లో 85 శాతం అక్రమ వ్యాపార వేటలు ఉత్తరప్రదేశ్‌లోని దుద్వార్ నేషనల్ పార్కు, పశ్చిమ బెంగాల్‌లోని సుందర్‌బన్ నేషనల్ పార్కు, మధ్యప్రదేశ్‌లోని కన్హా టైగర్ రిజర్వు, కర్ణాటకలోని నాగర్‌హోల్ టైగర్ రిజర్వు, మహారాష్ట్రలోని తడోబా అంధారి టైగర్ రిజర్వు వంటి కేవలం ఐదు హాట్‌స్పాట్‌లుగా మారడం కలవరపెడుతోంది.

ఇక్కడే అత్యధికంగా దాడులు

అత్యధికంగా జార్ఖండ్, ఒడిశా, అస్సాం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఏనుగుల దాడుల్లో ఎక్కువ మంది మృతి చెందుతున్నారు. మహారాష్ట్రలో ఎక్కువ మంది పులుల దాడుల్లో చనిపోతున్నారు. మహారాష్ట్రలో 2019లో 26 మంది, 2020లో 25, 2021లో 32, 2022లో రికార్డు స్థాయిలో 84 మంది పులుల దాడుల్లో మృతి చెందారు. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ మంది మృతులు ఉంటున్నారు. నాలుగేళ్లలో తెలంగాణలో ఇద్దరు, తమిళనాడులో నలుగుర్ని పులులు పొట్టన పెట్టుకున్నాయి.



వేటగాళ్ల ఉచ్చులో పడి..

ఆహార అన్వేషణ, ఆవాసాలు దెబ్బతినడంతో దారి తప్పడం, అడవుల్లో జన సంచారం పెరగడం వంటి కారణాలతో ఏనుగులు, పులులు మనుషులపై దాడి చేస్తుంటే.. వన్యప్రాణుల్ని చంపి వ్యాపారం చేసే వ్యక్తులతో వీటి ప్రాణాలకు పెనుముప్పు వాటిల్లుతోంది. ఏనుగు దంతాలు, పులి చర్మం, గోళ్లకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉండటంతో స్మగ్లర్లు ఏనుగులు, పులుల్ని వేటాడుతున్నారు. దేశంలో పులుల మరణాలు 2021తో పోలిస్తే 2022లో 21 శాతం పెరిగాయి. ఇందులో 80 శాతం మరణాలకు గల కారణాలు ఇప్పటికీ అటవీ శాఖ అధికారులకు అంతు చిక్కలేదు. ఇదిలా ఉంటే 2018–19 నుంచి 2021–22 మధ్య 389 ఏనుగులు మృతి చెందాయి. వీటిల్లో 71 శాతం మరణాలు విద్యుదాఘాతంతో సంభవించడం గమనార్హం. ప్రధానంగా ఏనుగు కారిడార్లు ఎక్కువ ఆక్రమణలకు గురవుతున్నాయి

రాష్ట్రాల వారీగా ఏనుగు దాడుల్లో చనిపోయిన వారి సంఖ్య

రాష్ట్రం	2019-20	2020-21	2021-22
ఉత్తరప్రదేశ్	6	1	0
అసోం	75	91	63
అరుణాచల్‌ప్రదేశ్	0	0	2
మేఘాలయ	4	6	3
త్రిపుర	2	1	2
పశ్చిమ బెంగాల్	116	47	77
జార్ఖండ్	84	74	133
ఒడిశా	117	93	112
ఆంధ్రప్రదేశ్	4	6	0
తమిళనాడు	58	57	37
కేరళ	12	20	25
కర్ణాటక	29	23	17
మహారాష్ట్ర	1	0	0
ఛత్తీస్‌గఢ్	77	42	64

ఏనుగుల మరణాలకు నాలుగు కారణాలు

సంవత్సరం	విద్యుదాఘాతం	వేటగాళ్లు	విషపు ఆహారం	రైలు ఢీకొనడంతో..
2018-19	81	6	9	19
2019-20	76	9	0	14
2020-21	65	14	2	12
2021-22	57	4	6	15

రహదారులకు భారీగా నిధులు

- మూడో దశ అభివృద్ధి కింద రూ.1,121.92 కోట్ల కేటాయింపు
- 3,432.06 కి.మీ. మేర రోడ్ల అభివృద్ధికి నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడో దశ కింద రహదారుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. మొత్తం 3,432.06 కి.మీ. రహదారుల అభివృద్ధి కోసం రూ.1,121.92 కోట్లు వెచ్చిస్తోంది. వాటిలో 1,221.81 కి.మీ. మేర రాష్ట్ర రహదారుల అభివృద్ధి కోసం రూ.490.80 కోట్లు కేటాయించగా.. 2,210.25 కి.మీ. మేర జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.631.12 కోట్లు కేటాయించడం విశేషం. ఈ మేరకు మొత్తం 437 పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించింది. ఇందులో రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంబంధించి 132 పనులు, ప్రధాన రహదారుల అభివృద్ధికి సంబంధించి 305 పనులు ఉన్నాయి. ఈ మేరకు ఆర్ అండ్ బీ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాల వారీగా కేటాయించిన నిధులిలా..

శ్రీకాకుళం జిల్లాలో 11 రోడ్ల అభివృద్ధి కోసం రూ.29.25కోట్లు, విజయనగరం జిల్లాలో 6 రోడ్ల అభివృద్ధికి రూ.24.90 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 4 రోడ్లకు రూ.15 కోట్లు, విశాఖ జిల్లాలో ఒక రహదారి అభివృద్ధికి రూ.6 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 7 రోడ్ల నిర్మాణానికి రూ.11.10 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాకినాడ జిల్లాలో 7 రోడ్ల అభివృద్ధికి రూ.24.70 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 9 రోడ్ల అభివృద్ధికి రూ.28.55 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో 6 రోడ్ల కోసం రూ.22.30 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 6 రోడ్ల అభివృద్ధికి రూ.22.30 కోట్లు, ఏలూరు జిల్లాలో 5 రోడ్ల అభివృద్ధికి రూ. 23 కోట్లు కేటాయించింది. కృష్ణా జిల్లాలో 4 రోడ్లకు రూ.14.20 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 4 రోడ్లకు రూ. 13.70 కోట్లు, గుంటూరు జిల్లాలో 5 రోడ్ల అభివృద్ధికి రూ.15.80 కోట్లు, పల్నాడు జిల్లాలో 6 రోడ్లకు రూ.23.10 కోట్లు, బాపట్ల జిల్లాలో 6 రోడ్లకు రూ.23.30 కోట్లు కేటాయించారు. ప్రకాశం జిల్లాలో ఒక రోడ్డుకు రూ.2.75 కోట్లు, నెల్లూరు జిల్లాలో 9 రోడ్లకు రూ.56.20 కోట్లు, తిరుపతి జిల్లాలో 8 రోడ్లకు రూ.32.60 కోట్లు, చిత్తూరు జిల్లాలో 4 రోడ్లకు రూ.18.45 కోట్లు అన్నమయ్య జిల్లాలో 6 రోడ్లకు రూ. 23 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. వైఎస్సార్ జిల్లాలో 3 రోడ్లకు రూ.10.20 కోట్లు, కర్నూలు జిల్లాలో 3 రోడ్లకు రూ.11 కోట్లు, నంద్యాల జిల్లాలో 6 రోడ్లకు రూ.25.50 కోట్లు, అనంతపురం జిల్లాలో ఒక రహదారికి రూ.4 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 4 రోడ్లకు రూ. 9.90 కోట్ల చొప్పున కేటాయించింది.

ప్రభుత్వ పథకాలపై మైక్ ప్రచారం

- వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ ఓ అభిమాని బైక్‌యాత్ర


బైక్‌యాత్రలో అడవికొట్టు రాజు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ విజయం సాధించాలని, ఆయనను మళ్లీ సీఎంగా చూడాలనే ఆశయంతో ఓ అభిమాని రాష్ట్రంలో చేపట్టిన బైక్‌యాత్ర బుధవారం పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో కొనసాగింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం అన్నవరం గ్రామానికి చెందిన అడవి కొట్టు రాజుకు వైఎస్ జగన్ అంటే ఎంతో ఇష్టం. దీంతో జగనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటూ బైక్‌పై యాత్ర నిర్వహిస్తున్నారు. పాడేరు వచ్చిన సందర్భంగా బుధవారం స్థానిక పాతబస్టాండ్‌లో విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని చెప్పారు. అందువల్ల మళ్లీ ఆయనే సీఎం కావాలనే లక్ష్యంతో తనవంతుగా ఈ బైక్ యాత్ర చేస్తున్నానని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రారంభించిన బైక్‌యాత్రను 54 రోజులపాటు 121 నియోజకవర్గాల్లో దిగ్విజయంగా పూర్తిచేశానన్నారు. మరో నెలలో 175 నియోజకవర్గాల్లో బైక్ యాత్ర పూర్తి చేస్తానన్నారు.

ఇక ఆక్టోపస్ బృందం పర్యవేక్షణలో శ్రీవారి ఆలయం


భద్రత అంశాలపై చర్చిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

తిరుమల: తిరుమల ఆలయం వద్ద పటిష్ట భద్రత కోసం ఆక్టోపస్ బృందాన్ని ఏర్పాటుచేస్తున్నట్టు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లను బుధవారం తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆక్టోపస్ అధికారులతో కలిసి డీఐజీ పరిశీలించారు. అనంతరం డీఐజీ మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి ఆలయ ప్రవేశమార్గం వద్ద ఏర్పాటుచేసే ఈ చాంబర్‌లో ఐదు నుంచి ఆరుగురు సభ్యుల ఆక్టోపస్ బృందం.. ఒక సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో అత్యాధునిక ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్స్, డే విజన్ గ్లాసెస్, ఇతర అత్యాధునిక పరికరాలు ధరించి శత్రువును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఐదు నుంచి ఆరుగురు చొప్పున నిరంతరాయంగా బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. వీరు శ్రీవారి ఆలయ ముఖద్వారాన్ని ప్రధానంగా రక్షిస్తారని తెలిపారు. ఎప్పుడైనా అకస్మాత్తుగా శత్రువులు ఎక్కువమంది దాడి చేసేందుకు ప్రయత్నిస్తే వీరితో పాటు వెంటనే బ్యారెక్‌లోని మరో 20 మంది ఆక్టోపస్ సిబ్బందికి సమాచారం అందుతుందని వారు కాలినడకన ఇక్కడకు చేరుకుని శత్రువును ఎదుర్కొనేలా భద్రతను ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు.

అత్యాధునిక భద్రతా దళం.. ఆక్టోపస్

రాష్ట్రంలో ఉగ్రవాదం, మత కలహాలను అణచివేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ విభాగం 'ఆపరేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్ (ఆక్టోపస్). దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఈ విభాగాన్ని ఏర్పాటు చేస్తూ 2007, అక్టోబర్ 1న నిర్ణయం తీసుకుంది. దేశంలోనే అత్యుత్తమ సాయుధ బలగాల తరహాలో ఆక్టోపస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ నుంచి మెరికల్లాంటి వారిని ఎంపిక చేసి వారికి ప్రత్యేకంగా ఎన్ఎస్‌జీ కమాండోల తరహాలో శిక్షణనిస్తారు. గ్లోక్–19 పిస్టల్స్, కోల్ట్ 9ఎంఎం ఎస్ఎంజీ, ఫ్రాంచి స్పాస్–15 డ్యూయల్ మోడ్ షాట్‌గన్స్, స్నైపర్ రైఫిల్స్, టేజర్ గన్స్, కార్నర్ షాట్స్ సిస్టం మొదలైన అత్యాధునిక ఆయుధాలతో విజయవంతంగా దాడులు చేయడంలో వీరు నిష్ణాతులు. ఉగ్రవాదులు ఎలాంటి దుశ్చర్యలకు యత్నించినా మెరుపువేగంతో తిప్పికొట్టగల సామర్థ్యం ఆక్టోపస్ సొంతం.

క్లుప్తంగా...

మంత్రి అమర్‌నాథ్‌తో కియా ప్రతినిధుల భేటీ


మంత్రి అమర్‌నాథ్‌తో మాట్లాడుతున్న కియా మోటార్స్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను స్థానిక సర్క్యూట్ హౌస్‌లో కియా మోటార్స్ ప్రతినిధులు బుధవారం కలిశారు. కియా మోటార్స్ కంపెనీ గత నాలుగేళ్లలో 10 లక్షల కార్ల ఉత్పత్తిని పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమానికి ఆహ్వానించారు. అదేరోజు కంపెనీ తయారు చేసిన న్యూమోడల్ కారు (రూ.10 లక్షల విలువైన) విడుదల కార్యక్రమం కూడా ఉందని కియా మోటార్స్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ క్యాబ్ డాంగ్ లీ తెలిపారు. తమ కంపెనీ ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సహాయ సహకారాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సహకారంతో భారతదేశంలో కియా కంపెనీ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకుందని వివరించారు.

డీఎస్‌జీ హరినాథ్ పదవీకాలం పొడిగింపు



సాక్షి, అమరావతి: హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) నూనేపల్లి హరినాథ్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. డీఎస్‌జీగా కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు కీలక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల తరఫున సమర్థంగా వాదనలు వినిపిస్తుండటంతో హరినాథ్ పదవీకాలాన్ని పొడిగించాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగా మరో మూడేళ్లు, లేదా తదుపరి ఉత్తర్వులు జారీచేసేంతవరకు ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ కేంద్ర న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ, సలహాదారు విజయ్‌కుమార్‌శర్మ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 2020లో మొదటిసారి హరినాథ్ డీఎస్‌జీగా నియమితులయ్యారు. అప్పటినుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. మొదట్లో కేంద్ర ప్రభుత్వం తరఫున మాత్రమే వాదనలు వినిపించారు. ఆయన సమర్థతను గుర్తించిన కేంద్రం తరువాత పలు కీలక ప్రభుత్వరంగ సంస్థల తరఫున వాదనలు వినిపించే బాధ్యతలను కూడా అప్పగించింది. సీబీఐతో సహా పలు ముఖ్యమైన దర్యాప్తు సంస్థల తరఫున కూడా ఆయన హైకోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. హైకోర్టు సైతం ఆయన సమర్థతను గుర్తించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియం ఇటీవల హరినాథ్ పేరును హైకోర్టు న్యాయమూర్తి పోస్టుకు సిఫారసు చేసింది. ఈ సిఫారసుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపాల్సి ఉంది. త్వరలో ఓ నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. హరినాథ్ పదవీకాలం పొడిగింపుపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ

8న ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధాని మోదీ

ఈ పర్యటనలో రూ.6,100 కోట్ల పనులకు శంకుస్థాపన

- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, రహదారుల పనులకు భూమిపూజ
- కాజీపేటలో రైల్వే వ్యాగన్ల యూనిట్‌కు శంకుస్థాపన
- అదే రోజు హనుమకొండలో బహిరంగసభ



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 8న ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ పర్యటనలో ఆయన రాష్ట్రంలో రూ.6,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ 8వ తేదీన ఉదయం 10:45 గంటలకు వరంగల్‌కు చేరుకుని రూ.5,550 కోట్ల వ్యయంతో చేపట్టే 176 కి.మీ జాతీయ రహదారి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. నాగ్‌పూర్–విజయవాడ కారిడార్ కింద 108 కిలోమీటర్ల మంచిర్యాల–వరంగల్ సెక్షన్ ఇందులో భాగంగా ఉంది. దీనివల్ల మంచిర్యాల–వరంగల్ మధ్య దాదాపు 34 కి.మీ దూరం తగ్గుతుంది. అలాగే 44, 65 జాతీయ రహదారులపై వాహన రద్దీ తగ్గుతుంది. దీంతోపాటు కరీంనగర్–వరంగల్ సెక్షన్‌లో 68 కి.మీ మేర రెండు వరుసలుగా ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసే పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కాజీపేటలో రూ.500 కోట్లతో చేపట్టనున్న రైలు వ్యాగన్ల తయారీ కర్మాగారం నిర్మాణానికి కూడా మోదీ శంకుస్థాపన చేస్తారు.

సాగర్ జలాశయంలో నౌకాయాన యాత్ర ప్రారంభం

- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు
- ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహణ


నాగార్జునసాగర్ జలాశయంలో బోట్‌లో క్యాడెట్లు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయంలో ఆంధ్ర–తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నావల్ క్యాడెట్లు బుధవారం సాహసోపేతమైన నౌకాయాన యాత్ర ప్రారంభించారు. నాగార్జున సాగర్ జలాశయం సహజమైన నీటిలో 210 కిలో మీటర్ల దూరం నాలుగు వేలర్ బోట్‌లు, రెండు విండ్ సర్ఫర్లలో 100 మంది క్యాడెట్లు పర్యటించనున్నారు. జెండాపేట మునసభ్ ఆలయం, ఏలేశ్వర మల్లన్న దేవాలయం, వైజాగ్ కాలనీ బోటింగ్ సెంటర్, టీఎస్టీడీసీ రిసార్ట్ విజయవిహార్, నాగార్జున కొండ మ్యూజియం, వైద్య శిబిరం, శివాలయం, బూడిద గట్టు తండా ఆలయం, అనుపు నాగార్జునసాగర్, సాగర్‌మాత దేవాలయం, బూడిద గట్టు థాన్‌ను సందర్శించనున్నారు. ఈ యాత్ర ఈ నెల 14వ తేదీ వరకు జరుగనుంది.

'పార్వేట మండపాన్ని పునరుద్ధరిస్తున్నాం'

తిరుమల: తిరుమల పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఆ మండపాన్ని పునరుద్ధరిస్తున్నట్లు టీటీడీ బుధవారం తెలిపింది. ఈ మండపం పురావస్తు శాఖకు చెందినది కాదని, ప్రతిఏటా పార్వేట ఉత్సవం, కార్తీక వనభోజనాల సమయంలో శ్రీవారు ఈ మండపానికి వేంచేపు చేస్తారని, ఆ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని పేర్కొంది. మండపం కూలిపోయే స్థితికి చేరుకోవడంతో టీటీడీ ధర్మకర్తల మండలి 2022, జూలై 11న మండపం జీర్ణోద్ధరణ కోసం రూ.2.07 కోట్లు మంజూరు చేసిందని తెలిపింది. టెండర్లు పూర్తి కావడంతో కాంట్రాక్టర్ ఈ నెల 4 నుంచి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారని వివరించింది. కొందరు వ్యక్తులు పనిగట్టుకుని టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

కంతేరు బాధితులకు ఎస్సీ కమిషన్ పరామర్శ


ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

కంతేరు(తాడికొండ): గుంటూరు జిల్లా కంతేరులో దళిత యువకులపై దాడి జరిగిన ఘటనలో బాధితులను ఎస్సీ కమిషన్ చైర్ పర్సన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి ఘటనను బాధితులు ఆయనకు వివరించారు. జూన్ 22న చిన్న వివాదానికి సంబంధించిన ఘటనలో చర్చించుకుందామని పిలిచి తమపై 40 మంది దాడి చేశారని, నిందితులను వదిలేసిన పోలీసులు తమపైనే కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం వెళ్లగా అవుట్ పోస్ట్ పోలీసులు, స్థానిక పోలీసులు కలిసి తమను అక్కడి నుంచి తరిమేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కొంతమంది పోలీసుల చర్యల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, షెడ్యూల్డ్ కులాల వారికి రక్షణ లేకుండా పోతోందన్నారు. ప్రధాన నిందితుడు కళ్లం మనోహర్‌రెడ్డిని ఎ–1గా చేర్చి కేసును 307, 326 ఆల్టర్ చేసి నిందితులను మళ్లీ అరెస్ట్ చేయాలని డీఎస్పీని ఆదేశించారు. సీఐని వెంటనే సస్పెండ్ చేస్తారా.. లేదా.. అని డీఎస్పీని ప్రశ్నించారు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో జీజీహెచ్ నుంచి బాధితులను తరిమేసిన ఘటనలో అప్పుడు విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్, ఆర్ఎం, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఈ నెల 15న ఎస్సీ కమిషన్ ఎదుట హాజరుకు సమన్లు జారీ చేయాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కళ్లం మనోహర్‌రెడ్డి చర్చించుకుందామని పిలిపించి 40 మందితో కలిసి దాడిచేశారని, సంబంధం లేని వ్యవహారంలో దళితుడిపై తనకు సంబంధం లేని మనోహర్‌రెడ్డి దాడి చేయడమేంటన్నారు. ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ వెంట పలువురు దళిత సంఘాల నేతలు, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు, ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, డీఎస్పీ పోతురాజు తదితర సిబ్బంది ఉన్నారు.

హైదరాబాద్‌లో అధికారుల కిడ్నాప్ కేసులో
గుంటూరు టీడీపీ నేతలు

- జీఎస్టీ చెల్లించకపోవడంతో సీజ్ చేసేందుకు వెళ్లిన అధికారులపై దాష్టీకం
- దాడిచేసి, కిడ్నాప్ చేసిన టీడీపీ నేత, ఆయన కుటుంబ సభ్యులు
- తెలుగుదేశం నాయకుడు ముజీబ్, పార్టీ గుంటూరు నగర ఉపాధ్యక్షుడు ఫిరోజ్, మరో ఇద్దరి అరెస్ట్


కిడ్నాప్ కేసులో అరెస్టు అయిన టీడీపీ నేతలు ముజీబ్, ఫిరోజ్, ఇంతియాజ్, వారి డ్రైవర్ ముషీర్


యువగళం పాదయాత్రలో నారాలోకేష్‌తో ముజీబ్, అతని కుటుంబ సభ్యులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జీఎస్టీ సీనియర్ అధికారిని కిడ్నాప్ చేసిన కేసులో గుంటూరు టీడీపీ నేతలు, కుటుంబ సభ్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు నగర టీడీపీ నేత సయ్యద్ ముజీబ్, ఆయన కుటుంబ సభ్యులు సయ్యద్ ఫిరోజ్, సయ్యద్ ఇంతియాజ్‌లకు హైదరాబాద్ సరూర్‌నగర్ పరిధిలోని క్రాంతినగర్ రోడ్ నంబర్ 2లో ఇనుము వ్యాపారం ఉంది. ప్రస్తుతం గుంటూరులోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. జీఎస్టీ చెల్లించకపోవటంతో బుధవారం జీఎస్టీ, ఇంటెలిజెన్స్ అధికారులు హైదరాబాద్‌లోని దుకాణాన్ని సీజ్‌చేసేందుకు వెళ్లారు. ఆ అధికారులపై ముజీబ్, ఫిరోజ్, ఇంతియాజ్, వారి కారు డ్రైవర్ షేక్ ముషీర్ దాడిచేశారు. గుంటూరు నుంచి తాము వెళ్లిన కారులోనే అధికారుల్ని కిడ్నాప్ చేశారు. అధికారుల డ్రైవర్ ద్వారా సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు కిడ్నాప్‌నకు పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకుని అధికారులను రక్షించారు. ముజీబ్ ప్రస్తుతం గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. లోకేశ్ పాదయాత్రలో కూడా పాల్గొన్నారు. హైదరాబాద్‌లో కిడ్నాప్ వ్యవహారంలో గుంటూరు తెలుగుదేశం నేతలు అరెస్ట్ కావడం చర్చనీయాంశమైంది.

కుటుంబసభ్యులంతా నేరచరితులే...

గుంటూరుకు చెందిన ముజీబ్ కుటుంబ సభ్యులు తొలినుంచి నేరచరిత్ర కలిగి ఉన్నారు. గుంటూరు ఆర్టీసీ కాలనీలో ఒక భూమిని ఆక్రమించిన కేసులో ముజీబ్ సోదరుడు ఫిరోజ్, ఇంతియాజ్, బషీర్‌లపై రౌడీషీట్లున్నాయి. ఆటోనగర్‌లో సైతం గతంలో కత్తులు తీసుకుని ఆ ప్రాంతమంతా హల్‌చల్ సృష్టించిన విషయంలో కాకాని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతోపాటు కొంతమందిపై దాడిచేసిన కేసులున్నాయి. ఈ క్రమంలో తెలంగాణలోని హైదరాబాద్‌లో ముజీబ్, అతడి సోదరులపై అధికారులను కిడ్నాప్ చేసిన కేసు నమోదైంది. తొలినుంచి వివాదాలకు దిగే ముజీబ్, అతడి కుటుంబ సభ్యులపై మరోమారు కేసు నమోదవడంపై టీడీపీలో కూడా చర్చ జరుగుతోంది. ముజీబ్ సోదరుడు సయ్యద్ ఫిరోజ్ రౌడీషీట్ కలిగి ఉండటంతో పాటు టీడీపీ నగర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ముజీబ్ తండ్రి మాత్రం తన కుమారుడు అమాయకుడని, అతడిపై కుట్ర జరిగిందని పేర్కొంటున్నారు.

తెలంగాణ

పాలపుంతలో గురుత్వ తరంగాల గుట్టు

- ఖగోళ రహస్యాలను తేల్చే శాస్త్రవేత్తల బృందంలో ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఖగోళ రహస్యాలను తేల్చే పరిశోధనలో భాగంగా.. పాలపుంతలో గురుత్వాకర్షణ తరంగాల ఆధారాలను కనుగొన్న బృందంలో హైదరాబాద్ ఐఐటీ పరిశోధకులూ భాగస్వాములయ్యారు. 'ఇండియన్ పల్సర్ టైమింగ్ అర్రే (ఐఎన్‌పీటీఏ)'తోపాటు జపాన్, యూరప్ దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన చేశారని ఐఐటీ హైదరాబాద్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రపంచంలోని ఆరు అత్యాధునిక రేడియో టెలిస్కోప్‌లను ఉపయోగించి ఖగోళాన్ని పరిశీలించామని.. పాలపుంతలో అతి తక్కువ పౌనఃపున్యం ఉన్న గురుత్వాకర్షణ తరంగాలకు సంబంధించిన ఆధారాలను కనుగొన్నామని తెలిపింది. ఈ వివరాలు ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ జర్నల్‌లో ప్రచురితం అయ్యాయని పేర్కొంది. ఐఐటీ హైదరాబాద్ భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ శంతన్‌దేశాయ్, అమన్ శ్రీవాత్సవ, ఫిజిక్స్ పీహెచ్‌డీ విద్యార్థి దివ్యనాష్ కర్పందా, బీటెక్ విద్యార్థులు శ్వేత అర్ముగం, ప్రజ్ఞ మాండిపాక తదితరులు పరిశోధనలో బృందంలో ఉన్నారని వివరించింది.

క్లుప్తంగా...

జూలై 4.. మహోష్ణ దినం

వాషింగ్టన్: గత 1,25,000 సంవత్సరాల్లో ఈ ఏడాది జూలై 4వ తేదీ భూగోళంపై అత్యంత వేడి దినంగా రికార్డుకెక్కింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన దినంగా ఈ నెల 3వ తేదీ రికార్డు సృష్టించింది. ఆ రికార్డు ఒక్కరోజులోనే బద్దలు కావడం విశేషం. 3న ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రత 17.01 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మెయిన్‌కి చెందిన క్లైమేట్ చేంజ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. 4వ తేదీన ఇది 17.18 డిగ్రీల సెల్సియస్(62.92 డిగ్రీల ఫారన్‌హీట్)కు ఎగబాకినట్లు తెలియజేసింది. ఈ ఉష్ణోగ్రతను గణించడానికి మోడలింగ్ సిస్టమ్‌ను 1979 నుంచి ఉపయోగిస్తున్నారు. దీని ప్రకారం లక్షల సంవత్సరాల క్రితం నాటి ఉష్ణోగ్రతను సైతం అంచనా వేయొచ్చు.

గిరిజన యువకునిపై మూత్ర విసర్జన...

నిందితుని అరెస్టు

బీజేపీకి చెందినవాడన్న కాంగ్రెస్

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో గిరిజన యువకునిపై మూత్ర విసర్జన ఘటనలో నిందితున్ని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడు బీజేపీకి చెందినవాడని కాంగ్రెస్ ఆరోపించింది. తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బీజేపీ దళిత, గిరిజన ద్వేషానికి ఈ ఉదంతం అద్దం పడుతోందని కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా దుయ్యబట్టారు. బీజేపీ హయాంలో వారిపై అత్యాచారాలు పేట్రేగిపోతున్నాయని రాహుల్ ఆరోపించారు. అయితే ఆ వ్యక్తితో తమ పార్టీకి సంబంధం లేదని బీజేపీ పేర్కొంది. దీనిపై విచారణకు నలుగురు వ్యక్తుల కమిటీ వేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర శాఖ ప్రకటించడం విశేషం. ఈ చర్య హీనమైనదని హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా అన్నారు. ఈ ఉదంతం కొద్ది నెలల నాటిదని చెబుతున్నారు.

డేటా బిల్లుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ బిల్లు (డీపీడీపీ)కి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. జూలై 20 నుంచి ఆగస్టు 11 దాకా జరిగే పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ బిల్లును ప్రవేశపెడతారని అధికార వర్గాల సమాచారం. గోప్యత హక్కులో భాగంగా పౌరుల డేటా సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ విషయంలో ఇంటర్నెట్ కంపెనీలు, మొబైల్ యాప్స్, వ్యాపార సంస్థల్లో జవాబుదారీతనం పెంచడం దీని లక్ష్యం. గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గత ఆగస్టులో సుప్రీంకోర్టు ప్రకటించిన అనంతరం డేటా పరిరక్షణ బిల్లు తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు డేటా సేకరణకు ముందు పౌరుల అనుమతి తీసుకోవాలి.

ఇజ్రాయెల్ ఆక్రమిత ఉత్తర వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల శిబిరం 20 సంవత్సరాల తర్వాత మళ్లీ ప్రపంచవ్యాప్తంగా ప్రముఖంగా వార్తల్లోకి వచ్చింది. జెనిన్ క్యాంప్‌లో ఉగ్రవాదులను ఏరివేయడానికి ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ ఎట్టకేలకు ముగిసింది. లక్ష్యం నెరవేరిందని ఇజ్రాయెల్ చెబుతోంది. జెనిన్ రెఫ్యూజీ క్యాంప్‌నకు దాదాపు ఏడు దశాబ్దాల కన్నీటి చరిత్ర ఉంది. ఇజ్రాయెల్ సైన్యం, పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్‌ల మధ్య ఘర్షణలకు ఈ ప్రాంతం వేదికగా మారుతుండడంతో శరణార్థులకు కష్టాలు ఎదురవుతున్నాయి. చెల్లాచెదురై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇజ్రాయెల్ మిలటరీ ఆపరేషన్ వల్ల గత 3 రోజుల్లో వేలాది మంది జెనిన్ క్యాంప్ విడిచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో అసలు ఈ క్యాంప్ ఎందుకు ఏర్పాటయ్యిందో, ఇక్కడి పరిస్థితులేమిటో తెలుసుకుందాం..

ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్‌తో జెనిన్ క్యాంప్‌లో మృత్యుభయం

వలసబాట పట్టిన వేలాది మంది శరణార్థులు

సైన్యం, మిలిటెంట్ల మధ్య ఘర్షణలతో నలిగిపోతున్న బాధితులు

మురికివాడలో శరణార్థుల గోస





అమెరికాతోపాటు పశ్చిమ దేశాల అండతో 1948లో యూదుల కోసం ఇజ్రాయెల్ ఆవిర్భవించింది. విస్తీర్ణంలో చిన్నదైనా తన చుట్టుపక్కల దేశాల భూభాగాలను బలప్రయోగంతో ఆక్రమించుకోవడం మొదలుపెట్టింది. ప్రాచీన కాలంలో ఆ ప్రాంతాలన్నీ యూదు రాజ్యంలో అంతర్భాగమేనని వాదించింది. అలా పొరుగు దేశమైన పాలస్తీనాపై కన్నేసింది. ఇజ్రాయెల్ సైన్యం దాడులను తట్టుకోలేక పాలస్తీనా పౌరులు సొంత ఊళ్లు వదిలేసి శరణార్థులుగా మారి వలస బాట పట్టారు.

శరణార్థుల గడ్డ.. మిలిటెంట్ల అడ్డా

అంతర్జాతీయ సమాజం ఒత్తిడి మేరకు ఇజ్రాయెల్ ప్రభుత్వం 1950వ దశకంలో పాలస్తీనా శరణార్థుల కోసం వెస్ట్ బ్యాంక్‌లో పలు శిబిరాలను ఏర్పాటు చేసింది. అందులో ఒకటి జెనిన్ రెఫ్యూజీ క్యాంప్. నిజానికి ఇదొక మురికివాడ అని చెప్పొచ్చు. పేదరికానికి, ఆకలి చావులకు మారుపేరు. పాలస్తీనా మిలిటెంట్లు తమ కార్యకలాపాల కోసం జెనిన్‌ను అడ్డాగా మార్చుకున్నారు. తరచుగా ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడుతున్నారు. మిలిటెంట్ల చర్య స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న సాయుధ తిరుగుబాటు అని పాలస్తీనా సానుభూతిపరులు చెబుతుండగా, అది ముమ్మాటికీ ఉగ్రవాదమేనని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. పాలస్తీనియన్ మిలిటెంట్ కమాండ్ సెంటర్లు జెనిన్‌లో ఉన్నాయని అంటోంది.

వేలాది మందికి ఆవాసం

జెనిన్ క్యాంప్ పాలస్తీనా శరణార్థులతో కిక్కిరిసిపోయి కనిపిస్తుంది. ఇక్కడ ప్రస్తుతం 18,000 మంది నివసిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు చెబుతున్నాయి. అసలైన లెక్క ఎంతన్నది తెలియదు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనియన్ రెఫ్యూజీ ఏజెన్సీ అందించిన సమాచారం ప్రకారం 14,000 మంది ఉంటున్నారు. 2020 నాటి పాలస్తీనా ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం 12,000 మంది శరణార్థులు నివసిస్తున్నారు.

జెనిన్ క్యాంప్‌లో 2002లో జరిగిన ఘర్షణలో 50 మందికిపైగా పాలస్తీనా జాతీయులు, 23 మంది ఇజ్రాయెల్ సైనికులు బలయ్యారు. యూదు సెలవు దినం సందర్భంగా మతపరమైన వేడుక కోసం గుమికూడిన యూదు జాతీయులపై మిలిటెంట్లు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 30 మంది యూదు జాతీయులు మరణించారు. దాంతో మిలిటెంట్ల భరతం పట్టడానికి

యుద్ధానికి దారితీసిన ఆత్మాహుతి దాడి

ఇజ్రాయెల్ సైన్యం వెస్ట్‌బ్యాంక్‌పై విరుచుకుపడింది. పాలస్తీనాలోకి సైతం సైన్యం అడుగుపెట్టింది. రమల్లా నగరంలో అప్పటి పాలస్తీనా అధినేత యాసర్ అరాఫత్ ఇంటిని చుట్టుముట్టింది. ఇజ్రాయెల్ సైనికులు, పాలస్తీనా మిలిటెంట్ల నడుమ కొన్ని రోజులపాటు హోరాహోరీగా యుద్ధంకొనసాగింది. ఇరువైపులా ప్రాణనష్టంతో యుద్ధం ముగిసింది. జెనిన్ క్యాంప్ అప్పటి నుంచి నివురుగప్పిన నిప్పులా మారింది. 20 ఏళ్ల తర్వాత మళ్లీ భారీ సైనిక ఆపరేషన్ జరిగింది. దీనివెనుక పలు కారణాలు కనిపిస్తున్నారు.

మిలిటెంట్ల దుశ్చర్యపై ఆగ్రహావేశాలు

రెండు వారాల క్రితం జెనిన్ క్యాంప్‌లో మిలిటెంట్లు రెచ్చిపోయారు. జెనిన్ నుంచి ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్ ప్రయోగించారు. దీంతో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఏడుగురు ఇజ్రాయెల్ జవాన్లు గాయపడ్డారు. వారిని హెలికాప్టర్లలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మిలిటెంట్ల దుశ్చర్యంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ చేతగానితనంలోనే ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారంటూ ఇజ్రాయెల్‌లో ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పించాయి. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూపై ఒత్తిడి పెరిగింది. దానికితోడు వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిలర్స్‌లో ఎక్కువమంది నెతన్యాహూ మద్దతుదారులే ఉన్నారు. మిలిటెంట్లను కఠినంగా అణచివేయాలంటూ వారు సైతం ఒత్తిడి తెచ్చారు. దాంతో జెనిన్ క్యాంప్‌లో సైనిక ఆపరేషన్‌కు నెతన్యాహూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఈ నెల 3వ తేదీన ఇజ్రాయెల్ సైన్యం రంగంలోకి దిగింది. జెనిన్‌లో శరణార్థుల ఇళ్లలో సోదాలు నిర్వహించింది. ముష్కరుల స్థావరాలుగా భావిస్తున్న ప్రాంతాలపై డ్రోన్లతో దాడులు చేసింది.

సాక్షి, నేషనల్ డెస్క్

ఇటీవలి కాలంలో బెంజమిన్ నెతన్యాహూ రాజకీయంగా కొంత బలహీనపడ్డారు. ఆయన తీసుకొచ్చిన వివాదాస్పద న్యాయ వ్యవస్థ సంస్కరణ బిల్లుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వెస్ట్‌బ్యాంక్‌లో జెనిన్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో

ప్రజల దృష్టిని మళ్లించేందుకేనా?

సాయుధ ముఠాలు బలం పుంజుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టిని మళ్లించాల్సిన అవసరం ఆయనకు ఏర్పడిందని రాజకీయ నిపుణులు అంటున్నారు. అందుకే జెనిన్ క్యాంప్‌లో సైనిక ఆపరేషన్‌కు ఆదేశాలు ఇచ్చారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వెస్ట్‌బ్యాంక్‌లో ముగిసిన సైనిక ఆపరేషన్

- 12 మంది పాలస్తీనా జాతీయులు, ఒక ఇజ్రాయెల్ జవాను మృతి
- వెనక్కి వెళ్లిపోయిన ఇజ్రాయెల్ సైన్యం

వెస్ట్‌బ్యాంక్

మిలిటెంట్లను ఏరివేయడమే లక్ష్యంగా వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ బుధవారం ముగిసింది. ఇజ్రాయెల్ బలగాలను వెనక్కి వెళ్లిపోయాయి. సోమవారం, మంగళవారం జరిగిన దాడుల్లో 12 మంది పాలస్తీనావాసులు, ఒక ఇజ్రాయెలీ జవాను మృతిచెందారు. తాము నిర్వహించిన డ్రోన్ దాడుల్లో చనిపోయినవారంతా మిలిటెంట్లేనని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. జెనిన్ శరణార్థుల శిబిరంలో భయం ఇంకా తొలగిపోలేదు. జనం ఇప్పుడిప్పుడే ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. వీధులను శుభ్రం చేసుకుంటున్నారు. దుకాణాలు తెరుచుకుంటున్నారు. ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు క్రమంగా తిరిగివస్తున్నారు. క్యాంప్‌లో ఎక్కడ చూసినా భీతావహ వాతావరణం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. తాగునీరు, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇంకా పునరుద్ధరించలేదు. ఇంటర్నెట్ సేవలు సైతం ఆగిపోయాయి. డ్రోన్ దాడుల్లో మిలిటెంట్ ముఠాలకు భారీగా నష్టం వాటిల్లిందని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. వెస్ట్‌బ్యాంక్ నుంచి ఉగ్రవాదులు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఇలాంటి సైనిక ఆపరేషన్లు పునరావృతం కావడం తథ్యమని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరించారు. జెనిన్ శివారులోని ఓ సైనిక స్థావరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యమని ఉద్ఘాటించారు.

మోదీ లూటీ విధానాల వల్లే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుదల

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టీకరణ



న్యూఢిల్లీ: దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగానికి నరేంద్ర మోదీ ప్రభుత్వ చేతగానితనమే కారణమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ప్రభుత్వ డొల్ల నినాదాలను ప్రజలు ఎంతమాత్రం నమ్మడం లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. మోదీ ప్రభుత్వం ప్రజలను లూటీ చేయడమే పనిగా పెట్టుకుందని, అందుకే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆరోపించారు. జనం కష్టాల్లో ఉంటే బీజేపీ మాత్రం అధికారం కోసం పాకులాడుతోందని దుయ్యబట్టారు. ఈ మేరకు ఖర్గే బుధవారం ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు ఆకాశంలోకి దూసుకెళ్తున్నాయని, నిరుద్యోగం 8.45 శాతానికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని, పనులు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు అచ్చే దిన్, అమృత్ కాల్ అంటూ నినాదాలు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించారని ఖర్గే ఆక్షేపించారు. ఈసారి ఎన్నికల్లో ఎన్ని రకాలుగా ప్రచారం చేసుకున్నా ఫలితం ఉండదని, బీజేపీని జనం ఓడించడం తథ్యమని జోస్యం చెప్పారు.

అమెరికాలో తూటాలకు మరో ఇద్దరు బలి

వాషింగ్టన్: అమెరికాలో స్వాతంత్ర్య దిన సంబరాలు తూటాల వర్షంతో ఎరుపెక్కుతూనే ఉన్నాయి. సోమ, మంగళవారాల్లో పలుచోట్ల జరిగిన కాల్పుల్లో పలువురు మరణించడం తెలిసిందే. బుధవారం రాజధాని వాషింగ్టన్‌లో మళ్లీ తుపాకుల మోత మోగింది. స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటున్న 9 మంది వాటిలో పలువురు గాయపడ్డారు. కారులో నుంచి కాల్పులు జరిగినట్టు చెబుతున్నారు. మరోవైపు లూసియానాలో మంగళవారం జరిగిన కాల్పులకు సంబంధించి బుధవారం మరో శవం దొరికింది.

తీస్తా బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ: 2002 గోద్రా అనంతర అల్లర్ల కేసులో హక్కుల కార్యకర్త తీస్తా సీతల్‌వాద్ బెయిల్‌ను జూలై 19 దాకా సుప్రీంకోర్టు పొడిగించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, ఎ.ఎస్.బొపన్న, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం బుధవారం ఈ మేరకు నిర్ణయం వెలువరించింది. పిటిషనర్ మహిళ గనుక గుజరాత్ హైకోర్టే బెయిల్ రూపంలో ఆమెకు ఎంతో కొంత రక్షణ కల్పించి ఉండాల్సిందని అభిప్రాయపడింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను జూలై 19కి వాయిదా వేసింది. సీతల్‌వాద్‌కు జూలై 1న సుప్రీంకోర్టు వారం పాటు బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే.

మహిళను నేలపైకి తోసి, పెప్పర్ స్ప్రే కొట్టి...

వాషింగ్టన్: అమెరికాలో పోలీసుల జులుం మరోసారి తెరపైకి వచ్చింది. సూపర్ మార్కెట్లో దొంగతనానికి పాల్పడిందంటూ ఓ మహిళతో పోలీసు అధికారి ఒకరు అనాగరికంగా వ్యవహరించాడు. బేడీలు వేసి నిర్బంధంలోకి తీసుకున్నాక కూడా ఆమెను నేలపైకి తోసేసి, పెప్పర్ స్ప్రే కొట్టి హింసించాడు. 'ఊపిరాడటం లేదు (ఐ కాంట్ బ్రీత్) అంటూ అల్లాడుతున్నా కనికరించలేదు. చెంపపై కొట్టడమే గాక మెడపై మోకాలు పెట్టి తొక్కినట్టు కూడా చెబుతున్నారు. ఆమెకు క్యాన్సర్ ఉందని ఆమెతో పాటున్న సహచరుడు చెబుతున్నా వినిపించుకోలేదు. జూన్ 24న జరిగిన ఈ ఉదంతాన్ని ఒక వ్యక్తి వీడియో తీశాడు. సదరు పోలీసును ఆపేందుకు అతను విఫల ప్రయత్నం చేశాడు. లాస్ ఏంజెలిస్ కౌంటీలోని లాంకస్టర్‌లో జరిగిన ఈ దారుణానికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖ విచారణకు ఆదేశించింది. ఉదంతంలో పాల్గొన్న ఇద్దరు పోలీసులను విధుల నుంచి తప్పించినట్టు ఫాక్స్ న్యూస్ పేర్కొంది.



బాబాయ్, ఇక తప్పుకో!



ముంబైలో పార్టీ నేతలనుద్దేశించి ప్రసంగిస్తున్న శరద్ పవార్



ముంబైలో సమావేశంలో అజిత్ పవార్ తదితరుల అభివాదం

పవార్‌కు అజిత్ సూచన

- సీఎం కావాలని ఉందని వ్యాఖ్య
- పోటాపోటీగా బల ప్రదర్శన సభలు
- అజిత్ భేటీకి 32, పవార్ సభకు 18 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు హాజరు

ముంబై: మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)పై ఆధిపత్యం కోసం పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్, చీలిక వర్గం నేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇరువురు నేతలు బుధవారం బల ప్రదర్శనకు దిగారు. ఎమ్మెల్యేలు, అనుచరులతో కలిసి సమావేశాలు నిర్వహించారు. పరస్పరం వాగ్బాణాలు విసురుకున్నారు. అయితే నంబర్ గేమ్‌లో బాబాయిపై అబ్బాయి అజిత్‌దే పై చేయి అయింది. 53 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో అజిత్ సభకు 32 మంది హాజరయ్యారని ఆయన వర్గం నేతలు వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 8 మంది ఎన్సీపీ ఎమ్మెల్సీల్లో ఐదుగురు ఇప్పటికే అజిత్‌కు మద్దతు ప్రకటించారు. అనర్హత వేటు నుంచి తప్పించుకోవాలంటే అజిత్‌కు 36 మంది ఎమ్మెల్యేల మద్దతు కావాలి. ఆయనకు 40 మంది అండ ఉందని చీలిక వర్గం ఎమ్మెల్యే అనిల్ పాటిల్ చెప్పారు. ఇక శరద్ భేటీకి 18 మంది ఎమ్మెల్యేలే హాజరైనట్లు సమాచారం. కొందరు ఎమ్మెల్యేలు ఇరు భేటీల్లోనూ పాల్గొనడం విశేషం! ఎన్సీపీకి 53 మంది ఎమ్మెల్యేలున్నారు. ఈ నేపథ్యంలో ఏ భేటీకి వెళ్లని ఎమ్మెల్యేల మద్దతు రెండు వర్గాలకూ కీలకంగా మారేలా కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు వర్గాలూ ముంబై అంతటా పోటాపోటీగా పోస్టర్లు వేసి హంగామా చేశాయి. ఒంటరి పోరు చేస్తున్న 83 ఏళ్ల యోధునికి అండగా నిలుద్దామంటూ పవార్ నివాసం ముందు అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు.

బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి: పవార్

ఇప్పటిదాకా బీజేపీతో కలిసి అధికారం పంచుకున్న పార్టీలన్నీ రాజకీయంగా సర్వనాశనమే అయ్యాయని శరద్ పవార్ అన్నారు. అజిత్ వర్గానికీ అదే గతి పట్టక తప్పదని జోస్యం చెప్పారు. ''రాజకీయ భాగస్వామ్య పార్టీలను క్రమంగా బలహీనపరచడం బీజేపీ విధానం. పంజాబ్ అకాలీదళ్ నుంచి తెలంగాణ, ఏపీ, బిహార్ దాకా ఇందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. బిహార్లో నితీశ్‌కుమార్ ముందుగానే మేల్కొని బీజేపీకి గుడ్‌బై చెప్పి ఆర్జేడీతో జట్టు కట్టారు'' అన్నారు. అజిత్ బల ప్రదర్శన సభలో తన ఫొటో ప్రదర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తనను కాదనుకుని వెళ్లిపోయాక ఫొటో ఎలా పెట్టుకుంటారంటూ దుయ్యబట్టారు. ఎన్సీపీ గుర్తును ఎవరూ లాక్కోలేరని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పార్టీ గుర్తు కేటాయించాలంటూ అజిత్ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడం తెలిసిందే.

ఇక విశ్రాంతి తీసుకోండి: అజిత్

83 ఏళ్ల శరద్ పవార్ రాజకీయాల నుంచి తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని మద్దతుదారుల భేటీలో అజిత్ అన్నారు. ఐఏఎస్‌లు కూడా 60 ఏళ్లకు రిటైర్ అవుతుంటారు. బీజేపీలో నేతలు 75 ఏళ్లకే రిటైరయ్యే సంప్రదాయముంది. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ ఇప్పటికే రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇన్నింగ్స్ ఉంటుంది. 25 నుంచి 75 ఏళ్ల దాకా మాత్రమే చక్కగా పని చేయగలుగుతారు. మీరెప్పుడు తప్పుకుంటారు?'' అని పవార్‌ను ప్రశ్నించారు. 2004 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే ఎన్సీపీకే ఎక్కువ సీట్లొచ్చినా ఆ పార్టీకే సీఎం పదవిని పవార్ కట్టబెట్టారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ''పవార్ మాకు దేవుడు. ఆయనపై అపార గౌరవముంది. ఆయన నిండు నూరేళ్లు జీవించాలని కోరుతున్నాం'' అన్నారు. తమకు ఆశీస్సులందించాలని కోరారు.

చీలికకు ముందే ఈసీ వద్దకు అజిత్!

ఎన్సీపీ నుంచి వేరుపడే ముందే పార్టీ పేరు, గుర్తు కోసం అజిత్ ఈసీని ఆశ్రయించినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆయన జూలై 2న తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి అధికార సంకీర్ణంలో చేరడం తెలిసిందే. తనకు 40 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేల మద్దతున్నందంటూ జూన్ 30వ తేదీనే ఈసీకి ఆయన లేఖ రాశారని, పార్టీ అధ్యక్షునిగా తనను ప్రకటించడంతో పాటు పార్టీ పేరు, గుర్తు కూడా కేటాయించాలని కోరారని సమాచారం.

తనకు సీఎం కావాలని కోరికగా ఉందని చెప్పారు. ఆయన గత ఆదివారం పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఎన్సీపీని వీడి సొంత కుంపటి పెట్టుకోవడం, శివసేన (షిండే)–బీజేపీ సంకీర్ణంలో చేరడం తెలిసిందే. ఎన్సీపీని అవినీతి పార్టీగా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శిస్తుంటే అజిత్ అదే బీజేపీ పంచన చేరారంటూ పవార్ మండిపడ్డారు.

ఈడీని కట్టడి చేయాల్సిందే

- మితిమీరిన అధికారాలున్నాయి
- సుప్రీంకోర్టులో వాదనలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసుల్లో విచారణ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అపరిమితాధికారాలు కట్టబెట్టారని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే ఆందోళన వెలిబుచ్చారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. లేదంటే పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో ఎవరికీ భద్రత కూడా ఉండబోదన్నారు. ఎంథ్రీఎం రియల్టీ గ్రూప్ డైరెక్టర్లు బన్సల్ బ్రదర్స్ అరెస్టు కేసులో మంగళవారం సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు ఏఎస్ బొపన్న, ఎంఎం సుందరేశ్ ధర్మాసనం ముందు ఆయన వాదనలు విన్పించారు. విచారణకు డైరెక్టర్లు అన్నివిధాలా సహకరిస్తున్నా ఈడీ నిరంకుశ పద్ధతిలో అరెస్టు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. ముందస్తు బెయిల్ నిబంధనల్లో ఒక్కదానికి కూడా విరుద్ధంగా నడుచుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. అందుకు జస్టిస్ సుందరేశ్ సరదాగా స్పందించారు. ''మీరన్నది నిజమే. ఇది పిల్లీ ఎలుకా చెలగాటం. వాళ్లు చట్టాలను ఉపయోగిస్తున్నారు'' అని వ్యాఖ్యానించారు. బన్సల్ సోదరులను ఈడీ జూన్ 14న అరెస్టు చేసింది. హరియాణాలోని పంచకుల కోర్టు విధించిన ఐదు రోజుల కస్టడీని వాళ్లు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు విజ్ఞప్తి మేరకు విచారణను ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేసింది.

కూతురిని తెగనమ్మిన తల్లి

మయూర్‌భంజ్: రెండోసారీ ఆడపిల్లే పుట్టిందని ఆమెను రూ.800కు అమ్మేసిందో దయలేని తల్లి. పైగా ఉపాధి నిమిత్తం తమిళనాడు వెళ్లిన భర్త తిరిగొచ్చి కూతురేదని అడిగితే చనిపోయిందంటూ కథ అల్లింది. పొరుగువాళ్ల ద్వారా విషయం తెలిసి అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దారుణం ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలోని కుంటాలో జరిగింది. కరామీ ముర్ము అనే నిరుపేద గిరిజన మహిళ తనకు రెండో కూతురు పుట్టడంతో దిగాలు పడింది. ఇద్దరు అమ్మాయిలను పెంచడమెలా అని పొరుగింటావిడతో వాపోయింది. ఆమె సలహా మేరకు ఎనిమిది నెలల పాపాయిని రూ.800కు అమ్మేసింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి పాపను కొనుక్కున్న దంపతులతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన పొరుగింటి మహిళను కూడా అరెస్టు చేశారు. పాపను చిన్నారుల వసతి గృహానికి తరలించినట్టు ఎస్పీ బత్తుల గంగాధర్ తెలిపారు.

హాయ్ పుతిన్...!

పుతిన్‌ను చూశానన్న ఆనందంలో ఉన్న ఎనిమిదేళ్ల చిన్నారి రైసత్ అకిపోవాను హత్తుకుంటున్న రష్యా అధ్యక్షుడు పుతిన్. చిన్నారి ఉండే ప్రాంతం డగేస్తాన్‌లో పుతిన్ పర్యటించడం, అప్పుడు పుతిన్‌ను చూడలేకపోయానని చిన్నారి వెక్కివెక్కి ఏడ్వడం మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఆయన ఇలా ఆమెను మాస్కోకు పిలిపించుకున్నారు. స్వయంగా చిన్నారితో ఆర్థికమంత్రికి ఫోన్ చేయించి సొంత ప్రాంతానికి నిధుల కేటాయింపు పెంచేలా చేశారు. మంగళవారం మాస్కోలో అధ్యక్షభవనంలో తీసిందీ ఫొటో.



...అలాగైతే రూ.15కే లీటర్ పెట్రోల్: గడ్కరీ

ప్రతాప్‌గఢ్ (రాజస్తాన్): వాహనాలకు ఇంధనంగా 60 శాతం ఇథనాల్, 40 శాతం విద్యుత్‌ను వాడుకోగలిగితే పెట్రోల్ ధర అమాంతం తగ్గి లీటర్ రూ.15కే అందుబాటులోకి వస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. బుధవారం రాజస్తాన్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఒక ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతులను అన్నదాతలుగానే కాకుండా ఇంధన దాతలుగా కూడా మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వాహనాలన్నీ వారు ఉత్పత్తి చేసే ఇథనాల్‌తోనే నడవాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. ''ఇథనాల్–విద్యుత్ ఇంధనంతో కాలుష్యంతో పాటు దిగుమతుల అవసరమూ బాగా తగ్గుతుంది. రూ.16 లక్షల కోట్ల దిగుమతి వ్యయాన్ని రైతుల సంక్షేమంపై వెచ్చించవచ్చు'' అని వివరించారు.



ప్రపంచంలోనే అతిపెద్ద గోళాకార భవంతి ఇది. 5.8 లక్షల చదరపు అడుగుల భవన ఉపరితలంపై ఎల్‌ఈడీ ఫలకాలను అమర్చారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లాస్‌వెగాస్‌లో తొలిసారిగా వాటినిలా అమెరికా జాతీయజెండా రంగుల్లో వెలిగించారు.

అనుచిత వ్యాఖ్యలపై మంత్రి పశ్చాత్తాపం

సాక్షి, చెన్నై: హైకోర్టు ధర్మాసనం ఏర్పాటు గురించి తాను చేసిన అనుచిత వ్యాఖ్యలపై రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఓ సభలో మదురై హైకోర్టు ధర్మాసనం ఏర్పాటు గురించి ప్రసంగిస్తూ, కలైంజ్ఞర్ కరుణానిధి వేసిన భిక్ష అని నోరు జారారు. ఈ వ్యాఖ్యలు మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. దీంతో బుధవారం మంత్రి మీడియా ముందుకు వచ్చి పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. తనప్రసంగంలో కరుణానిధి సేవలను గుర్తు చేస్తూ ఉద్వేగంగా ఆ పదాన్ని ఉపయోగించానని గుర్తు చేశారు. తాను ఆ పదం వాడినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని పేర్కొన్నారు. ఆ పదం వాడడం తీవ్ర మనోవేదనకు గురి చేసిందని, ఆ పదాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు, పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

మూడో న్యాయమూర్తిగా జస్టిస్ కార్తికేయన్



సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో మూడో న్యాయమూర్తిగా జస్టిస్ సీవీ కార్తికేయన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ గంగాపూర్వాల ఆదేశాలు ఇచ్చారు. సెంథిల్ బాలాజీ సతీమణి మేఘల దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో మంగళవారం భిన్న తీర్పులు వెలువడ్డ విషయం తెలిసిందే. జస్టిస్ నిషా భాను, జస్టిస్ భరత చక్రవర్తితో కూడిన ద్విసభ్య బెంచ్ వేర్వేరు తీర్పులు ఇవ్వడంతో ఈ కేసులో త్రిసభ్య బెంచ్ అనివార్యమైంది. సుప్రీంకోర్టు సైతం త్వరితగతిన మూడో న్యాయమూర్తిని నియమించి, కేసు విచారణను ముగించాలని ఆదేశించింది. దీంతో ఈ కేసులో మూడో న్యాయమూర్తిగా సీవీ కార్తికేయన్‌ను నియమించారు. ఈ పిటిషన్ వివరాలు, న్యాయమూర్తుల భిన్న తీర్పులను ఆయన పరిశీలించినానంతరం త్రిసభ్య బెంచ్ మళ్లీ మొదటి నుంచి విచారించనుంది.

తెన్‌కాశిలో రీ కౌంటింగ్

- 2 ఏళ్ల అనంతరం తీర్పు

సాక్షి, చెన్నై: తెన్‌కాశి అసెంబ్లీ నియోజకవర్గంలో తపాల్ ఓటర్లను రీ కౌంటింగ్ చేయాలని మద్రాసు హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తెన్‌కాశి నియోజకవర్గం నుంచి డీఎంకే కూటమి తరపున కాంగ్రెస్ అభ్యర్థి పళని నాడర్, అన్నాడీఎంకే తరపున సెల్వ మోహన్ దాస్ పాండియన్ పోటీ చేశారు. ఇందులో పళని నాడర్‌కు 89,315 ఓట్లు, సెల్వ మోహన్‌దాస్‌కు 88,945 ఓట్లు వచ్చాయి. 370 ఓట్లతో పళని నాడార్ గెలిచినట్లు ప్రకటించారు. అయితే తపాల్ ఓట్లు సరిగ్గా లెక్కించ లేదని, ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ పళని నాడర్ గెలుపునకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే అభ్యర్థి కోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో రెండేళ్లుగా పిటిషన్ విచారణ జరుగుతూ వచ్చింది. వాదనలు ముగియడంతో బుధవారం తీర్పు వెలువడింది. తపాల్ ఓట్లను సరిగ్గా లెక్కించ లేదని, ఇందులోనే తీవ్ర గందరగోళ పరిస్థితులు సృష్టించారని పిటిషనర్ బలమైన వాదనలు కోర్టు ముందు ఉంచడాన్ని న్యాయమూర్తి పరిగణలోకి తీసుకున్నారు. ఈ నియోజకవర్గంలో తపాల్ ఓట్లను రీకౌంటింగ్ చేయాలని ఆదేశించారు. 10 రోజుల్లోపు తపాల్ ఓట్లను లెక్కించి ఫలితం ప్రకటించాలని ఆ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిని న్యాయమూర్తి ఆదేశించారు. తక్షణం ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను ముగించారు.

సబ్ రిజిస్ట్రార్‌లపై డీవీఏసీ గురి

సాక్షి, చెన్నై: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై డైరెక్టర్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్(డీవీఏసీ) వర్గాలు బుధవారం గురిపెట్టాయి. చెన్నై శివారులోని రెడ్ హిల్స్, తిరుచ్చి తురయూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మధ్యాహ్నం నుంచి సోదాలు జరుగుతున్నాయి. ఈ రెండు చోట్ల సుమారు రూ.3 వేల కోట్ల మేరకు ఆస్తులకు సంబంధించిన వివరాలను లెక్కల్లోకి చూపించ లేదంటూ వచ్చిన సమాచారంతో ఈ సోదాలు చేపడుతున్నట్లు సమాచారం.

మేఘదాతుకు అనుమతి ఇవ్వొద్దు

- కేంద్ర జలశక్తి మంత్రికి దురై మురుగన్ విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న మంత్రి దురై మురుగన్

సాక్షి, చెన్నై: కావేరి తీరంలోని మేఘదాతు వద్ద జలాశయం నిర్మాణానికి కర్ణాటకకు అనుమతి ఇవ్వొద్దని కేంద్ర జలశక్తి గజేంద్ర సింగ్ షెకావత్‌కు రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి దురై మురుగన్ విజ్ఞప్తి చేశారు. మేఘాదాతులో డ్యాం నిర్మాణానికి కర్ణాటక చేస్తున్న దూకుడు ప్రయత్నాలు, కావేరి జలాల వాట పంపిణీలో నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించిన డీఎంకే ప్రభుత్వం కేంద్రం వద్ద బుధవారం పంచాయతీ పెట్టింది. ఢిల్లీకి మంత్రి దురై మురుగన్‌తోపాటు అధికారులు వెళ్లారు. జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ అయ్యారు. మేఘదాతులో డ్యాం నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కోరారు. కావేరి వ్యవహారంలో తమతో చర్చించకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగానే స్పందించారు. అలాగే, కావేరి యాజమాన్య సంస్థ, కేంద్ర నీటి పారుదల శాఖ వర్గాలతో దురై మురుగన్ భేటీ అయ్యారు. కావేరి యాజమాన్యం సంస్థలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఇంత వరకు వాటా నీటిని కర్ణాటక విడుదల చేయలేని ఫిర్యాదు చేశారు. త్వరితగతిన నీటిని పంపిణీ చేయాలని కోరుతూ తమిళనాడులో సాగు పరిస్థితులను వివరించారు.



సమావేశంలో పళని స్వామి, తమిళ్ మగన్ హుస్సేన్ తదితరులు



మహానాడు లోగోను ఆవిష్కరిస్తున్న పళని స్వామి

మహానాడు వేదికగా సత్తా చాటుతాం..!

- మదురై వేదికగా ఆగస్టు 20న నిర్వహిస్తాం
- 75 రోజుల్లో 1.60 కోట్లకు పెరిగిన అన్నాడీఎంకే సభ్యత్వం
- పార్టీ జిల్లాల కార్యదర్శుల భేటీలో పళని ప్రకటన
- సభ్యత్వ నమోదుకు మరో రెండు వారాల గడువు పొడిగింపు
- నాయకత్వ లోటుకు అవకాశమే లేదని స్పష్టీకరణ
- కామన్ సివిల్ కోడ్‌కి వ్యతిరేకంగా గళం వినిపించాలని నిర్ణయం

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకేను కైవసం చేసుకునేందుకు ఓ వైపు దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ, మరోవైపు అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్, మాజీ సీఎం పన్నీరు సెల్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే మెజారిటీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యుల మద్దతు, ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు తీర్పులతో అన్నాడీఎంకేను పళనిస్వామి తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం రాజకీయ వ్యూహాలకు పదును పెట్టే పనిలో పడ్డారు. అదే సమయంలో తలా ఓ దారిలో ఉన్న కేడర్‌ను అన్నాడీఎంకేలోకి తీసుకొచ్చే విధంగా సభ్యత్వ నమోదు ప్రక్రియకు ఇటీవల శ్రీకారం చుట్టారు. అన్నాడీఎంకే బలం ఏ మాత్రం తగ్గలేదని చాటే విధంగా సభ్యత్వ నమోదును తాజాగా విజయవంతం చేశారు.

జిల్లాల కార్యదర్శులతో సమావేశం

రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో జిల్లాల కార్యదర్శులు, పార్టీ ముఖ్య నేతలతో పళని స్వామి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ ముఖ్య నేతలు నత్తం విశ్వనాథన్, మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, ఎస్పీ వేలుమణి నేతృత్వం వహించారు. ఇందులో పళని స్వామి తన ప్రసంగం ద్వారా సభ్యత్వ నమోదు వివరాలను ప్రకటించారు. 75 రోజుల పాటు జరిగిన నమోదుతో సభ్యత్వాల సంఖ్య 1.60 కోట్లకు చేరిందని ప్రకటించారు. రాష్ట్రంలో అత్యధిక మంది సభ్యులను కలిగిన పార్టీ అన్నాడీఎంకే మాత్రమేనని ధీమా వ్యక్తం చేశారు. ఇక సభ్యత్వ నమోదు గడువును జూలై 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగిస్తున్నామని ప్రకటించారు. అలాగే, మదురై వేదికగా ఆగస్టు 20వ తేదీన మహానాడు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూపొందించిన లోగోను పళని స్వామి ఆవిష్కరించారు. వీర చరిత్రతో గోల్డెన్ జూబ్లీ చైతన్య మహానాడుగా నామకరణం చేశారు. ఇందులో దివంగత నేతలు అన్నా, ఎంజీఆర్, జయలలిత , పార్టీ ప్రధాన కార్యదర్శి పళని స్వామి పోటోలను పొందుపరిచారు. అలాగే, తమిళుల వీరత్వాన్ని చాటే జల్లికట్టు ఎద్దు, వైగై నదీ తీరాన్ని పొందుపరచడం విశేషం. ఈ మహానాడు నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలను ప్రకటించారు. సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న డీఎంకే పాలనలోని వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే విధంగా కార్యక్రమాల నిర్వహణతో పాటుగా బీజేపీ నాయకుల తీరుపై కూడా చర్చించడం గమనార్హం. బీజేపీ నాయకులను తమ దారిలోకి తెచ్చుకునే విధంగా ఉమ్మడి పౌర స్మృతి(సివిల్) చట్టానికి వ్యతిరేకంగా తన గళాన్ని పళని వినిపించారు. అన్నాడీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలోనే గతంలో తాము సివిల్ చట్టాన్ని వ్యతిరేకించామని, వ్యతిరేకిస్తూనే ఉంటామని జిల్లాల కార్యదర్శుల సమావేశంలో స్పష్టం చేశారు.



సమావేశానికి హాజరైన జిల్లాల కార్యదర్శులు



సరైన సమాధానం ఇచ్చాం..

అన్నాడీఎంకేలో నాయకత్వం లోటుకు ఛాన్సే లేదని పళని స్వామి స్పష్టం చేశారు. ఆయన ప్రసంగిస్తూ, పార్టీ అంతర్గత వ్యవహారాలను బయటకు చెప్పలేమని, ఖాళీగా ఉన్న జిల్లాల కార్యదర్శులతోపాటు అన్ని పదవులు త్వరలో భర్తీ చేస్తామన్నారు. మదురై వేదికగా జరిగే మహానాడుతో తమ బలం ఏమిటో చాటుతామన్నారు. అన్నాడీఎంకే మూడు , నాలుగు ముక్కలైనట్టుగా ప్రచారంచేస్తున్న వారికి సభ్యత్వ నమోదుతో సరైన సమాధానం ఇచ్చామన్నారు. అన్నాడీఎంకేలో ప్రస్తుతం ఉన్న వారంతా ఐక్యతతో , సమిష్టిగా, సైనికుల తరహాలో ముందుకెళ్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ క్షీణించిందని ధ్వజమెత్తారు. తమ హయాంలో ప్రజలకు ఉన్నతమైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రులలోనే దక్కిందని, ఇప్పుడు అది కొరవాడినట్లు ఆరోపించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ కేవలం ప్రకటనలకే పరిమితం అవుతోన్నారని విమర్శించారు. సీఎం స్టాలిన్ అసమర్థ పాలన తో రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందని ధ్వజమెత్తారు. మామన్నన్ వంటి సినిమాలు చూసూ సీఎం ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. గతంలో స్పీకర్ ధనపాల్‌ను అసెంబ్లీలో అవమాన పరిచి, ఇప్పుడేమో తాము దళిత పక్షపాతిగా చాటుకునే ప్రయత్నాలలో ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నారని మండి పడ్డారు. సీఎం స్టాలిన్ దృష్టి అంతా తన వారసులకు ఎలా సంపద సమకూర్చి పెట్టాలో..? అన్న అంశంపైనే ఉందని ఆరోపించారు. డీఎంకేకు బీ – టీఎంలుగా పనిచేస్తున్న వారికి, అన్నాడీఎంకేను నిర్వీర్యం చేయడం లేదా స్తంభింప చేయడం లక్ష్యంగా కుట్రలు చేసిన వారికి సభ్యత్వంతో ఇప్పటికే బలాన్ని చాటామన్నారు. అన్నాడీఎంకే ముక్కలు కాలేదని, కేడర్ బలంతో చెక్కు చెదరని కంచు కోటగా మారిందని ధీమా వ్యక్తం చేశారు.

నిర్ణీత సమయం విధుల్లో ఉండాల్సిందే

- వైద్యులకు ఆరోగ్య కార్యదర్శి ప్రత్యేక ఆదేశాలు

సాక్షి, చెన్నై: తమకు కేటాయించిన సమయాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు తప్పని సరిగా విధుల్లో ఉండాల్సిందేనని ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి గగన్ దీప్‌సింగ్ బేడీ ఆదేశించారు. వైద్యులు సక్రమంగా విధుల్లో ఉన్నారా..? అన్నది ధ్రువీకరించాలని జిల్లాల కలెక్టర్లకు బుధవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో డ్యూటీ డాక్టర్లు విధులకు సరిగ్గా హాజరు కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. విధులకు వచ్చినా తమ గదులకే పరిమితం అవుతున్నారని, రోగుల ఆరోగ్య క్షేమాన్ని అనేకమంది వైద్యులు పట్టించుకోవడం లేదని ప్రతిపక్షాలు ధ్వజమెత్తే పనిలో పడ్డాయి. దీంతో ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి గగన్ దీప్‌సింగ్ బేడీ స్పందించారు. జిల్లాల కలెక్టర్లు, ఆరోగ్య అధికారులకు ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేశారు. వివిధ రుగ్మతలకు సంబంధించిన స్పెషలిస్టులు, ఓపీ డాక్టర్లు, ఉదయం 7.30 నుంచి 12 గంటల వరకు ఓపీ సేవల నిమిత్తం విధుల్లో ఉండాల్సిందేనని ఆదేశించారు. అలాగే ఇతర వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు వారి వారి విభాగాలు, వార్డుల్లో విధుల్లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరైనా విధుల్లో లేని పక్షంలో, అత్యవసర కేసులకు చికిత్సలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖ పరంగా చర్యలు తప్పవన్న హెచ్చరికలు జారీ చేశారు. అలాగే, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వైద్యులు విధులకు సక్రమంగా హాజరు అవుతున్నారా..? అన్నది ధ్రువీకరించాలని, ఈ మేరకు ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

అమ్ముండి షుగర్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

వేలూరు: వేలూరు జిల్లా కాట్పాడి తాలుకా అమ్ముండి గ్రామంలో వేలూరు సహకార చెక్కర ఫ్యాక్టరీ ఉంది. ప్రస్తుతం ఫ్యాక్టరీలో క్రషింగ్ పూర్తి కావడంతో మరమ్మత్తు పనులు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం చెరుకు వ్యర్థాలను తరలించే కన్వేయర్ బెల్ట్‌పై వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ప్లాంట్‌లో క్రషింగ్ లేక పోవడంతో కార్మికులు ఎక్కువగా లేరు. దీంతో అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. ఈ సందర్భంగా చెక్కర ఫ్యాక్టరీ చైర్మన్ ఆనందన్ మాట్లాడుతూ కార్మికులు యంత్రాలకు వెల్డింగ్ చేస్తుండగా మంటలు బెల్టుపైపడి విద్యుత్ ప్లాంట్‌లపై పడటంతోనే మంటలు చెలరేగాయన్నారు. ఫలితంగా రూ. 2 కోట్లు విలువ చేసే వస్తువులు, యంత్రాలు దగ్ధమయ్యాయమని పేర్కొన్నారు.

పశ్చిమ కనుమల్లో కుండపోత

- మరో రెండు రోజులు కొనసాగనున్న వర్షాలు
- ఆరంజ్ అలర్ట్ జారీ



నీలగిరుల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

సాక్షి, చెన్నై: పశ్చిమ పర్వతశ్రేణుల వెంబడి ఉన్న తమిళ జిల్లాలో కుండపోతగా వర్షం పడుతోంది. ఈ వర్షాలు నీలగిరి, కోయంబత్తూరు, తెన్‌కాశి, తేనిలో భారీ వర్షం రెండు రోజుల పాటుగా కొనసాగనున్నాయి. దీంతో అధికారులు ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు. వివరాలు.. నైరుతి రుతు పవనాలు కేరళలో పూర్తిగా విస్తరించిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం తమిళనాడులోని పశ్చిమ పర్వత శ్రేణుల వెంబడి ఉన్న తెన్‌కాశి, కోయంబత్తూరు, నీలగిరులపై అధికంగా చూపుతోంది. మంగళవారం రాత్రి నుంచి నీలగిరుల్లోని కూడలూరు, పందలూరు, ఊటీ పరిసరాలలో వర్షం కురుస్తోంది. ఫలితంగా పర్యాటక కేంద్రంలో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. నీలగిరుల్లోని అవలాంజి పరిసరాలలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. అనేక చోట్ల చెట్లు నేలకొరగడంతో యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. అవలాంజిలో గడిచిన 24 గంటలలో 18 సెంటీ మీటర్ల వర్షం పడింది. అలాగే, కోయంబత్తూరు పరిసరాల్లోనూ అనేక చోట్ల భారీ వర్షం పడింది. తెన్‌కాశిలో కురుస్తున్న వర్షాలకు కుట్రాలం జలపాతం పొంగి పొర్లుతుండటం పర్యాటకులకు కనువిందుగా మారింది. తేని, దిండుగల్ జిల్లాలోనూ వర్షాలు పడుతున్నాయి. దక్షిణ ఆగ్నేయ, సెంట్రల్ బంగాళాఖాతం, మన్నార్ వలిగుడా, కన్యాకుమారి తీరాలలో 65 కి.మీ వేగంతో గాలి ప్రభావం ఉంది. దీంతో జాలర్లు అటు వైపుగా వేటకు వెళ్లకుండా ఒడ్డుకు పరిమితమయ్యారు. వర్షాల కారణంగా ఆత్తూరులో ద్విచక్ర వాహన దారుడిపై చెట్టు కొమ్మలు విరిగి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ వర్షాలు మరో రెండు రోజులు కొనసాగనుండడంతో ఆయా జిల్లాలలో అధికారులు అప్రమత్తమయ్యారు. నీలగిరుల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఇక, కేరళలో తెక్కడై పరిసరాలలో కురుస్తున్న వర్షాల కారణంగా తమిళనాడుకు చెందిన ముల్‌లై పెరియార్ జలాశయంలోకి నీటి రాక పెరిగింది. బుధవారం డ్యాం నీటి మట్టం 116 అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

ఇకపై న్యాయ పోరాటమే

- గవర్నర్‌తో తాడో పేడో తేల్చుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం?
- మాజీ మంత్రులపై కేసు నమోదుకు అనుమతి ఇవ్వండి
- 13 ముసాయిదాలను ఆమోదించాలని న్యాయశాఖ మంత్రి లేఖ



గవర్నర్ రవి, మంత్రి రఘుపతి

సాక్షి, చెన్నై: గవర్నర్ ఆర్ఎన్ రవికి వ్యతిరేకంగా న్యాయ పోరాటానికి డీఎంకే పాలకులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఆయనతో తాడో పేడో తేల్చుకునే విధంగా న్యాయ మంత్రి రఘుపతి బుధవారం లేఖాస్త్రం సంధించారు. గుట్కా స్కాంతో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రులపై కేసుల నమోదుకు గవర్నర్ అనుమతి కోరారు. పెండింగ్‌లో ఉన్న ముసాయిదాలను గుర్తు చేస్తూ ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. వివరాలు.. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్‌రవి, సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న సమరం గురించి తెలిసిందే. ఇన్నాళ్లు మాటల యుద్ధాలు జరుగుతూ రాగా, ప్రస్తుతం సీఎం అధికారాల్లో జోక్యంచేసుకునే రీతిలో గవర్నర్ చర్యలు ఉండటం వివాదానికి దారి తీశాయి. అదే సమయంలో మంత్రి సెంథిల్ బాలాజీ వ్యవహారంలో గవర్నర్ తీరును డీఎంకే పాలకులు తీవ్రంగానే పరిగణించారు. ఆయన చర్యలను చట్టబద్ధంగానే ఎదుర్కొనేందుకు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈ పోరాటానికి ముందుగా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ముసాయిదాలు, ఆయన నుంచి రావాల్సిన అనుమతులు తదితర అంశాలను ప్రస్తావిస్తూ చివరి అస్త్రంగా లేఖ రాశారు. కేరళ రాష్ట్రంలోనూ అక్కడి పాలకులు ఇదే రకంగా వ్యవహరించి చివరకు గవర్నర్‌పై న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. ఇదే తరహాలో ముందుకు సాగాలని డీఎంకే సైతం వ్యూహాలు రచిస్తున్నట్లు తెలిసింది.

రఘుపతి లేఖాస్త్రం..

సెంథిల్ బాలాజీ కేసులో అత్యుత్సాహాన్ని ప్రదర్శించిన గవర్నర్‌ను ఆయన రూటూలోనే వెళ్లి, అన్నాడీఎంకే మాజీ మంత్రుల మెడకు కేసుల ఉచ్చును తగిలించే విధంగా లేఖాలో కీలక అంశాన్ని మంత్రి రఘుపతి ప్రస్తావించారు. అన్నాడీఎంకే హయాంలో జరిగిన గుట్కా స్కాంలో సీబీఐ విచారణను గుర్తుచేశారు. ఇందులో మాజీ ఆరోగ్య, వాణిజ్య పన్నుల శాఖ మంత్రులు విజయ భాస్కర్, బీవీ రమణ ప్రమేయంపై కేసుల నమోదు, కోర్టుల్లో విచారణలకు సిద్ధమవుతూ గవర్నర్ అనుమతి కోరారు. అలాగే నగరాభివృద్ధి శాఖమాజీ మంత్రి ఎస్పీ లుమణి, రవాణా మాజీ మంత్రి విజయ భాస్కర్‌పై అవినీతి ఆరోపణలకు సంబంధించి జరిగిన సోదాల్లో లభించిన ఆధారాలకు అనుగుణంగా కేసుల నమోదుకు సిద్ధమయ్యారు. ఇందుకు కూడా అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరారు. అలాగే అన్నాడీఎంకే హయాంలో రెండు, తమ పాలనలో 11 ముసాయిదాలను రాజ్ భవన్‌కు పంపించి ఉన్నారని, వీటిని ఆమోదించాలని విన్నవించారు. ఇప్పటికే తాను రెండుసార్లు లేఖ రాసినట్టు, ఓ సారి స్వయంగా కలిసి ఈ అంశాల గురించి చర్చించిన విషయాన్ని లేఖలో ప్రముఖంగా ప్రస్తావించారు. కేసుల నమోదుకు అనుమతులు, పెండింగ్‌లో ఉన్న మసాయిదాలకు ఆమోదం, తాను స్వయంగా కలిసి జరిపిన చర్చ, విజ్ఞప్తి అంటూ మూడు అంశాలను పదే పదే లేఖలో పేర్కొన్నారు. అయితే వీటన్నింటికీ గవర్నర్ సకాలం ఆమోదం తెలపడం అనుమానమేనని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. దీంతో న్యాయ పోరాటానికి డీఎంకే పాలకులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

100 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

తిరువళ్లూరు: అనుమతి లేకుండా టపాసులు తయారు చేయడంతో పాటు 100 కిలోల పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని మనవాలనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా మనవాలనగర్ నుండి అధిగత్తూరు వెళ్లే మార్గంలో ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేసి భారీ శబ్దం వచ్చే టపాసులను తయారు చేస్తున్నట్లు ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్‌కు పిర్యాదు అందింది. దీంతో సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని ఇన్స్పెక్టర్ పద్మశ్రీబబ్బిని ఆదేశించారు. ఇందులో భాగంగానే ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా జాతర ఉత్సవాలకు కోసం భారీ శబ్దంతో వచ్చే టపాసులను తయారు చేస్తున్నట్లు గుర్తించి శశికుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు.

నలుగురి ప్రాణం తీసిన అతివేగం

సాక్షి, చెన్నై : పుదుకోట్టై రహదారిలో బుధవారం ఉదయం అతివేగంగా దూసుకొచ్చిన కారు అదుపు తప్పి బస్ సెల్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మరణించారు. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలోచికిత్సలో ఉన్నారు. వివరాలు.. తిరుచ్చి తిల్‌లై నగర్‌లోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తున్న మురళి, రవిచంద్రన్ మంగళవారం తెన్‌కాశిలోని తమ బ్రాంచ్‌లో పరిశీలనకు అద్దె కారులో వెళ్లారు. ఈకారును తిరుచ్చికి చెందిన గణేష్‌కుమార్ నడిపాడు. అక్కడ పని ముగించుకుని రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. తిరుగు ప్రయాణంలో తమ మిత్రులు సురేష్‌కుమార్, రాజ్‌కుమార్‌ను తిరుచ్చికి వెంట బెట్టుకు వచ్చారు. బుధవారం ఉదయం మార్గం మధ్యలోని పుదుకోట్టై కొడుంబలూరు వద్ద అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పింది. కంట్రల్ చేయలేని పరిస్థితులో డివైడర్‌ను దాటి మరో మార్గంలోకి కారు దూసుకెళ్లి బస్ షెల్టర్‌ను ఢీకొంది. అతి వేగంగా కారు ఢీ కొనడంతో అందులో ఉన్న వారిలో నలుగురు ఘటనా స్థలంలోనే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు కారులో చిక్కుకుని ఉన్న మృత దేహాలను అతికష్టంపై బయటకు తీశారు. మృతుల్లో రవిచంద్రన్, గణేష్‌కుమార్, రాజ్ కుమార్, సురేష్‌కుమార్ ఉన్నట్లు గుర్తించారు. ఇక తీవ్రగాయాలతో మురళి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

క్లుప్తంగా

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

తిరువళ్లూరు: అనారోగ్య సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని బలవర్మణానికి పాల్పడ్డాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మిషాపూర్ జిల్లాకు చెందిన వివేక్‌కుమార్(20) స్నేహితులతో కలిసి పెద్ద పాళ్యం బస్టాండుకు సమీపంలోని ఇంటిలో అద్దెకు వుంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి భోజనం చేసిన వివేక్‌కుమార్, అర్ధరాత్రి ఇంట్లో వున్న సీలింగ్ ప్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా గుర్తించిన సహచరులు పెద్దపాళ్యం వైద్యశాలకు తరలించగా డాక్టర్‌లు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

తిరువళ్లూరు: విద్యుత్ వినియోదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌డేను గురువారం ఉదయం తిరువళ్లూరు పెద్దకుప్పంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రతి నెలా విద్యుత్ వినియోదారుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ డేను అధికారులు నిర్వహిస్తున్నారు. ఇందులో రైతులు సాధారణ ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చు. కాగా గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్‌డేను నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. సమావేశానికి కాంచీపురం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సునీల్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కనకరాజ్ పాల్గొని ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

జ్వరంతో వ్యక్తి మృతి

తిరువళ్లూరు: తీవ్రజ్వరంతో రైల్వేస్టేషన్ సమీపంలో కుప్పకూలిన వ్యక్తి తిరువళ్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చిక్సిత పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పూంగానగర్‌కు చెందిన ధర్మన్ కుమారుడు మహేష్(27). ఇతను చెన్నైలోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం యథావిధిగా విధులకు వెళ్లిన మహేష్, అనారోగ్యంగా ఉందంటూ లీవుపై ఇంటికి రైలులో తిరిగి వచ్చినట్టు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌కు వచ్చిన మహేష్ తన తమ్ముడు హరీష్‌కు ఫోన్ చేసి రైల్వేస్టేషన్ రావాలని కోరినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న హరీష్ అక్కడికి వెళ్లి చూడగా రైల్వేస్టేషన్ బయట స్పృహ తప్పిన స్థితిలో మహేష్ కనిపించాడు. దీంతో వెంటనే మహేష్‌ను తిరువళ్లూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చిక్సిత పొందుతూ మృతి చెందాడు.

వైభవం.. ఆలయ మహా కుంభాభిషేకం

- తేనుపురీశ్వరునికి విశేష పూజలు
- పవిత్ర జలాలతో పులకించిన భక్తజనం
- హాజరైన మంత్రి అన్బరసన్



కుంభాభిషేక పూజల్లో మంత్రి అన్బరసన్

కొరుక్కుపేట: తాంబరం సమీపంలోని మేడంబాక్కంలో ఉన్న శ్రీతేనుపురీశ్వరర్ ఆలయ మహాకుంభాభిషేకం బుధవారం వైభవంగా జరిగింది. మంత్రి అన్బరసన్‌తో పాటు 50 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. తాంబరం కార్పొరేషన్ 5వ మండల పరిధిలోని భట్ట మేడంబాక్కంలో సుమారు 1500 సంవత్సరాల నాటి తేనుగంబాల్ సమేత శ్రీతేనుపురీశ్వరర్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో శివుడు అరుణగిరినాథునిచే పూజలందుకుంటున్నారు. ఆలయంలో ఇటీవల పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కుంభాభిషేక పూజలు నిర్వహించారు. జూన్ 29వ తేదీ నుంచి వివిధ హోమాలు, అభిషేక పూజలు జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం ఉదయం 9:45 గంటలకు ప్రత్యేక పూజలు, మహా హారతి, యత్రదానం వంటి పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మహా కుంభాభిషేకం అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం తేనుకంబాల్, తేనుపురీశ్వరర్‌తోపాటు సకల దేవతలను అలంకరణ, అభిషేక సేవలను నేత్రపర్వంగా చేపట్టారు. అలాగే మహాదీపారాధన గావించారు. వేడుకల్లో మంత్రి అన్బరసన్, తాంబరం ఎమ్మెల్యే ఎస్ఆర్ రాజా, తాంబరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వసంత కుమారి, డిప్యూటీ మేయర్ కె కామరాజ్, మండల కమిటీ నాయకులు డి.కామరాజ్, ఎస్ ఇంద్రన్ సహా 50 వేలమందికి పైగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు తిరు కల్యాణ మహోత్సవం కమణీయంగా సాగింది.

చిన్నారుల గుండె శస్త్ర చికిత్సలకు ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న నవీన్, బాల కృష్ణమూర్తి

కొరుక్కుపేట: దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న 500 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలను చేయించేందుకు చెన్నై అపోలో ఆస్పత్రి ముందుకు వచ్చింది. హీలింగ్ టినీ హార్ట్స్ ప్రాజెక్టు కోసం అపోలో ఆస్పత్రి పీడియాట్రిక్ కార్డియక్ యూనిట్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ (ఆర్‌సీఎంఈ) సంయుక్తంగా అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో అపోలో చిల్డ్రెన్స్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ నవీన్, ఆర్‌సీఎంఈ అధ్యక్షుడు బాలుకృష్ణమూర్తి, హీలింగ్ టినీ హార్ట్ ప్రాజెక్టు చైర్మన్ పి.మాధవన్ ఒప్పంద పత్రాలపై సంతాకాలు చేసి మార్చుకున్నారు . డాక్టర్ నవీన్ మాట్లాడుతూ.. నిరుపేద చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు కోసం సామాజిక బాధ్యతతో రోటరీ క్లబ్‌తో కలిసి అపోలో ఆస్పత్రి పనిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతే ప్రధానం

- ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారి ఎస్ఎస్ రాజు



సేఫ్ సౌత్ ఇండియా సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

కొరుక్కుపేట: పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, దీనిపై అన్ని సంస్థలు, పరిశ్రమలు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆపరేషన్స్- చెన్నై జనరల్ మేనేజర్ ఎస్ఎస్ రాజు తెలిపారు. ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఆధ్వర్యంలో చెన్నై ట్రేడ్ సెంటర్ వేదికగా 8వ ఓఎస్‌హెచ్ సౌత్ ఇండియా, 7వ సేఫ్ సౌత్ ఇండియా-2023 రెండు రోజుల సదస్సును బుధవారం ప్రారంభించారు. అక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ అండ్ ఫైర్ సేఫ్టీపై రాజుతో పాటు తమిళనాడు సేఫ్టీ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ టీఆర్ మురళీ, తమిళనాడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లేబర్ స్టడీస్ విభాగాధిపతి రమేష్ కుమార్, డీసీపీ ట్రాఫిక్ అధికారి సమయ్ సింగ్, అగ్నిమాపక అధికారి రాబిన్‌కాస్ట్రోలు ప్రసంగించారు. పరిశ్రమల్లో సేఫ్టీకి తగిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరుగుతుందని వివరించారు. నిర్వాహకులు మాణిక్యం, సంజీవ్‌రావు, ప్రశాంత్ జైన్, పంకజ్ జైన్ పాల్గొన్నారు.

9న ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థనా సభ

కొరుక్కుపేట: కోయంబత్తూరు-సిరువాణి మార్గంలోని కారుణ్య పట్టణంలో బెథెస్తా అంతర్జాతీయ ప్రార్థన కేంద్రం ఉంది. ఇక్కడ ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థనా సభ నిర్వహించనున్నారు. జీసస్ కాల్స్, కారుణ్య విశ్వవిద్యాలయం చాన్సలర్ డాక్టర్ పాల్ దినకరన్, ఇవాంజెలిన్ పాల్ దినకరన్, శ్యామ్యూల్ దినకరన్, సెల్లా రామోలా ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ప్రార్థనలకు హాజరయ్యే వారి కోసం పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 0422-2614580 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అస్వస్థతకు గురైన హెడ్‌కానిస్టేబుల్ మృతి

అన్నానగర్: కన్యాకుమారి జిల్లా మైలాడికి చెందిన అయ్యప్పన్ (47) నెల్‌లై జిల్లా నాంగునేరి పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అయ్యప్పన్ మంగళవారం రాత్రి నాంగునేరి ట్రెజరీ వద్ద బందోబస్తులో నిమగ్నమయ్యారు. ఆపై అకస్మాతుగా అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం చికిత్స నిమిత్తం నాంగునేరి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అయితే అక్కడ చికిత్స ఫలించక అయ్యప్పన్ మృతి చెందాడు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అనుమతి లేకుండా ఆందోళన

- బీజేపీ జిల్లా అధ్యక్షుడి సహా 72 మందిపై కేసు

తిరువొత్తియూరు: తంజావూరు జిల్లాలో అనుమతి లేకుండా ఆందోళన చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడితో సహా 72 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తంజావూరు జిల్లా చకోట్టై ప్రాంతంలో నడుస్తున్న ప్రైవేటు పాఠశాలకు మార్గం కోసం నిరసన చేస్తున్న తంజావూరు ఉత్తర జిల్లా బీజేపీ కార్యదర్శి సతీష్ కుమార్‌ను ఇటీవల అరెస్టు చేశారు. దీనిని ఖండిస్తూ 3వ తేదీన తిరువెరంపూరులో బీజేపీ నేతలు ఆందోళన చేశారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో బీజేపీ నిరసనకు దిగింది. ఈ సందర్భంగా తిరుచ్చి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర ఓపీసీ టీమ్ వైస్ ప్రెసిడెంట్ శరవణన్, జిల్లా మీడియా విభాగం హెడ్ ఇంద్రన్ ప్రజలకు ఇబ్బంది కలిగించారని తిరువెరంపూర్ నార్త్ జోన్ ప్రెసిడెంట్ సెంథిల్‌కుమార్ సహా 72 మంది బీజేపీ సభ్యులపై తిరువెరంపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులకు కనీస వసతులు కల్పించండి



వేలూరు కొత్త బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: వేలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కొత్త బస్టాండ్‌ను తనిఖీ చేశారు. చెన్నై బస్సులు నిలిచే ప్రాంతంలో మరుగుదొడ్డికి వచ్చే నీరు పూర్తిగా బస్టాండ్‌కు వస్తుందని వీటి ద్వారా ప్రయాణికులకు దుర్వాసన వచ్చే అవకాశం ఉందన్నారు. అదే విధంగా మూత్ర విసర్జనకు నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే తెరిపించాలని, బస్టాండ్‌లో పద్ధతి ప్రకారం దుకాణాలకు టెండర్ విడిచి ప్రయాణికులకు అవసరమైన కనీస వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్టాండ్‌లో విక్రయించే తిను బండారాలు, తాగునీరు తదితర వాటిని అధికారులు తరచూ తనఖీ చేయాలని సూచించారు. బస్టాండ్‌ను ప్రారంభించి ఆరు నెలలకు పైగా అవుతున్నప్పటికీ బస్టాండ్‌లో కనీస వసతులు ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ రత్నస్వామి టెండర్‌లు వదలడంలో ఆలస్యం కావడంతోనే దుకాణాలు ఏర్పాటు చేయలేకపోయామని వివిరణ ఇచ్చారు. ప్రస్తుతం తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశామన్నారు. బస్టాండ్‌లో తోపుడు బండ్లు రాకుండా చూడాలని, ప్రయాణికులకు అవసరమైన తాగునీరు తదితర వాటిని సిద్ధం చేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ సుబ్బయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసన్, ఆరోగ్యశాఖ అధికారి మురుగన్ ఉన్నారు.

కొడుకు మృతిని తట్టుకోలేక తండ్రికి గుండెపోటు

తిరువళ్లూరు: ద్విచక్ర వాహనాన్ని మినీవ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కొడుకు మృతి చెందాడనే వార్త విని తండ్రి సైతం గుండెపోటుకు బలైన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తిరునింద్రవూర్‌కు చెందిన కుప్పన్(72) కుమారుడు ఆశోక్ కుమార్(49). ఇతను ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతను గత సోమవారం తిరునింద్రవూర్ సమీపంలోని పాళవేడు వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మినీ వ్యాన్ ఆశోక్ కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అశోక్‌కుమార్‌ను బంధువుల కీళ్‌పాక్కం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ అదే రోజు రాత్రి అశోక్ కుమార్ మృతి చెందాడు. అశోక్‌కుమార్ అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కొడుకు మృతితో మనోవేదనకు గురైన అతడి తండ్రి కుప్పన్ బుధవారం ఉదయం గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడ్ని స్థానికంగా వున్న వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా కొడుకు మృతిని తట్టుకోలేక తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

కోలీవుడ్ టాక్స్

విక్రమ్ నట విశ్వరూపం "తంగలాన్"



తంగలాన్ చిత్ర హీరోహీరోయిన్లతో దర్శకుడు పా.రంజిత్

తమిళసినిమా: టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిన చిత్రం తంగలాన్. చియాన్ విక్రమ్ నట విశ్వరూపం చూపించారని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. నటి పార్వతీ, మాళవిక మోహన్ నాయికలుగా నటిస్తున్న ఇందులో నటుడు పశుపతి, ముత్తుకుమార్, హరికృష్ణన్, ప్రీతి, అర్జున్ ప్రభాకరన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి పా.రంజిత్ దర్శకుడు. ఈయన చిత్రాలు చాలా భిన్నంగా సామాజిక పరమైన అంశాలతో ముడిపడి ఉంటాయి. పా.రంజిత్, విక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తొలి చిత్రం ఇది. జ్ఞానవేల్ రాజా స్టూడియో గ్రీన్, పా.రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని, కిశోర్‌కుమార్ చాయాగ్రహణను అందిస్తున్నారు. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో సాగే ఈ చిత్రం ఆది నుంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఇందులో నటుడు విక్రమ్ గెటప్. ఇంతకు ముందెప్పుడూ చూడనటువంటి ఆయన నటనను తంగలాన్ చిత్రంలో చూస్తారని చిత్ర వర్గాలు పేర్కొన్నాయి. విక్రమ్ గెటప్ చూస్తేనే తంగలాన్ చిత్రం కచ్చితంగా కొత్తగా ఉంటుందని అనిపిస్తోంది. కాగా చిత్ర షూటింగ్ పూర్తి అయ్యింది. దీన్ని 118 రోజుల్లో పూర్తి చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక ఫొటోను విడుదల చేసింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఈ చిత్రం నటుడు విక్రమ్ కేరీర్‌లో గుర్తుండిపోయేలా ఉంటుందని తెలిపింది.



కడత్తల్ చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

రాజకీయ పరపతితో
వచ్చే విజయం తాత్కాలికమే

తమిళసినిమా: ఇంతకు ముందు కాత్తవరాయన్, గాంధర్వన్, ఈపీకో 302 వంటి వైవిధ్యభరిత కథా చిత్రాలను తెరకెక్కించిన సలైంగై దురై తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం కడత్తల్. డి.నిర్మలాదేవి ఆశీస్సులతో పీఎస్‌పీ క్రియేషన్స్, ప్రైమ్ అసోసియేట్స్ సంస్థల సమర్పణలో సౌత్ ఇండియన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన చిత్రం ఇది. ఈ చిత్రం ద్వారా ఎంఆర్ దామోదరన్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. విదీషా, ప్రియ నాయకిలుగా నటించిన ఇందులో నటి సుధ, నిళల్‌గళ్ రవి, సింగంపులి, తమిళ్‌వానన్, ఆర్.జయచంద్రన్, రవికాంత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి ధన్‌శివన్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఇదే నెలలో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తమిళ్ నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళీ రామనారాయణన్, దర్శకుడు పేరరసు, ఎళిల్, నటుడు, నిర్మాత కే.రాజన్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు పేరరసు మాట్లాడుతూ ఈ చిత్రానికి కడత్తల్(కిడ్నాప్) అని మంచి పేరును పెట్టారన్నారు. అయితే ఇది దేనికి సంబంధించిన కిడ్నాప్‌నో చెప్పలేదన్నారు. చిత్రాలు రాజకీయ పరపతితోనో, ఇతర ప్రచారంతోనో సాధించిన విజయం నిరంతరం కాదన్నారు. పది ఏళ్ల తరువాత కూడా చిత్రం పేరు చెప్పగానే అందులోని సన్నివేశాలు, నటీనటులు గుర్తుకు వచ్చే చిత్రాలదే నిజమైన విజయం అన్నారు. అదే విధంగా చిత్రాలకు మతాలను అంటగట్టరాదన్నారు. కడత్తల్ చిత్ర ట్రైలర్ బాగుందని, మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సలంగైదురై మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకులకు వినూత్న అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఇందులో అందరూ కొత్తవారే నటించారని, మీడియానే దీన్ని ప్రేక్షకుల చెంతకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు భామలతో జయంరవి



జీనీ చిత్ర ప్రారంభోత్సవంలో అతిథులు

తమిళసినిమా: పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో అరుళ్‌మొళిగా టైటిల్ పాత్రను పోషించి అందరి ప్రశంసలను పొందిన నటుడు జయంరవి. ఈయన నటించిన చిత్రాలు వరుసగా విడుదలకు సిద్ధం అవుతున్నాయి. కాగా తాజాగా మరో నూతన చిత్రంలో నటించడానికి సిద్ధం అయ్యారు. ఈ చిత్రాన్ని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేశ్ నిర్మిస్తున్నారు. ఇంతకు ముందు ఎల్‌కేజీ, కోమాలి, మూక్కుత్తి అమ్మన్, వెందు తనిందదు కాడు వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఈయన నిర్మిస్తున్న 25వ చిత్రం ఇది. దీనికి జీనీ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రం ద్వారా మిష్కిన్ శిష్యుడు జేఆర్ అర్జున్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో నటి కల్యాణి ప్రియదర్శన్, కృతి శెట్టి, వామిక కబి హీరోయిన్లుగా నటిస్తున్నారు. సీనియర్ నటి దేవయాని ముఖ్య పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం బుధవారం ఉదయం స్థానిక తిరువేర్కాడు సమీపంలోని పీజీఎస్ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖుల హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. మహేశ్ ముత్తుసామి ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రాన్ని తమిళంతో పాటు, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ సహా ఐదు భాషల్లో రూపొందిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపారు.

ఆర్‌కేకు జంటగా పంజాబీ బ్యూటీ



నటి మాల్వీ మల్హోత్రా

తమిళసినిమా: పాత నీరు పోక, కొత్త నీరు రాక అన్న సామెత సినీ పరిశ్రమకు సరిగ్గా సరిపోతుంది. ముఖ్యంగా కొత్త నటీమణులు సినిమాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి పరితపిస్తుంటారు. అలా చాలా మంది క్రేజీ హీరోయిన్లుగా రాణిస్తున్నారు. తాజాగా నటి మాల్వీ మల్హోత్రా కోలీవుడ్‌లో తన లక్‌ను పరీక్షించుకోవడానికి రెడీ అవుతున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఈ పంజాబీ బ్యూటీ ముంబాయిలో నటిగా శిక్షణ పొంది ఆ తరువాత మోడలింగ్ రంగంలోకి ప్రవేశించింది. తొలుత బుల్లితెరకు పరిచయం అయ్యింది. అలా వెండితెరలోనూ నాయకిగా నటిస్తున్నారు. ఇప్పటికే పంజాబీ, తెలుగు, మలయాళం భాషల్లో నటిస్తున్న ఈ భామ ఇప్పుడు కోలీవుడ్‌కు ఎంట్రీ షురూ అయ్యిందన్నది తాజా సమాచారం. నటుడు ఆర్‌కే సరసన నటించే అవకాశం ఈమెను వరించింది. మలయాళంలో రఫీ దర్శకత్వంలో దిలీప్, కీర్తిసురేశ్, హనీరోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన రింగ్ మాస్టర్ 2014లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. కాగా ఆ చిత్రం ఇప్పుడు తమిళంలో రీమేక్ కాబోతోంది. ఇందులో నటుడు ఆర్‌కే కథానాయకుడిగా నటించనున్నారు. ఈయన ఇంతకు ముందు ఎల్లామ్ అవన్ సెయల్, అళగర్ మలై, వైగో ఎక్స్‌ప్రెస్ వంటి పలు విజయవతమైన చిత్రాల్లో నటించారు. కాగా చిన్న గ్యాప్ తరువాత ఈయన నటిస్తున్న ఈ చిత్రంలో నటి మాల్వీ మల్హోత్ర నాయకిగా నటించనున్నారు. బిగ్‌బాస్ అభిరామి ముఖ్య పాత్రలో నటించనున్నారు. ఆర్.కన్నన్ దర్శకత్వం వహించనున్నారు. కాగా ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభం కానున్నట్లు సమాచారం.

అది మా ఆయనకు నచ్చదు



ప్రియమణి

తమిళసినిమా: ఇప్పుడు వస్తున్న చిత్రాల్లో లిప్‌లాక్ సన్నివేశాలు సర్వసాధారణం అయిపోయాయి. నటీమణులు కూడా నిరభ్యంతరంగా నటించేస్తున్నారు. ఇటీవల నటి తమన్న ఈ రకం చుంబనాల్లో రెచ్చిపోయి నటించి నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ఇక పరుత్తివీరన్ చిత్రంలో నటనకుగానూ జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్న నటి ప్రియమణి. ఈ కన్నడ నటి తమిళం, తెలుగు భాషలతో పాటు హిందీ చిత్రాల్లో నటించే స్థాయికి ఎదిగారు. మొదట్లో ఈమె కూడా లిప్‌లాక్ సన్నివేశాల్లో నటించి కుర్రకారును కిర్రెక్కించారు. అయితే ఇప్పుడు అలాంటి సన్నివేశాలకు నో అంటున్నారు. ఇప్పుడు కథానాయకిగా కాకుండా పాత్రలకు ప్రాధాన్యత కలిగిన చిత్రాల్లో నటిస్తున్నారు. ఇటీవల ఒక కార్యక్రమంలో ప్రియమణి మాట్లాడారు. కొన్నేళ్లుగా తాను లిప్‌లాక్ సన్నివేశాల్లో నటించడం లేదని అన్నారు. వివాహానంతరం అలాంటి సన్నివేశాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నానని చెప్పారు. అది నటనే అయినా ఒక మహిళగా అలాంటి సన్నివేశాల్లో నటించడం కష్టం అనిపిస్తుందన్నారు. అయినా ముద్దు సన్నివేశాల్లో నటించడం తన భర్తకు ఇష్టం ఉండదని చెప్పారు. ఒక వేళ అలా నటిస్తే తన భర్తకు సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. తనకు 2017లో వివాహం జరిగిందని, అప్పటి నుంచి లిప్‌లాక్ సన్నివేశాల్లో నటించడం లేదని తెలిపింది. ఈ విషయాన్ని తాను చిత్రాలు అంగీకరించినప్పుడే దర్శక నిర్మాతలకు చెప్పేస్తానని అన్నారు. తాను నటించే చిత్రాలను తమ ఇరు కుటుంబాలకు చెందిన వారూ చూస్తారన్నారు. కాబట్టి ముద్దు సన్నివేశాల్లో నటించి వారిని కష్టపెట్టడం తనకు ఇష్టం లేదని, అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు నటి ప్రియమణి తెలిపారు.

క్లుప్తంగా

గుట్కా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



కారుతో పాటు గుట్కాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వేలూరు: బెంగళూరు నుంచి కారులో గుట్కాను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం నుంచి తరచూ గుట్కా, మత్తుపదార్థాలను రాణిపేట జిల్లా మీదుగా చెన్నైకి తరలిస్తున్నట్లు రాణిపేట ఎస్పీ కిరణ్ శృతికి రహస్య సమాచారం వచ్చింది. ఆమె ఆదేశాల మేరకు ఆర్కాడు ఇన్‌స్పెక్టర్ వినాయకమూర్తి ఆర్కాడు జాతీయ రహదారి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బెంగళూరు నుంచి చెన్నైకి వేగంగా వస్తున్న కారును అడ్డగించి తనిఖీ చేశారు. కారులో 200 కిలోల గుట్కా ప్యాకెట్లు, మత్తు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కారు నడుపుతున్న రాణిపేట జిల్లా సిప్‌కాడుకు చెందిన విక్రమ్‌సింగ్‌ను అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిరువళ్లూరు: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో జరిగింది. వివరాలు.. తిరునల్వేలి జిల్లా దిగువ కాలనీ పడైయాశర్ గ్రామానికి చెందిన సుబ్బు(57) గుమ్మిడిపూండి సమీపంలోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం గుమ్మిడిపూండిలోని గణపతి థియేటర్ వద్ద వున్న డీఎస్‌టీ రోడ్డును దాటుతుండగా పెత్తికుప్పం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బు తీవ్రంగా గాయపడిన సుబ్బును స్థానికులు గుమ్మిడిపూండి వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ చికిత్స ఫలించకపోవడంతో బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడి కుమారుడు మారిముత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుమ్మిడిపూండి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి చీరతో ఉరి వేసుకుని కొడుకు ఆత్మహత్య

అన్నానగర్: మద్యానికి బానిసై వ్యక్తి తల్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నై ఐనావరంలోని తిరువళ్లువర్‌నగర్‌కు చెందిన సుందర్ (42) ప్లంబర్ పనులు చేసేవాడు. వివాహం కాలేదు. తన తల్లి కోసలైతో కలిసి ఉంటున్నాడు. కొద్ది నెలలుగా మద్యానికి బానిసైన సుందర్‌కు మూడు నెలలుగా రెడ్‌హిల్స్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందించారు. నెల రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం రాత్రి 9 గంటలకు మద్యం సేవించి నిద్రపోతున్నానని తల్లికి చెప్పాడు. రాత్రి 10 గంటలకు ఇంటిలోని హాలులో తల్లి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 11 గంటలకు తల్లి గుర్తించి బోరున విలపించింది. దీనిపై సమాచారం అందుకున్న ఐనావరం పోలీసులు సుందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

తిరువొత్తియూరు: కోయంబేడు మార్కెట్‌లో వ్యాపారిపై దాడి చేసి నగదు అపహరించిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అరియలూరు జిల్లాకు చెందిన కదిరవన్ (26) జూన్ 29వ తేదీ అరియలూరు జిల్లా నుంచి కోయంబేడు మార్కెట్‌కు మినీ వ్యాన్‌లో మునగకాయలను తీసుకొచ్చాడు. ఆ రోజు రాత్రి వాహనంలోనే నిద్రపోయాడు. ఆ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి రూ.40వేలు, సెల్‌ఫోన్‌ను అపహరించారు. దీని గురించి కదిరవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోయంబేడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఆధారంగా నెర్కుంద్రం ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (24)ను అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు అతని సహచరుడు మణికంఠన్ (23)ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 3 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

పని నుంచి తొలగించారని..

- యజమాని భార్య ఫొటోను మార్ఫింగ్ చేసి బెదిరింపు

తిరువొత్తియూరు: పని నుంచి తొలగించారని యజమాని భార్య ఫొటోను నగ్నంగా మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమంలో పెడతానని రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోయంబత్తూరు నంజుండపురం రోడ్డు తిరుమాల్ వీధికి చెందిన వ్యక్తి (40) అదే ప్రాంతంలో చిప్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని దుకాణంలో బంధువు గణేష్‌కుమార్ (41) సహా ఐదుగురు పని చేస్తున్నారు. గణేష్‌కుమార్ పని నచ్చకపోవడంతో యజమాని అతనిని ఉద్యోగం నుంచి తొలగించాడు. దీంతో కక్ష పెంచుకున్న గణేష్‌కుమార్ యజమాని భార్య ఫోటోను మార్ఫింగ్ చేసి ఆమె వాట్సాప్ నంబర్‌కు పంపాడు. రూ.2.50 లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. దీనిపై దుకాణ యజమాని రామనాథపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గణేష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

- ఆవడి కమిషనర్ శంకర్
- పోలీస్ గ్రీవెన్స్‌కు 182 ఫిర్యాదులు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శంకర్

తిరువళ్లూరు: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపుతున్నామని ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఆవడి పోలీసు కన్వెన్షన్ హాలులో బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 182 ఫిర్యాదులను పరిష్కరించారు. కమిషన్ శంకర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఏళ్ల తరబడి పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించడానికి ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహించాలని కమిషనర్ శంకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. దీర్ఘకాలికంగా 266 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. వీటిలో 182 వినతులను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సైతం త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రజలకు సేవ చేయడానికే పోలీసులు ఉన్నారని.. ఏదైనా సమస్య ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు.



గ్రీవెన్స్‌డేకు హాజరైన ప్రజలు

తిన్న భోజనానికి డబ్బులు అడిగారని..

- హోటల్ యజమాని సహా ముగ్గురిపై కత్తులతో దాడి
- పోలీసులకు ఫిర్యాదు

తిరువళ్లూరు: హోటల్‌లో తిన్న భోజనానికి బిల్లు అడిగారని యజమాని సహా ముగ్గురిపై కత్తులతో దాడి చేసి పరారైన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తూత్తుకుడి జిల్లాకు చెందిన భాగ్యరాజ్ తిరువళ్లూరు జిల్లా చోళవరంలోని చెంబులివరం గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. హోటల్ వద్ద రౌడీల ఆగడాలు ఎక్కువ అవడంతో నెల నుంచి మూసివేశారు. ఇటీవల మళ్లీ హోటల్‌ను తెరిచాడు. వారం రోజులుగా హోటల్‌కు వస్తున్న కొందరు రోజూ టిఫిన్, అన్నం తిని బిల్లులు చెల్లించకుండా బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. ఆదివారం హోటల్‌కు వచ్చిన ఆరుగురు వ్యక్తులు భోజనం చేసి బయటకు వెళ్లడానికి యత్నించారు. దీంతో భాగ్యరాజ్ భార్య మురుగవల్లి వారం రోజులుగా తిన్న వాటి కోసం బిల్లు అడగడం లేదు.. ఈ రోజు చేసిన భోజనం బిల్లులైనా ఇవ్వాలని కోరింది. దీంతో అల్లరిమూకలు చెలరేగిపోయారు. తాము రౌడీలమని, తమనే బిల్లులు అడుగుతావా అంటూ దాడులకు యత్నించారు. దీంతో భాధితులు చోళవరం పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం హోటల్‌ను తెరవగా అక్కడికి వచ్చిన అల్లరిమూకలు తమపై పోలీసులకు ఫిర్యాదు చేస్తారా అంటూ కత్తులతో దాడులకు దిగారు. భాగ్యరాజ్, మురుగువల్లిపై కత్తులతో దాడి చేశారు. అడ్డొచ్చిన భాగ్యరాజ్ తమ్ముడు చిన్నముత్తుపై దాడులు చేసి బీభత్సవం సృష్టించారు. హోటల్‌లోని వస్తువులను ధ్వంసం చేశారు. తీవ్ర గాయాలైన బాధితులను బంధువులు చెన్నై వైద్యశాలకు తరలించారు. ఫిర్యాదు మేరకు చోళవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నై వేదికగా 3 రోజులు జీ 20 కాన్ఫరెన్స్





అధికారులతో సమావేశంలో సీఎస్ శివదాస్ మీన

- ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

సాక్షి, చెన్నై: చెన్నై వేదికగా ఈనెల 24,25,26 తేదీలలో డిజాస్టర్ రిస్క్ తగ్గింపుపై జీ 20 కాన్ఫరెన్స్ జరగనుంది. ఈ ఏర్పాట్లపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీన సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. జీ 20 దేశాల మహానాడులో భాగంగా ఆయా విభాగాలు, కేటగిరీల వారీగా సదస్సులను దేశవ్యాప్తంగా పలు నగరాల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికే పలు కేటగిరిలలో మహాబలిపురం వేదికగా సదస్సులు జరిగాయి. ప్రస్తుతం మూడో సమావేశంగా 24,25,26 తేదీల్లో సమ్మిట్ నిర్వహించనున్నారు. చెన్నైలో జరగనున్న ఈ సమావేశం ఏర్పాట్లపై సీఎస్ సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ సమ్మిట్ ఏర్పాట్లకు ఆదేశించారు. ఇందులో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ అధికారులు, వివిధ శాఖ కార్యదర్శులు కమల్ కిషోర్, రాజేంద్ర సింగ్, ఎస్. కృష్ణన్, రామన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రతీకార హత్య

- ముగ్గురి అరెస్టు

అన్నానగర్: పాత కక్షలతో యువకుడిని హత్య చేసిన ఘటన తూత్తుకుడి జిల్లాలో జరిగింది. ఏరల్ సమీపంలోని అగరం నడుతెరుకు చెందిన అజిత్‌కుమార్ (24) కూలీ. మంగళవారం పనికి వెళ్లి రాత్రి బైకుపై ఇంటికి వస్తున్నాడు. బైకులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు అజిత్‌కుమార్‌ను కత్తులతో నరికి పరారయ్యారు. విచారణలో అజిత్‌కుమార్ చెన్నైలో ఉంటూ ఉద్యోగం చేసేవాడు. అతడిపై హత్య కేసు ఒకటి పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తూత్తుకుడి స్టేట్‌బ్యాంక్ నడుతెరుకు చెందిన బాలమురుగన్ (36), మారియప్పన్ (19), గోవంగాడు ఉత్తర వీధికి చెందిన అయ్యన్ రాజ్ (21) అజిత్ కుమార్‌ను హత్య చేసినట్లు తెలిసింది. బుధవారం తెల్లవారుజామున ముగ్గురిని అరెస్టు చేశారు. విచారణలో ఏరల్ సమీపంలోని కోవంకాడు ప్రాంతానికి చెందిన శరవణకుమార్, బాలమురుగన్ భార్య తమ్ముడు అజిత్‌కుమార్ చెన్నైలో అదే స్థలంలో పని చేశాడు. అప్పుడు ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. అజిత్‌కుమార్ కోపోద్రిక్తుడైన శరవణకుమార్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పళ్లికరనై పోలీసులు కేసు నమోదు చేసి అజిత్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అజిత్‌కుమార్ కొద్ది రోజుల క్రితమే బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తరువాత తిరిగి స్వగ్రామానికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న బాలమురుగన్‌తో పాటు ఇద్దరు కలిసి హత్య చేశారని తేలింది.

విషాద ప్రేమ

- ప్రేమ పెళ్లికి కుటుంబ సభ్యుల నిరాకరణ
- ప్రియురాలి ఆత్మహత్య
- మనస్తాపంతో రైలు పట్టాలపై తలపెట్టి ప్రియుడి బలవన్మరణం

కొరుక్కుపేట: ప్రేమ పెళ్లికి తల్లిదండ్రులు వ్యతిరేకత తెలపడంతో చెట్టుకు ఉరివేసుకుని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక మనస్తాపానికి గురైన ప్రియుడు రైలు పట్టాలపై తలపెట్టి బలవన్మరణానికి పాల్పడిన విషాదకర ఘటన రామనాథపురం జిల్లాలో చోటుచేసుకుంది. ఉచిపుల్లి సమీపంలోని పడమటినార్తె ఊరిని గ్రామానికి చెందిన కేశవన్ కుమారుడు సెల్వంద్రన్ అలియాస్ అరవింద్ (26), తిరుపుల్లాని సమీపంలోని సాత్ మెదలోడ్డై గ్రామానికి చెందిన యోకోవా (19) ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు అయినప్పటికీ పెళ్లికి ఇరు కుటుంబాలు వ్యతిరేకత తెలిపాయి. దీంతో మనస్తాపానికి గురైన ప్రియురాలు యోకోవా మంగళవారం తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సెల్వేంద్రన్ బుధవారం తెల్లవారుజామున ఉచిపల్లి సమీపంలోని రైల్వే గేటు పట్టాలపై తలపెట్టి పడుకోవడంతో చెన్నై వస్తున్న సేతు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రామేశ్వరం రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నారు. ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడం ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

నగల వ్యాపారిపై చీటింగ్ కేసు

అన్నానగర్: కోయంబత్తూరులోని ఓ నగల దుకాణం యజమాని నుంచి రెండు కిలోల బంగారం కొనుగోలు చేసి మోసం చేసిన దంపతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. విలంగురిచ్చి రోడ్డులోని వినాయకపురం అన్నై వేలాంకన్ని వీధికి చెందిన రమేష్‌కుమార్ (56) కోయంబత్తూరు రాజా వీధిలో నగల దుకాణం నడుపుతున్నాడు. కోయంబత్తూరు చెట్టి వీధికి చెందిన నగల వ్యాపారి రఘునాథ్ (43)తో రమేష్‌కుమార్‌కు వృత్తిరీత్యా పరిచయం ఏర్పడింది. రఘునాథ్ రమేష్‌కుమార్ నుంచి నగలు కొనుగోలు చేసి విక్రయించేవాడు. ఈ క్రమంలో రమేష్‌కుమార్ ఏడాది క్రితం రఘునాథ్‌కు సుమారు రూ.కోటి విలువైన రెండు కిలోల బంగారాన్ని ఇచ్చాడు. అయితే నగలు కొనుగోలు చేసి చాలా కాలం గడిచినా రఘునాథ్ డబ్బులు తిరిగి ఇవ్వలేదు. నగలు, డబ్బు ఇవ్వాలని పలుమార్లు విన్నవించినా రమేష్‌కుమార్ ఇవ్వకుండా జాప్యం చేశాడు. దీంతో రమేష్‌కుమార్ పెరియకడైవీధి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. రఘునాథ్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఆవిష్కరణ



కోయంబత్తూరులోని జాస్ అలుకాస్ జ్యువెలరీస్‌లో డీ బీర్స్ ఫరెవర్ మార్క్ సంస్థ భాగస్వామ్యంతో కొత్త వజ్రాల కలెక్షన్లను బుధవారం ఆవిష్కరించారు. ప్రముఖ సినీ నటి పవిత్రా లక్ష్మి, జాస్ అలుకాస్ ఎండీలు వర్గీస్ అలుకా, పాల్ జే అలుకా, జాన్ అలుకా, డీబీర్స్ ఉపాధ్యక్షుడు అమిత్ ప్రతిహరి ఈ అరుదైన కలెక్షన్లను పరిచయం చేశారు.

– సాక్షి, చెన్నై

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: ప్రేమ విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మదురై జైహింద్ పురం రామయ్య వీధికి చెందిన శివకుమార్ (26 ఓ యువతిని కొంతకాలంగా ఒన్‌సైడ్‌గా ప్రేమిస్తున్నాడు. అతను తన ప్రేమను ఆమెతో చెప్పలేదు. ఈ నేపథ్యంలో ఇంటిలో అమ్మాయికి పెళ్లి నిశ్చయించారు. ఈ విషయం తెలుసుకున్న శివకుమార్ నిరుత్సాహంగా కనిపించాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి శివకుమార్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు హైహింద్‌పురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన యువతి తల్లిపై కత్తితో దాడి

- పెళ్లికి అడ్డు చెప్పడంతో ఘాతుకం
- యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: వివాహానికి అడ్డు చెప్పిందనే కోపంతో యువతి తల్లిపై కత్తితో దాడి చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై అన్నానగర్‌కు చెందిన యువతి (30) భర్త నుంచి విడిపోయి ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో చెన్నై చెంబరంబాక్కం ప్రాంతానికి చెందిన వంట మాస్టర్ సురేష్ (28)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. సురేష్ ఆ మహిళను వివాహం చేసుకుంటానని చెప్పడంతో తన తల్లిని అడగాలని చెప్పింది. దీంతో అన్నానగర్‌లోని యువతి తల్లితో విషయం చెప్పాడు. అందుకు ఆమె తిరస్కరించింది. ఈ క్రమంలో మంగళవారం మహిళ తల్లి అన్నానగర్ రెండో అవెన్యూలో నడిచి వెళుతుండగా అక్కడికి వచ్చిన సురేష్ ఆమెతో గొడవ పడ్డాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమె కింద పడిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న అన్నానగర్ పోలీసులు రక్తపు మడుగులో పడి వున్న మహిళను కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సురేష్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 76,254 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,091 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బాబు ప్రాణాలు కాపాడేందుకే చేయి తొలగింపు

- నివేదికలో వైద్య పరిశోధక కమిటీ

కొరుక్కుపేట: బాబు ప్రాణాలు కాపాడే ప్రయత్నంలోనే కుడి చేయిని తొలిగించారే తప్పా మరే ఇతర చికిత్సా పద్ధతుల వల్ల జరగలేదని వైద్య పరిశోధన కమిటీ సమర్పించిన నివేదికలో పేర్కొంది. రామనాథపురం జిల్లాకు చెందిన దస్తగిరి–అజీసా తంబా దంపతుల ఏడాదిన్నర కుమారుడు రక్తనాళం, నాడీ సమస్య కారణంగా చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. బాబుకి చికిత్స చేస్తుండగా ఒక్కసారిగా కుడిచేయి నల్లగా మారింది. దీంతో వైద్యులు బాబును ఎగ్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చేయి తొలగించాలని సూచించారు. రెండు గంటల అపరేషన్ అనంతరం చిన్నారి కుడి మోచేతి వరకు తొలగించారు. అయితే రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్లే చేయి కోల్పోవాల్సి వచ్చిందని తలిదండ్రులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై విచారణకు ముగ్గురు వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి వాస్కులర్ విభాగాధిపతి శ్రీధరన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి శాంతి, ఎగ్మోర్ చిల్డ్రెన్స్ హాస్పిటల్ డాక్టర్ రవీంద్రన్‌తో కమిటీని ఏర్పాటు చేశారు. వైద్యులు, నర్సులను విచారించి నివేదికను వెల్లడించారు. చిన్నారి చేతిలో రక్తనాళం మూసుకుపోవడానికి వైద్యులు ఇచ్చిన మందువల్లకానీ, మరే ఇతర పద్ధతుల వల్ల కానీ జరగలేదని పేర్కొన్నారు. వైద్యులు, నర్సుల తప్పిదం లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా బుధవారం చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు.

బాలుడి ప్రాణం తీసిన నకిలీ డాక్టర్

- అదుపులోకి తీసుకున్న పోలీసులు



మృతుడు సూర్య ప్రకాష్ (ఫైల్)



నకిలీ డాక్టర్ గోపినాథ్

వేలూరు: తిరుపత్తూరు జిల్లా వానియంబాడి సమీపంలోని జోడంగుట్ట గ్రామానికి చెందిన చక్రవర్తి కుమారుడు సూర్య ప్రకాష్(13) అదే ప్రాంతంలోని పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. బాలుడు మంగళవారం సాయంత్రం అనారోగ్యానికి గురి కావడంతో తల్లిదండ్రులు నాయనిచెరువులోని క్లీనిక్‌కు తీసుకెళ్లారు. డాక్టర్‌గా చెలామణి అవుతున్న గోపినాథ్ ఇంజక్షన్ వేశాడు. అనంతరం ఇంటికి వచ్చిన బాలుడికి విపరీతమైన జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు నాట్రంబల్లిలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు తిమ్మయంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వానియంబాడి ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇంజక్షన్ గురించి విచారణ జరిపారు. విచారణలో గోపినాథ్ నకిలీ డాక్టర్ అని తెలిసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న తిరుపత్తూరు జిల్లా వైద్యాధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న నకిలీ డాక్టర్‌ల కోసం అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి లేదా గుర్తింపు పొందిన ఆసుపత్రిలోనే చికిత్స తీసుకోవాలని సూచించారు.

కుమారుడి మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు



మనవళ్లతో ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వృద్ధులు

వేలూరు: తన కుమారిడి మృతిపై అనుమానం ఉందని.. విచారించి న్యాయం చేయాలని ఓ వృద్ధుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వేలూరు ఎస్పీ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఎస్పీ మణివన్నన్, అదనపు ఎస్పీ భాస్కరన్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాట్పాడి సమీపంలోని పిల్లయార్ ఆలయం వీధికి చెందిన చక్రపాణి, భార్య గోవిందమ్మాల్ తన మనవళ్లతో వచ్చి వినతి పత్రం అందజేశారు. అందులో తన పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్ జూన్ 14వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లాడని..చెరువులో మునిగి మృతి చెందినట్లు అతని స్నేహితులు తెలిపారని పేర్కొన్నారు. అయితే తన కుమారుడు ముందు రోజు రాత్రి అతని స్నేహితునితో ఫోన్‌లో ఆగ్రహంగా మాట్లాడారని తెలిపారు. కాగా తన కుమారుడి మృతిని తట్టుకోలేక కోడలు కూడా ఆత్మహత్య చేసుకుందని.. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారన్నారు. తన కమారుడి మృతిపై అనుమానం ఉందని కాట్పాడి పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎస్పీ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా కాట్పాడి సమీపంలోని కుప్పిరెడ్డితాంగల్ గ్రామానికి చెందిన ఆరుముగం కత్తితో పాటు ఎస్పీ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు. తన కుమారుడు మణిగండన్ మేకలు, పశువులు మేపుకుని జీవనం సాగిస్తున్నాడని.. తన పక్క ఇంటికి చెందిన వారు ఇక్కడ పశువులను కట్టరాదని ఆగ్రహించి తన కుమారుడి కాలుపై కత్తితో నరికి కత్తిని కూడా అక్కడే వదిలిపెట్టి వెళ్లారని.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ కత్తితో పాటు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చినట్లు తెలిపాడు.

తేనాం పేట– సైదా పేట మధ్య భారీ వంతెన

- రూ. 621 కోట్ల నిధుల కేటాయింపు
- 3.2 కి.మీ దూరం నిర్మాణం



తేనాంపేట మార్గం

సాక్షి, చెన్నై: నిత్యం భారీ ట్రాఫిక్‌తో ఉండే అన్నాసాలైలోని తేనాం పేట – సైదాపేట మార్గంలో భారీ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ. 621 కోట్లతో 3.2 కి.మీ దూరం ఈ పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం జారీ అయ్యాయి. వివరాలు.. రాజధాని నగరం చెన్నైలో ట్రాఫిక్ పద్మవ్యూహం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రద్దీ క్రమబద్ధీకరించేందుకు మెట్రో సేవలు అందుబాటులో వచ్చినా, వాహనాలు మాత్రం నిత్యం రోడ్ల మీద తిరుగుతూనే ఉన్నాయి. అన్నాసాలైలో అయితే ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ మరీ ఎక్కువగానే ఉంటుంది. ఈ మార్గంలోనే కాకుండా మరెన్నో మార్గాల్లో వాహనదారులు ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని చేధించాలంటే చెమటోడ్చాల్సిందే. ఈ రద్దీ కట్టడిలో భాగంగా చెన్నై నగరంలో పలు మార్గాల్లో జరుగుతున్న వంతెనల పనుల్ని ఈ ఏడాదిలోపు ముగించే విధంగా రహదారుల శాఖ ఆదేశాలు జారీ చేసింది. అలాగే చెన్నై నగరం, శివారుల్లో రోడ్ల విస్తరణ, కొన్ని జెంక్షన్లలో వంతెనల నిర్మానానికి తగ్గ కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ పరిస్థితుల్లో అన్నాసాలైలో ట్రాఫిక్ రద్దీని అధిమించేందుకు తేనాంపేట నుంచి సైదా పేట వరకు భారీ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సైదాపేట నుంచి టీ నగర్ కూడలి, నందనం కూడలి , ఎస్ఐటీ కాలేజ్ కూడలిని కలుపుతూ ఈ భారీ వంతెనకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మార్గంలో భూగర్భ మెట్రో రైలు సేవలు సైతం జరుగుతున్న నేపథ్యంతో ఆ నిర్మాణాలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా భారీ వంతెనకు రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఉన్నారు. రూ. 621 కోట్లతో 3.2 కి.మీ దూరం ఈవంతెనను నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గజ వాహనంపై సిరుల తల్లి కటాక్షం



గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులో వెలసిన పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం తెల్లవారుజామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. తదుపరి అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణ ముఖమండపంలో కనుల పండువగా కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అమ్మవారికి ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం అమ్మవారు గజ వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటిండెంట్ శేషగిరి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్ నాయుడు, వీఐ రామ్మోహన్, అర్చకులు బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేసెజ్‌లో రూ.666 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం

టెండర్లు పిలిచిన ఏపీ ట్రాన్స్‌కో



సాక్షి, అమరావతి: కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ సరఫరా, సొంత అవసరాల కోసం ఏర్పాటు చేసుకునే విద్యుత్ ఉత్పత్తిని సరఫరా చేయడం కోసం రూ.665.83 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీ ట్రాన్స్‌కో ఏర్పాటు చేస్తోంది. 400/200/132/33 కేవీ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌మిషన్ లైన్స్ నిర్మాణం కోసం రూ.327 కోట్ల విలువైన పనులకు సంబంధించి ట్రాన్స్‌కో టెండర్లు పిలిచింది. 2,000 ఎంవీఏ విద్యుత్‌ను ఉత్పత్తి సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా ఈ సబ్‌స్టేషన్‌ను గ్రిడ్‌కు అనుసంధానించనున్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కాకినాడ సెజ్‌ను అభివృద్ధి చేస్తున్న అరబిందో గ్రూపు 64 ఎకరాలను ఏపీ ట్రాన్స్‌కోకు కేటాయించింది. 24 నెలల్లో ఈ సబ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

జూనోటిక్ వ్యాధులపై నేడు అవగాహన సదస్సులు

సాక్షి, అమరావతి: జూనోటిక్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఏటా జూలై 6న జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. కుక్క కాటు బారిన పడిన ఓ పిల్లవాడికి ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ టీకా మందు ఇచ్చి బ్రతికించిన రోజు జూలై 6 కావడంతో, అదే రోజు ప్రతీ ఏటా జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. జూనోసిస్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జూలై 6న అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గురువారం నుంచి రాష్ట్రంలోని ఏరియా పశు వైద్యశాలలు, వెటర్నరీ పాలి క్లీనిక్స్, వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పాటు ఆర్బీకే స్థాయిలో ఉచితంగా కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం 4.38 లక్షల టీకాలు సిద్ధం చేశామన్నారు. మరిన్ని వివరాలకు పశువైద్యాధికారి లేదా ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలని లేదా, టోల్ ఫ్రీ నంబర్ 1962, సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 155251 ను సంప్రదించాలని కోరారు.

అత్యధిక బీమా పరిహారం 'అనంత'కే

- ఖరీఫ్ 22 సీజన్‌లో 10.20 లక్షల మందికి మొత్తం రూ.1,117.21 కోట్ల పరిహారం
- రాయలసీమలో 7.72 లక్షల మందికి రూ.835.08 కోట్లు
- ఒక్క అనంతపురం జిల్లాలోనే 1.37 లక్షల మందికి రూ.212.94 కోట్ల పరిహారం
- పారదర్శకంగా పంటల బీమా పరిహారం లెక్కింపు
- రైతుల ముసుగులో పచ్చ ముఠాలతో వీధి నాటకాలు

సాక్షి, అమరావతి: దేశమంతా ప్రశంసిస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంపై నిత్యం కాకిలెక్కలతో ఎల్లో మీడియా నినదిస్తుండగా రైతుల ముసుగులో టీడీపీ నేతలు రభస చేస్తున్నారు. రైతులపై పైసా భారం లేకుండా ఉచిత పంటల బీమాను అమలు చేయడంతోపాటు గత సర్కారు హయాంతో పోలిస్తే రెట్టింపు ప్రయోజనాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూరుస్తోంది. తాజాగా ఈనెల 8వ తేదీన మరోసారి రైతన్నలకు పరిహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడంతో ఉలిక్కిపడ్డ రామోజీ యథావిధిగా బురద జల్లేందుకు ఉపక్రమించారు! పరిహారంపై రైతులెవరూ అభ్యంతరం చెప్పకున్నా పచ్చ ముఠాలను రోడ్లపైకి తీసుకొచ్చి పొలిటికల్ డ్రామాలకు తెరతీశారు! ఉరవకొండలో ఆందోళనకు ఉసిగొల్పారు! వారిలో సగం మంది టీడీపీ నాయకులే ఉన్నట్లు రామోజీ అత్యుత్సాహంతో తన పత్రికలోనే ప్రచురించారు!!

వారం గడువిస్తే వచ్చిన అభ్యంతరాలు 123

ఖరీఫ్ 2022 సీజన్‌కు సంబంధించి 10.20 లక్షల మందికి రూ.1,117.21 కోట్ల పంటల బీమా పరిహారం మంజూరైంది. గత నెల 28వ తేదీ నుంచి



ఆర్బీకేల్లో జాబితాలను ప్రదర్శిస్తున్నారు. పంటల విస్తీర్ణం, పరిహారం మంజూరుపై అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 4వ తేదీ వరకు వారం రోజుల పాటు గడువు ఇవ్వగా వచ్చిన అభ్యంతరాల సంఖ్య 123 మాత్రమే. అంటే 0.0001 శాతం కూడా లేదు. ఇక వాటిలో కూడా అత్యధికం సాంకేతికపరమైన అంశాలకు సంబంధించినవే. అంటే మంజూరైన బీమా పరిహారంపై రైతులకే కాదు రైతు సంఘాలకూ అభ్యంతరాలు లేవనే కదా అర్థం!

'అనంత'లో అత్యధిక పరిహారం

టీడీపీ నేతలు రోడ్డెక్కి రభస చేసిన అనంతపురం జిల్లాకే అత్యధిక పరిహారం మంజూరు కావడం గమనార్హం. ఒక్క అనంతపురం జిల్లాలో 1.37 లక్షల మందికి రూ.212.94 కోట్ల పరిహారం మంజూరైంది. ఇక రాయలసీమలోని 8 జిల్లాలను పరిశీలిస్తే 7.72 లక్షల మందికి రూ.835.08 కోట్ల పరిహారం మంజూరైంది. మంజూరైన పరిహారంలోనే కాదు.. లబ్ధిదారుల్లో అత్యధికులు రాయలసీమ రైతన్నలే ఉన్నారు. అనంతపురం జిల్లాలో దిగుబడి ఆధారిత పత్తి, కంది, వరి, జొన్న, మొక్కజొన్న, మిరప పంటలకు బీమా వర్తింప చేశారు. పంట కోత ప్రయోగాల ఆధారంగా పత్తి పంటకు ఎన్నడూ లేనివిధంగా రూ.43.26 కోట్ల పరిహారం మంజూరు చేశారు. వాతావరణ ఆధారిత బీమాను బత్తాయి, దానిమ్మ, టమాటా, వేరుశనగ పంటలకు వర్తింప చేసి రూ.169.68 కోట్లు మంజూరు చేశారు. ఇందులో బత్తాయికి రూ.102.64 కోట్లు, వేరు శనగకు రూ.65.60 కోట్లు, టమాటాకి రూ.1.44 కోట్ల పరిహారాన్ని మంజూరు చేశారు.

బత్తాయికీ బీమా రక్షణ

గతంలో పంటల బీమా అందని ద్రాక్షే! అధిక ప్రీమియం చెల్లించలేక లక్షలాది మంది రైతులు విపత్తుల బారిన పడి ఏటా రూ.వేల కోట్ల పెట్టుబడిని నష్టపోయేవారు. కనీసం బీమా చేయించుకున్న వారికైనా పరిహారానికి దిక్కులేని దుస్థితి గత సర్కారు హయాంలో నెలకొంది. ఏళ్ల తరబడి పడిగాపులు కాస్తే అరకొరగా విదిల్చేవారు. అదికూడా ఏ పంటకు ఎంత పరిహారం వస్తుందో తెలియదు. ఇప్పుడు పైసా భారం పడకుండా రైతులకు ఎలాంటి వ్యయ ప్రయాసలకు తావులేకుండా నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసే ప్రతీ దఎకరాకు ఈ- క్రాప్ ఆధారంగా ఉచిత పంటల బీమా అమలవుతోంది. గతంలో బీమా పరిధిలో లేని బత్తాయి తదితర పంటలకు సైతం బీమా రక్షణ కల్పిస్తున్నారు.

బాబు బకాయిలనూ చెల్లించారు..

టీడీపీ హయాంలో ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల పరిహారం ఇవ్వగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు 44.28 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల బీమా పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసింది. తాజాగా పంపిణీ చేయనున్న పరిహారాన్ని కూడా కలిపితే మొత్తం 54.48 లక్షల మందికి రూ.7,802.05 కోట్లు అందినట్లవుతుంది. తద్వారా టీడీపీ హయాంతో పోలిస్తే అదనంగా 23.63 లక్షల మంది లబ్ధి పొందగా పరిహారం పరంగా రూ.4,390.85 కోట్లు అదనంగా ప్రయోజనం చేకూరుతోంది. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని తరచూ చెప్పుకునే చంద్రబాబు అధికారంలో ఉండగా ఏనాడూ రైతులకు ఉచిత పంటల బీమా కల్పించాలనే ఆలోచన చేసిన పాపాన పోలేదు. టీడీపీ సర్కారు 6.19 లక్షల మందికి ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల పంటల బీమా పరిహారాన్ని సైతం చెల్లించి రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని చాటుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది.

'ఆయిల్‌పామ్'పైనా అబద్ధాలేనా?

- వాస్తవాలు తెలుసుకోకుండా రామోజీ రోతరాతలు
- చంద్రబాబు హయాంలోనే గిట్టుబాటు ధర లేక నిర్వీర్యం
- టీడీపీ హయాంలో 90,475 టన్నుల ప్రాసెసింగ్
- 2022–23లో గరిష్ఠంగా 1.20 లక్షల టన్నుల ప్రాసెసింగ్

సాక్షి, అమరావతి: వాస్తవాలు అవసరం లేదు. నిజాలతో పనిలేదు. కావాల్సిందల్లా 'చంద్రబాబు'కు భజన చేయడం. జగన్ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా రామోజీరావు తన పచ్చ పత్రికలో వాస్తవాలకు ముసుగేసి నిత్యం అబద్ధాలను అచ్చేస్తూనే ఉన్నారు. అదే కోవలో 'ఆయిల్ పామ్‌కు సర్కారు గ్రహణం' అంటూ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా మరో తప్పుడు కథనాన్ని వండివార్చారు. ఈ కథనంలో వాస్తవాలు ఏ మేరకు ఉన్నాయో ఒక్కసారి చూస్తే..

5.15 లక్షల ఎకరాల్లో సాగు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో 1.32 లక్షల మంది 3.93లక్షల ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు చేస్తుండగా, ప్రస్తుతం 1.52 లక్షల మంది 5.15 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. హెక్టార్‌కు సగటు ఉత్పాదకతలో దేశంలోనే నంబర్‌వన్‌గా రాష్ట్రం నిలిచింది. ఆయిల్‌పామ్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డును కేంద్రం నుంచి అందుకుంది. 2023–24లో 60 వేల ఎకరాలు కొత్తగా సాగులోకి తెచ్చేందుకు 34.20 లక్షల మొక్కలను సిద్ధం చేశారు. ఈ నిజాలు దాచిన ఈనాడు అసలు విస్తరణనే పట్టించుకోనట్లుగా కథనాన్ని వండివార్చింది. 2022–23లో 12,617 మంది రైతులకు ఒక్కొక్కటి రూ.193 విలువైన 19.67 లక్షల మొక్కలను పూర్తి ఉచితంగా సరఫరా చేశారు. 2018–19లో 1.72 అదనపు ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియోలో వ్యత్యాసమైన రూ.80.32 కోట్లు చెల్లించకుండా టీడీపీ సర్కార్ ఎగ్గొట్టింది. ఈ మొత్తాన్ని జగన్ ప్రభుత్వం అణాపైసలతో సహా చెల్లించింది. పెద్ద ఎత్తున నర్సరీలను ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ మొక్కలను అందుబాటులో ఉంచింది.

మొక్కల ఖర్చు, తోటల నిర్వహణ, అంతర పంటల సాగు కోసం రైతులకు ఎకరానికి రూ.64,300 చొప్పున సాయం అందిస్తోంది. 50% సబ్సిడీపై బిందు సేద్యం, యాంత్రీకరణకు చేయూతనిస్తోంది. బాబు హయాంలో గరిష్ఠంగా 2018–19లో 90,475 టన్నులు ప్రాసెస్ చేస్తే.. ప్రస్తుతం 1.20 లక్షల టన్నులు ప్రాసెస్ చేసే స్థాయికి రాష్ట్రం చేరింది. అప్పట్లో సగటున టన్నుకు రూ.7,492 ధర లభిస్తే, ఈ నాలుగేళ్లలో గరిష్ఠంగా టన్నుకు (2022 మే) రూ.23,365 ధర దక్కింది. ప్రస్తుతం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే క్రూడ్ పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని పూర్తిగా కేంద్రం ఎత్తివేసింది. ఫలితంగా దిగుమతులు పెరగడంతో దేశీయంగా ఆయిల్ పామ్ ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశీయంగా ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర లభించే స్థాయిలో దిగుమతి సుంకాన్ని విధించాలని కోరుతూ సీఎం జగన్ వాణిజ్యం, పరిశ్రమల శాఖమంత్రికి లేఖ కూడా రాశారు. ఇక పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో గంటకు టన్ను గెలల క్రషింగ్ సామర్థ్యంతో 1992లో ఏర్పాటైన ప్లాంట్‌ను ఈ ప్రభుత్వం వచ్చాక రూ.10 కోట్లు ఖర్చు చేసి గంటకు 24 టన్నుల సామర్థ్యానికి పెంచింది. ఏలూరు జిల్లాలో రూ. 230 కోట్లతో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ అండ్ రిఫైనరీ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది.

చరిత్రలో నిలిచిపోయేలా 'అంబేడ్కర్ స్మృతి వనం'

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి నిర్మాణ పనుల పరిశీలన
- 125 అడుగుల విగ్రహ ఏర్పాటుతో చరిత్రలో చిరస్థాయిగా సీఎం జగన్ పేరు
- అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించి ఆపై గాలికొదిలేశారని ధ్వజం

దసాక్షి, ప్రతినిధి విజయవాడ: చరిత్రలో నిలిచిపోయేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రతిపాదించడమే కాకుండా, పనులను ప్రారంభించి పూర్తిచేయిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. స్మృతివనం నిర్మాణ పనులను మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. పనుల వివరాలపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ దేశం గర్వించే స్థాయిలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం జరుగుతోందని, 20 ఎకరాల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నగరం నడి బొడ్డున ఏర్పాటు చేయిస్తున్న సీఎం జగన్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దేశం గర్వించదగ్గ నేత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, అసమానతల నుంచి పుట్టి.. వాటిపైనే పోరాటం చేసిన మహనీయుడు అని కొనియాడారు. అత్యధిక జనాభా కలిగిన మన దేశం సమానత్వం దిశగా వడివడిగా అడుగులు వేయడానికి కారణం అంబేడ్కరేనని, ప్రజాస్వామ్య పాలనకు బీజం వేసింది ఆయనేనన్నారు. అంబేడ్కర్ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. 2016లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించి, ఎలాంటి పనులూ చేయలేదని విమర్శించారు. అంబేడ్కర్‌పై సీఎం జగన్‌కు ఉన్న గౌరవానికి నిదర్శనమే ఈ స్మృతి వనం నిర్మాణమని చెప్పారు. ఈ ఏడాది అంబేడ్కర్ స్మృతి వనం పనులు పూర్తి చేసి, దేశానికి, రాష్ట్రానికి అంకితం చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.400 కోట్లకు పైగా ఖర్చుపెడుతున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని, అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించేందుకు సరైన స్థలం కూడా చంద్రబాబు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే అంబేడ్కర్ స్మృతి వనం పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. పరిశీలనలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే రక్షణనిధి, వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులున్నారు.



మీడియాతో సజ్జల రామకృష్ణారెడ్డి. చిత్రంలో మంత్రి మేరుగు, ఎంపీ నందిగం సురేష్ తదితరులు

విశాఖ సిగలో కలికితురాయి



ఆశీలమెట్టలో సిటీ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్

- 2.7 ఎకరాల్లో రూ.265 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు
- షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్, హోటల్ టవర్‌కు అనుకూలం
- ఈవోఐ దరఖాస్తులను ఆహ్వానించిన స్మార్ట్ సిటీ కార్పొరేషన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ నగరానికి ఐకానిక్‌గా నిలిచే భవన నిర్మాణానికి గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ (జీవీఎస్‌సీసీఎల్) ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే నగరంలో వివిధ ప్రాంతాల్లో సరికొత్తగా రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు సాంకేతిక సహాయంతో ప్రజలకు సేవలందిస్తున్న స్మార్ట్ సిటీ కార్పొరేషన్.. మరో అడుగు ముందుకేసింది. ఇందుకోసం సంపత్ వినాయక రోడ్డు మార్గంలో ఆశీలమెట్ట ప్రాంతంలో జీవీఎంసీకి చెందిన 2.7 ఎకరాలను నగర అభివృద్ధికి చిహ్నంగా(ఐకానిక్) మార్చేందుకు ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఈ ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే విషయంపై ఈ నెల 12లోగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తుల(ఈవోఐ)ను కోరింది. మొత్తం 2.7 ఎకరాల్లో ఏకంగా 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్, హోటల్ టవర్‌తో పాటు రిక్రియేషన్ సెంటర్ అభివృద్ధి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ.265 కోట్లతో ఏ విధంగా అభివృద్ధి చేస్తారనే విషయాన్ని పేర్కొంటూ సంస్థలు ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో..

ఆశీలమెట్ట.. నగరంలో వాణిజ్య ప్రాంతం. ఇక్కడ జీవీఎంసీకి చెందిన 2.7 ఎకరాల స్థలం ఉంది. ఈ ప్రాంతంలో 6.56 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా ఉంది. 2.16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్రాంతంలో వాణిజ్య సముదాయంతో పాటు మాల్, మల్టీప్లెక్స్, హోటల్ టవర్, అర్బన్ రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలమని అధికారులు భావిస్తున్నారు. అయితే.. ఈ ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తామనే ప్రతిపాదనలతో సంస్థలు ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులను సమర్పించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన తర్వాత వచ్చే ఆదాయంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం 33 ఏళ్ల పాటు లీజు పద్ధతిలో ఈ భూమిని కేటాయించేందుకు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిర్ణయించింది. దీనిని సబ్‌లీజుకు ఇవ్వడం కానీ, స్థలాన్ని పూర్తిగా కొనుగోలు చేయడం కానీ కుదరదని స్పష్టం చేసింది.

డీఎఫ్‌బీవోటీ పద్ధతిలో..!

వాణిజ్యానికి అనువుగా ఉండే ఈ ప్రాంతంలో మొత్తం 2.7 ఎకరాల్లో వాణిజ్య భవనాలను నిర్మించాల్సి ఉంటుందని స్మార్ట్ సిటీ కార్పొరేషన్ స్పష్టం చేస్తోంది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే ఈ భూమిలో వాణిజ్య భవనాల ద్వారా వచ్చే ఆదాయంలో జీవీఎంసీకి వాటా ఇవ్వాల్సి ఉంటుంది. వాటా ఇచ్చే శాతంతో పాటు ఇతర అంశాలను పరిగణలోనికి తీసుకుని సంస్థ ఎంపిక ఉండనుంది. అంతేకాకుండా స్థలాన్ని కేవలం లీజు పద్ధతిలో 33 ఏళ్ల పాటు అప్పగించనున్నారు. డిజైన్, ఫైనాన్స్, బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీఎఫ్‌బీవోటీ) పద్ధతిలో చివరకు 33 ఏళ్ల తర్వాత తిరిగి స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు అప్పగించాల్సి ఉంటుంది. దీని అభివృద్ధికి సుమారు రూ.265 కోట్ల మేర వ్యయం అవసరమవుతుందని అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా తమ ప్రతిపాదనలతో ఆయా సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చేందుకు ఈ నెల 12వ తేదీ నాటికి ఈవోఐలను సమర్పించాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించిన అనంతరం.. ఒక మంచి ప్రతిపాదనను ఓకే చేసి సంస్థ ఎంపిక ప్రక్రియ తర్వాత నిర్మాణాలు చేపట్టనున్నారు. రెండేళ్లలోనే ఐకానిక్ భవనం అందుబాటులోకి తీసుకురావాలన్నదే అధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది.

ఎంతో మార్పు వచ్చింది

నా కుమార్తె మధుప్రియ ఆరవ తరగతి చదువుతోంది. చీలిక పెదవితో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటోంది. చూసి బాధపడే వాళ్లం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. అయితే ఉచిత శస్త్రచికిత్సలు కాకినాడ జీజీహెచ్‌లో చేస్తున్నారని తెలిసి వచ్చాం. శస్త్రచికిత్స అనంతరం ఎంతో మార్పు వచ్చింది.

– కర్రి రేవతి, బాధిత బాలిక తల్లి



తినాలన్నా ఇబ్బంది పడేది

పదేళ్ల నా కుమార్తె మీనాక్షికి చిన్నప్పుడే చీలిక పెదవి గుర్తించాం. తే తాజా స్క్రీనింగ్‌కు హాజరైన తర్వాత శస్త్రచికిత్స చేయించాం. తినాలన్నా ఇబ్బంది పడేది. ముత్తూట్ సంస్థ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా శస్త్రచికిత్స పూర్తయింది. ఇప్పుడు నా కుమార్తె పెదవి భాగం సాధారణ స్థితికి వచ్చింది.

– పడాల వెంకటరమణ, బాధిత బాలిక తల్లి



స్మైల్ ప్లీజ్...

- బోసి నవ్వులే లక్ష్యంగా దాతలు ముందుకు
- కాకినాడ జీజీహెచ్‌లో చీలిక పెదవి శస్త్రచికిత్సలు పూర్తి
- 72 మంది బాలల జీవితాల్లో కొత్త వెలుగులు
- ఫలించిన 84 మంది వైద్య, వైద్యేతర బృందాల కృషి



కోలుకుంటున్న బాలలతో ముత్తూట్ పపాచన్, మిషన్ స్మైల్, జీజీహెచ్ వైద్య బృందాలు

కాకినాడ క్రైం: పసిమొగ్గల బోసి నవ్వుతో అంతులేని సంతోషం ఆవరిస్తుంది. జీవితంలో వెలకట్టలేని మధురానుభూతుల్ని ఆ మురిపాల నవ్వు అందిస్తుంది. కల్మషం లేని అమాయకత్వం ఆ నవ్వులో తొణికిసలాడుతుంది. దిగులుపడ్డ వేళ దివ్య ఔషధంలా పనిచేస్తుంది. బుంగమూతి పెట్టిన బుజ్జాయికి కూడా గిలిగింతలు పెట్టి నవ్వించి మరీ మురిసిపోతుంటారు ఇంటిల్లపాదీ. ఆ నవ్వుల్లోనే వందేళ్ల వెలుగులు చూస్తూ మైమరిచిపోతుంటారు. అటువంటి అందాల వెలుగులు ఒక్క లోపంతో కనుమరుగైపోతే... చాదస్తానికి శాపంగానో, కన్నపేగుకు తన పాపంగానో కనిపిస్తే... ఊహించడానికైనా తాళలేని ఆ ఆవేదన వల్ల మనసును బరువెక్కుతుంది. సరిగ్గా అలాంటి స్థితే చీలిక పెదవి.... దీన్నే వైద్య పరిభాషలో ' క్లెఫ్ట్ లిప్' అంటారు. కాకినాడ జీజీహెచ్‌లో పెద్ద మనసున్న దాతల చేయూత 72 మంది పిల్లల జీవితాల్లో వెలుగులు నింపింది. అందరిలాగానే సాధారణ జీవితాలను గడిపే సువర్ణావకాశాన్ని ఇచ్చింది.

మిషన్ స్మైల్ ఆధ్వర్యంలో....

మిషన్ స్మైల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక ముత్తూట్ పపాచన్ సంస్థ చీలిక పెదవిని సరిచేసే క్రతువుకు శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా ఎన్నో వైద్య కేంద్రాల్లో విజయవంతంగా శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించిన ఈ సంస్థ పుణ్యమా అని ఎందరో బాలల జీవితాల్లో భవిష్యత్ వెలుగులు నిండాయి. అదే సంస్థ మిషన్ స్మైల్ ప్రాజెక్టులో భాగంగా జీజీహెచ్ యాజమాన్య సహకారంతో చీలిక పెదవి శస్త్రచికిత్సలు పూర్తి ఉచితంగా నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. నెల రోజుల క్షేత్రస్థాయి ప్రక్రియ, నాలుగు రోజుల నిరంతరాయ శస్త్రచికిత్సలతో 72 మంది బాలల జీవితాల్లో వెలుగులు నింపింది.

డైస్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్...

నెల రోజులుగా డైస్ (జిల్లా సత్వర స్పందన కేంద్రం) ఆధ్వర్యంలో జరిగిన స్క్రీనింగ్ పరీక్షలు ఈ యావత్ ప్రక్రియకు ఆయువుపట్టుగా నిలిచాయి. ఈ విధానంలో వివిధ పరీక్షల అనంతరం 90 మంది బాలలను శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ, డెంటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముల్లేటి రేఖాదేవి పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ, ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, మేనేజర్ బిందుమాధవి ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి బాధిత బాలలకు గుర్తించడంలో కీలకంగా వ్యవహరించారు.

84 మంది బృందం...

ఈ నెల 1న ప్రారంభమై శస్త్రచికిత్సల ప్రక్రియ మంగళవారం వరకు కొనసాగింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, అనస్థీషియా హెచ్‌వోడీ, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్‌ల సంయుక్త పర్యవేక్షణలో మిషన్ స్మైల్ ముత్తూట్ పపాచన్‌కు చెందిన 34 మంది వైద్య బృందం, కాకినాడ జీజీహెచ్ నుంచి 50 మంది వైద్య వైద్యేతర బృందాలు ఈ చికిత్సల నిర్వహణకు శ్రమించాయి. కాకినాడ జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రత్న భూషణ్, డాక్టర్ సుధా, పీడియాట్రిషియన్ డాక్టర్ శ్రీదేవి, అనస్థీషియా నిపుణులు డాక్టర్ పర్వీణ్, డాక్టర్ వింధ్య, డాక్టర్ ప్రతాప్, హైదరాబాద్ ప్రఖ్యాత ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ మార్గం ప్రభాకర్, విజయవాడకు చెందిన ప్లాస్టిక్ సర్జన్లు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ అజయ్, తమిళనాడుకు చెందిన డాక్టర్ రామ్మోహన్, అనస్థీషియా నిపుణుడు, మిషన్ స్మైల్ ట్రస్టీ డాక్టర్ రామ్‌కుమార్, ముత్తూట్ పపాచన్ గ్రూప్ సీఎస్ఆర్ హెడ్ ప్రశాంత్‌కుమార్ నెల్లికల్, ప్రోగ్రాం మేనేజర్ రఫీ శస్త్రచికిత్సల నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు.

90 రిజిస్ట్రేషన్లు...

స్క్రీనింగ్ ద్వారా 90 మంది బాధిత బాలలను నమోదు చేశారు. వీరిలో ఆరు నెలల పసివాళ్ల నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలు ఎక్కువగా ఉన్నారు. 19 ఏళ్ల ఓ యువతీ ఉంది. నాలుగు రోజుల వ్యవధిలో మొత్తం 54 మందికి శస్త్రచికిత్సలు చేశారు. మరో 18 మందిని వారి ఆరోగ్య స్థితిగతుల నేపథ్యంలో మరో 20 రోజుల్లో నిర్వహించనున్న శస్త్రచికిత్సలకు రమ్మని చెప్పినట్లు డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు. వీరికి త్వరలో శస్త్రచికిత్సలు పూర్తి కానున్నాయి. 90 మందిలో మిగిలిన 18 మందిని వివిధ కారణాల నేపథ్యంలో శస్త్రచికిత్సలు చేయలేదు.

నవ్వులు నింపాలని...



మిషన్ స్మైల్ ప్రాజెక్టులో భాగంగా చీలిక పెదవి శస్త్రచికిత్సల నిర్వహణను ఓ యజ్ఞంలా భావించి చిన్నారుల జీవితాలు, వారి కుటుంబాల్లో నవ్వులు నింపాలని సంకల్పించాం. అందుకు ముత్తూట్ పపాచన్‌తో అనుసంధానం అయ్యాం. దేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టు పరిధిలో శస్త్రచికిత్సలు నిర్వహించాం. కాకినాడ జీజీహెచ్ అనుభవం ఎంతో సంతృప్తినిచ్చింది.అనస్థీసియా హెచ్‌వోడీ, నా శిష్యుడు డాక్టర్ విష్ణువర్ధన్ మిషన్ స్మైల్ సేవలు కాకినాడకు తీసుకొచ్చేందుకు చొరవ చూపారు.

– డాక్టర్ రామ్‌కుమార్ వెంకటేశ్వరన్, ఫీల్డ్ మెడికల్ డైరెక్టర్, మిషన్ స్మైల్ ట్రస్టీ మెంబర్

శస్త్రచికిత్సకు రూ.50 వేలు



మిషన్ స్మైల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలకు ముత్తూట్ పపాచన్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీస్‌లో భాగంగా పూర్తి ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది. ఈ క్రమంలోనే శస్త్రచికిత్సకు వచ్చిన కుటుంబీకులకు నివాస, భోజన సదుపాయంతో పాటు ప్రయాణ ఖ ర్చులను పూర్తి ఉచితంగా అందిస్తున్నాం. ఈ క్రమంలోనే కాకినాడ జీజీహెచ్‌లో మొత్తంగా 72 మందికి తొలి దశలో 54 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించాం.

– డాక్టర్ ప్రశాంత్ నెల్లిక్కల్, సీఎస్ఆర్ హెడ్, ముత్తూట్ పపాచన్ గ్రూప్, త్రివేంద్రం

మూఢనమ్మకం



గ్రహణం వల్ల చీలిక పెదవితో పిల్లలు పుడతారన్న మూఢనమ్మకం పూర్తిగా వాస్తవ విరుద్ధం. ఈ సమస్యకు గ్రహణం మొర్రి అన్న పేరు కూడా సరైంది కాదు. మేనరికాల వల్ల, బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లికి ఫోలిక్ ఆసిడ్, ఐరన్ లోపాల వల్ల, పోషకాహార లోపం కారణంగా, జన్యులోపాల వల్ల, బాల్య వివాహాల కారణంగా పుట్టే పిల్లలకు చీలిక పెదవి సంభవించవచ్చు. జీజీహెచ్‌లో శస్త్రచికిత్సల పర్వం విజయవంతమైంది. మరో 18 మందికి వారి ఆరోగ్య స్థితి నేపథ్యంలో రాబోయే 20 రోజుల్లో నిర్వహించనున్నారు.

– డాక్టర్ హేమలతాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ



ప్రతిఘటన

కట్నం ఇవ్వను



ఎంఎస్సీ మాథ్స్ చేసి
ఆన్‌లైన్‌లో లెక్కలు చెప్పే
భోపాల్ యువతికి
పెళ్లి కావడం లేదు.
కట్నం ఇవ్వను అనడమే కారణం.
'50 లక్షలు అడుగుతున్నారు
మా నాన్న ఎక్కడ నుంచి తెస్తాడు'
అని ఆమె ప్రశ్న.
'సంబంధం కేన్సిల్ అనేది తరచూ
వినవస్తున్న జవాబు.
ఇప్పటికి 12 పెళ్లి చూపులు భగ్నమయ్యాయి.
విసిగిపోయిన ఆమె పోరాటానికి దిగింది.
పోలీసులకు కంప్లయింట్ చేసింది.
అన్ని చోట్లా చైతన్యానికి నడుం బిగించింది.

'ఇది రొటీన్‌గా జరుగుతోంది. ఎప్పట్లాగే నేను ట్రేలో టీకప్పులు పెట్టుకుని వస్తాను. దానికి ముందు మా అమ్మ నాకు బాగుంటుందని చెప్పి ఆకుపచ్చ డ్రస్సు తీస్తుంది. నా పళ్లు కొంచెం ఎగుడుదిగుడుగా ఉంటాయని ఎక్కువగా నవ్వొద్దని హెచ్చరిస్తుంది. టీ ట్రేతో నేను హాల్లోకి రాగానే అందరూ నన్ను ఆపాదమస్తకం శల్యపరీక్ష చేస్తున్నట్టుగా చూస్తారు. ఏం చదివావు, ఏం పని చేస్తున్నావు, వంటొచ్చా... అవే ప్రశ్నలు. ఆ తర్వాత కీలకమైన సందర్భం వస్తుంది. కట్నం ఎంత ఆశిస్తున్నారు అని మా నాన్న అడుగుతాడు. అప్పుడు పెళ్లికొడుకు తరుపువారు ఏ యాభైలక్షల్లో అరవైలక్షల్లో లేకుంటే పెళ్ళిళ్ల జరుగుతున్నాయా అనంటారు. కొంచెం ఆలోచించండి అని మా నాన్న అంటాడు. మీ అమ్మాయి అందంగా ఉంది కాబట్టి డిస్కౌంట్ ఇవ్వొచ్చులేండి అని వారు జోక్ చేస్తారు. నాకు మాత్రం ఇదంతా చాలా అసహ్యంగా ఉంటుంది' అంటుంది రూప.

ఇది ఆమె అసలు పేరు కాదు. ఇలాంటి అమ్మాయిలు దేశమంతా ఉన్నారు. వారికి వేరే వేరే పేర్లు ఉంటాయి. కాని వారందరి సమస్య మాత్రం ఒకటే– కట్నం. నేషనల్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం మన దేశంలో 2017 నుంచి 2022 వరకు 35,493 మంది నవ వధువులు, కొత్త పెళ్లి కూతుళ్లు వరకట్న చావులకు గురయ్యారు. అంటే రోజుకు సగటున 20 మంది. అయినా కట్నం కొనసాగుతూనే ఉంది.

పేరు మారిందంతే

మన దేశంలో వరకట్నం 1961లో నిషేధించారు. కాని అలాంటి చట్టం ఒకటుందని సమాజం ఆనాడు పట్టించుకోలేదు.. ఈనాడూ పట్టించుకోవడం లేదు. 1980ల కాలంలో వరకట్న పిశాచం దేశాన్ని పీడించింది. ఎందరో కొత్తకోడళ్లు కిరోసిన్ స్టవ్ మంటల్లో కాలిపోయారు. ఆ తర్వాత కొంత చైతన్యం వచ్చింది. అమ్మాయిలు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నారు. కొన్నివర్గాల ఆర్థిక స్థితి మెరుగయ్యింది. కట్నం అనే మాట వాడటం నామోషీగా మారింది. దానికి బదులుగా లాంఛనాలు అంటున్నారు. ఫార్మాలిటీస్ అంటున్నారు. ఏ మాట వాడినా ఉద్దేశం మాత్రం ఆడపిల్ల తరపువారు మగపెళ్లి తరపు వారికి ఆర్థికంగానో ఆస్తిపాస్తుల రూపేణానో ముట్టజెప్పాలి. అంతస్తును బట్టి ఈ లాంఛనాల స్థాయి ఉంటుంది. లక్షల నుంచి కోట్ల వరకు.



● భోపాల్ పోలీస్ కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న రూప

కట్నం ఇవ్వను

పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి, భోపాల్‌లో తన కాళ్ల మీద తాను నిలబడే స్థితిలో ఉన్న రూపకు 27 ఏళ్ల వచ్చేశాయి. ఈమె తల్లిదండ్రులు ఐదారేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నారు. కాని కట్నం కారణంగా కుదరడం లేదు. 'మా నాన్న నూటాయాభై మంది కుర్రాళ్ల ప్రొఫైల్స్ చూసి 20 మందిని సెలక్ట్ చేశాడు. వారిలో 12 మందితో పెళ్లిచూపులు అయ్యాయి. అందరూ కట్నం అడిగేవాళ్లే. ఎవరూ 50 లక్షలకు తక్కువ లేరు. మా నాన్న అంత ఖర్చు పెట్టలేడు. అసలు కట్నం ఎందుకివ్వాలి? నేను కట్నం ఇవ్వను... కట్నం అనేది చాలా చెడ్డ ఆచారం. పెళ్లి ఖర్చులు పెట్టుకుంటాను అని ఏ అబ్బాయికి చెప్పినా నా ముందు తలాడిస్తున్నాడు కాని ఆ తర్వాత సంబంధం కేన్సిల్ అనే కబురు వస్తోంది. నా ఆత్మవిశ్వాసం మొత్తం పోయింది. మరోవైపు మా బంధువులేమో అమ్మాయి ఇప్పటికే ముదిరిపోయింది అని టెన్షన్ పెడుతున్నారు. పెళ్లి చేసుకోవాలని నాకూ ఉంది. ఒంటరిగా జీవితాన్ని లాగలేము కదా. కాని ఈ కట్నం బాధ ఏమిటి? ఎంతమంది అప్పులు చేసి, ఆస్తులు అమ్మి ఇంకా ఆడపిల్లల పెళ్లిళ్ల చేయాలి?' అని ప్రశ్నిస్తోంది రూప.

పోలీసులు పూనుకోవాలి

కట్నం తీసుకోవడం శిక్షార్హం కాబట్టి పోలీసులు పూనుకొని ఈ దురాచారాన్ని నిలువరించాలని, ప్రతి పెళ్లి జరిగే మంటపాల్లో చెకింగులు చేయాలని, కట్నం తీసుకుంటున్న కొంతమందికైనా శిక్ష పడితే కట్నం డిమాండ్ తగ్గుతుందని అంటుంది రూప. ఈమేరకు ఆమె భోపాల్ పోలీస్ కమిషనర్ హరినారాయణ్‌ను వినతిపత్రం ఇచ్చింది. వరకట్న దురాచారం వల్ల వస్తున్న ఆర్థిక బాధల గురించి చైతన్యం రావాలని మీడియాను సంప్రదించింది రూప. 'నేను కట్నం వద్దంటున్నానని మా అమ్మ నాతో మాట్లాడటం లేదు. కట్నం వద్దంటే జన్మలో నీ పెళ్లి చేయలేనని మా నాన్న టెన్షన్ పడుతున్నాడు. నేటి కాలంలో కట్నం ఉంటే తప్ప పెళ్లి కాని స్థితిలో ఒక యువతి ఉండటం ఎంత విషాదమో ఈ సమాజం ఆలోచించాలి' అంటోంది రూప.

ఈ స్థితికి తాము ఎంత కారణమో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఈ పరిస్థితిలో మార్పుకోసం ప్రయత్నించాలి.

అక్షరం

ఆబాలగోపాలం అద్భుతం అనేలా...

పిల్లల పుస్తకప్రపంచంలో తనదైన ప్రత్యేకత నిలుపుకుంది రూపా పాయ్.

ఫాంటసీ–అడ్వెంచర్ పుస్తకాలతో పాటు 'ది గీతా ఫర్ చిల్డ్రన్'లాంటి భిన్నమైన పుస్తకాన్ని రాసి ప్రశంసలు అందుకుంది. ఈ పుస్తకం 'క్రాస్‌వర్డ్ అవార్డ్' గెలుచుకుంది.

మరో భిన్నమైన పుస్తకం 'ది యోగా సూత్రాస్ ఫర్ చిల్డ్రన్'తో పిల్లలను పలకరించింది బెంగళూరుకు చెందిన రూప...

పిల్లల పత్రిక 'టార్గెట్'తో పాటు లండన్ కేంద్రంగా ప్రచురితమయ్యే 'ట్రావెల్ ట్రెండ్స్' మ్యాగజైన్ కోసం ఎన్నో రచనలు చేసింది రూప. అయితే తనకు పిల్లల కోసం రచనలు చేయడం అంటేనే బాగా ఇష్టం. 'నేను రచయిత్రి కాక పోయి ఉంటే టీచర్‌ని అయ్యేదాన్ని' అంటుంది కంప్యూటర్–ఇంజనీరింగ్ చదువుకున్న రూప.

చిన్నప్పటి నుంచి పుస్తకాలు తెగ చదివేది. బెంగళూరులోని లైబ్రరీలన్నీ ఆమెకు సుపరిచితమే. చదవగా, చదవగా తనలో కాల్పనిక ప్రపంచం ఒకటి అస్పష్టంగా ఆవిష్కరమయ్యేది. కళ్ల ముందు ఏవేవో పాత్రలు, దృశ్యాలు కదలాడుతుండేవి. కాగితం, కలం పట్టిన తరువాత వాటికి ఒక రూపం ఇచ్చింది.

రకరకాల జానర్స్‌లో రచనలు చేయడం గురించి రూప ఇలా అంటోంది...

'కథ మంచిదైతే, ఆకట్టుకునేలా ఉంటే అది ఏ జానర్ అనేది పిల్లలు పట్టించుకోరు. వారికి కచ్చితంగా హాస్యం ఉండాల్సిందే. ముఖ్యంగా క్లైమాక్స్ అనేది వారికి నచ్చాలి'

పిల్లలకు యోగా సూత్రాలు

భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని, ఆర్థిక సూత్రాల మర్మాన్ని పుస్తకాల ద్వారా పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పిన రూపా పాయ్ తాజా పుస్తకం 'ది యోగ సూత్రాస్ ఫర్ చిల్డ్రన్'. చిన్నప్పుడు మనసులో పడిన ఒక బీజం మొక్క అవుతుంది. ఆ తరువాత బలమైన చెట్టు అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాసిన పుస్తకం ఇది. 'మనలో కలిగే రకరకాల భావాలకి మనమే యజమాని' 'నేను శరీరాన్ని కాదు. కాని ఈ శరీరమనే అద్భుతమైన నిర్మాణంతో ఈ అద్భుత ప్రపంచాన్ని చూడగలుగుతున్నాను' 'నేను మనసుని కాదు. కానీ మనసు అనే మహా నిర్మాణంలో ఎన్నో అద్భుతాలను అనుభవంలోకి తెచ్చుకోగలుగుతాను'... ఇలా ఆకట్టుకునే మాటలు ఎన్నో ఉన్న 'ది యోగ సూత్రాస్ ఫర్ చిల్డ్రన్' ఆబాలగోపాలానికి ప్రియమైన పుస్తకం అవుతుంది అనడంలో సందేహం లేదు.



'ది గీతా ఫర్ చిల్డ్రన్' పుస్తకం రూపకు ఎంతో పేరు తెచ్చింది.

'మన పురాణాలకు సంబంధించిన ఎన్నో సంక్లిష్టమైన విషయాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా రాస్తున్నారు కదా....మరి భగవద్గీత గురించి ఎందుకు రాయకూడదు' అని ఒకరోజు అడిగింది ఎడిటర్ వత్సల. అయితే అందుకుముందెన్నడూ భగవద్గీతను రూప చదవలేదు. అలా అని 'నేను రాయలేను' అనలేదు. 'ఓకే' అంటూ రంగంలోకి దిగింది. 'గీత'ను ఎన్నోసార్లు చదివింది. అనేకసార్లు చదివిన తరువాత 'గీత గురించి పిల్లలకు చెప్పాలనే ఆలోచన నాకు ఎందుకు రాలేదు' అనుకుంది.

నిజానికి అదొక సవాలు. కానీ ఆ సవాలును ఇష్టంగా స్వీకరించింది రూప.



● రూపా పాయ్

'ది గీతా ఫర్ చిల్డ్రన్' పిల్లలనే కాదు వారి తల్లిదండ్రులను కూడా ఆకట్టుకుంది. 'మంచి ప్రయత్నం' అని ప్రశంసించారు.

'ది గీతా ఫర్ చిల్డ్రన్' పుస్తకం విజయవంతం అయిన తరువాత 'ఇదే కోవలో మరో పుస్తకం రాస్తే బాగుంటుంది' అని చాలామంది అడిగారు. అయితే అలా రాస్తే రొడ్డకొట్టుడుగా ఉంటుందని రూపకు అనిపించింది. 'ఇప్పుడు కావాల్సింది మరో విభిన్నమైన పుస్తకం' అని అనుకుంది. అలా వచ్చిందే...'సో యూ వాంట్ టు నో ఎబౌట్ ఎకనామిక్స్' పుస్తకం.

ఈ పుస్తకం రావడానికి మరో కారణం 'గీతను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడంలో విజయం సాధించాను' అనే ఆత్మవిశ్వాసం. ఈ పుస్తకం తరువాత వచ్చిన 'రెడీ 99'కి కూడా మంచి స్పందన వచ్చింది.

పుస్తకం రాయడానికి రూప అనుసరించే పద్ధతి ఏమిటి?

పుస్తకం రాయడానికి ముందు మనసు అనే కాగితంపైనే ఎన్నో వాక్యాలు రాసుకుంటుంది. అక్కడే ఎడిటింగ్ చేసుకుంటుంది. తాను ఎంచుకున్న అంశంపై ఎన్నో పుస్తకాలు చదువుతుంది. ఆ అంశంపై పట్టు ఉన్న వాళ్లతో మాట్లాడుతుంది. విషయ అవగాహన తరువాత పిల్లలను ఆకట్టుకునేలా, అర్థమయ్యేలా ఎలా రాయాలో అనేదానిపై కసరత్తు చేస్తుంది.

'పన్నెండు సంవత్సరాల వయసులో ఒక పిల్లల మాసపత్రికను చూస్తూ...పెద్దయ్యాక ఈ పత్రికకు కథలు రాయాలనుకునేదాన్ని. నా కల నెరవేరింది. ఇంతకంటే అదృష్టం, ఆనందం ఏముంటాయి!' అంటుంది రూపా పాయ్.

సాగరకన్య ఫర్ శాలరీ





జలకన్య, మత్స్య కన్య అని వినపడగానే ఎక్కడ? ఎక్కడ? అని చూస్తుంటారు చాలామంది. శరీర పైభాగం మనిషిగా, కింది భాగం చేపరూపంలో ఉండే జలకన్యలంటే ఆసక్తి ఉండనిదెవరికి? జలకన్యను చూసేందుకు అందరూ ఆరాటం దగ్గరే ఆగిపోతే, మాస్ గ్రీన్ మాత్రం మత్స్యకన్యపై మరింత మక్కువతో తానే ఓ జలకన్యగా మారిపోయింది. మత్స్యకన్యలా ఈదుతూ... ఈ ఉద్యోగం ఎంత బావుందో అని తెగ సంబరపడిపోతుంది.

యూకేలోని టార్క్వే నగరానికి చెందిన ముప్పై మూడేళ్ల మాస్‌గ్రీన్ 2016లో ఇటలీలోని సిసిలీ వెళ్లింది. అక్కడ ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. కరోనా కారణంగా ఇళ్లకే పరిమితమైన సమయంలో ఏం చేయాలో తోచక కొత్తగా ఏదైనా చేయాలనుకుంది. అలా ఆలోచిస్తున్న సమయంలో ఇంటికి దగ్గరలో ఉన్న బీచ్‌లో ఒకతను 'మ్యాజికల్ మెర్మాన్' డ్రెస్‌లో కనిపించాడు. అది చూసిన మాస్‌కు చాలా ఆసక్తిగా అనిపించింది. వెంటనే జలకన్య ఎలా ఉంటుందో తెలుసుకుని, తను కూడా అలా తయారవాలనుకుంది. అప్పటి నుంచి జలకన్యగా తయారవడం తనకెంతో ఇష్టమైన హాబీగా మార్చుకుంది. మత్స్యకన్యగా రెడీ అయ్యి తనని తాను చూసుకుంటూ తెగమురిసిపోయేది.

ఇన్‌స్టాగ్రామ్ ఆఫర్‌తో...

మత్స్యకన్యగా తయారైన ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్టు చేస్తుండేది. ఆ ఫొటోలు చూసిన ఓ సంస్థ మత్స్య కన్య ఉద్యోగం ఇస్తాం అని మాస్‌ని పిలిచింది. దీంతో సిసిలీ బీచ్‌కు దగ్గర్లో ఉన్న 'లాంపేడుసా' ఐలాండ్‌లో మత్స్యకన్యగా పనిచేస్తోంది. ఊపిరిని బిగపట్టి నీటి అడుగు భాగంలో డైవింగ్ చేయడం, నిజమైన జలకన్యలా అటు ఇటు తిరగడం వంటి విన్యాసాలతో పర్యాటకుల్ని ఆకర్షించడమే ఆమె ఉద్యోగం. బోట్ టూర్స్‌కు గైడెన్స్ ఇస్తూనే, జలచరాలు నీటిలో ఎలా కదులుతాయో చెబుతూ పర్యాటకులకు ఈదడం నేర్పించడం ఈ ఉద్యోగంలో చేయాల్సిన ఇతర ముఖ్యమైన పనులు. వేసవి సమయాల్లో రోజుకు 12 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయడం కోసం మాస్ వివిధ రకాల చేపల కదలికను గమనించి, ఈదడంలో మెళకువలు నేర్చుకుంది. ఊపిరిని బిగపట్టడాన్ని ఎంతో ఛాలెంజింగ్‌గా తీసుకుని కష్టపడి అభ్యసించింది. ప్రస్తుతం తన వృత్తిలో ఎంతో సంతోషంగా ఉంది మాస్ గ్రీన్.

మాస్ గ్రీన్ తన ఆసక్తితో సరికొత్త ఉద్యోగాన్ని సృష్టించి ఎంతో మంది నిరుద్యోగులకు కొత్త దారి చూపించింది. ఇష్టం, చేయాలన్న సంకల్పం ఉంటే ఏదో రకంగా దారి దొరుకుతుందనడానికి ఈ జలకన్య ఉద్యోగమే ఉదాహరణగా నిలుస్తోంది.

ఖర్చులకు సరిపోతుంది..

"టీచర్‌గా పనిచేసేటప్పుడు వచ్చే జీతం కంటే మత్స్యకన్య ఉద్యోగానికి జీతం తక్కువే. అయినా నా ఖర్చులకు తగినంత సంపాదిస్తున్నాను. ఇది చాలు. ఈ ఉద్యోగం నాకు చాలా సంతోషాన్నిస్తోంది. అమ్మకు.. మత్స్య కన్య హాబీ గురించి తెలిసినప్పుడు.. అసాధారణమైనదిగా భావించారు. కానీ దీనినే కెరీర్‌గా ఎంచుకుంటానని ఆమె అస్సలు అనుకోలేదు. నా సంతోషం చూసి ఇప్పుడు అమ్మే నన్ను ప్రోత్సహిస్తున్నారు".
– మాస్ గ్రీన్.

సైబర్ టాక్

వాట్సాప్ పింక్ మోసం



వాట్సప్‌లో ఓ కొత్త మోసం వేగంగా వ్యాపిస్తోంది. ఈ వాట్సాప్ పింక్ స్కామ్ ఇప్పటికే చాలా మంది వ్యక్తులను మోసగించింది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు విభాగాలు, సైబర్ నిపుణులు ఈ మోసాలకు వ్యతిరేకంగా ఇప్పటికే హెచ్చరించారు. ఆండ్రాయిడ్ వినియోగదారుల కోసం వాట్సాప్ 'పింక్ రెడ్ అలర్ట్'తో హెచ్చరించింది. ఇంతకీ వాట్సాప్ పింక్ అంటే ఏంటి? ఈ స్కామ్ ఎలా వ్యాపిస్తోంది. మీరు బాధితులైతే ఏం చేయాలి?! తప్పనిసరిగా తెలుసుకోవాలి.

పింక్ వాట్సాప్ అంటే..?

స్కామర్లు 'అదనపు ఫీచర్లతో ఉన్న పింక్ వాట్సాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని వినియోగదారులకు మెసేజ్‌లు పంపుతారు.' ఈ యాప్ నిజానికి ప్రమాదకరమైన మాల్వేర్. వాట్సాప్ పింక్‌ని డౌన్‌లోడ్ చేయడంతో స్కామర్లు ఫోన్ డేటాకు యాక్సెస్ పొందుతారు. దీంతో ఈ యాప్ మన ఫోన్ డేటాను పూర్తిగా దొంగిలించడానికి వీలు కల్పిస్తోంది. బ్యాంక్ వివరాలు, కాంటాక్ట్ నంబర్లు, ఫొటోగ్రాఫ్స్, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని స్కామర్లు దొంగిలించి ఉండవచ్చు.

వినియోగదారులకు వచ్చే మెసేజ్‌లు ఇలా ఉంటాయి..

- 'న్యూ పింక్' వాట్సాప్ కొత్త ఫీచర్లతో అధికారికంగా ప్రారంభించారు. న్యూ పింక్ లుక్ కొత్త ఫీచర్లతో మీ వాట్సాప్‌ను ఇప్పుడే అప్‌డేట్ చేయండి. ఈ కొత్త వాట్సాప్‌ని ఇప్పుడే ప్రయత్నించండి అనే మెసేజ్‌లు వస్తుంటాయి.
- ఫోన్ హైజాక్ చేసిన వాళ్లు మీ కాంటాక్ట్ నుండి వచ్చే మెసేజ్‌లను కూడా డౌన్‌లోడ్ చేయవచ్చు. యాప్ నకిలీ వెర్షన్ వినియోగదారుల ఫోన్‌లను హ్యాక్ చేయడమే కాదు, ఇది యాప్‌ను డౌన్‌లోడ్ చేయమని మీ పూర్తి కాంటాక్ట్‌లోని జాబితాకు మెసేజ్‌లు కూడా పంపుతుంది.
- వాట్సాప్ పింక్ అనేది హానికరమైన మాల్వేర్. మొబైల్ ఫోన్‌లను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే ఓ నకిలీ సాఫ్ట్‌వేర్. ఓటీపీలు, కాంటాక్ట్స్, బ్యాంక్ ఖాతా వివరాలు, ఇతర ఆర్థిక విషయాలతో సహా వినియోగదారుల పరికరాల నుండి పూర్తి సమాచారాన్ని దొంగిలించడానికి హ్యాకర్లు దీనిని ఉపయోగిస్తారు. వ్యక్తులు లింక్‌లు ఓపెన్ చేసినప్పుడు వారి డిజిటల్ పరికరాలలో హానికరమైన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అవుతుంది.
- థర్డ్–పార్టీ యాప్ స్టోర్‌లు లేదా APK ఫైల్స్ నుండి ప్రోగ్రామ్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆపిల్ ఫోన్‌లో అయితే యాక్సెస్ ఉండదు. వాట్సాప్ పింక్ స్కామ్ ఆండ్రాయిడ్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. థర్డ్‌పార్టీ యాప్ స్టోర్‌లు, ఏపీకే ఫైల్స్ ద్వారా ఇది వ్యాపిస్తుంది.
- తమ అక్రమ కార్యకలాపాలకోసం హ్యాకర్లు ఫోన్ గ్యాలరీలో వ్యక్తిగత ఫొటోలను తీసి, బ్లాక్ మెయిలింగ్‌కు ఉపయోగించుకుంటున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థలు, చట్టాన్ని అమలు చేసే అధికారులు హెచ్చరిస్తున్నారు.
- మీ ఫోన్‌లో వాట్సాప్ పింక్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఉంటే ఇప్పుడే దానిని అన్ ఇన్‌స్టాల్ చేయండి. ఆ తర్వాత, మీ ఫోన్‌ని బ్యాకప్ చేసి ఫార్మాట్ లేదా రీసెట్ చేయండి.

మీరు ఈ వాట్సాప్ పింక్ గురించి ఇతరులకు అవగాహన కల్పించండి. తాజా స్కామ్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకోండి. స్నేహితుల, కుటుంబ సభ్యులతో సమాచారాన్ని పంచుకోండి. అవగాహన పెంపొందించడం ద్వారా ఇతరుల స్కామ్‌ల బారిన పడకుండా మీరు సహాయం చేయవచ్చు. మోసానికి గురైతే బాధితులు https://www.cybercrime.gov.in/ పోర్టల్‌లో రిపోర్ట్ చేయవచ్చు.

అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్త

- తెలియని లేదా అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం మానుకోవాలి. ప్రత్యేకించి అవి కొత్త ఫీచర్లు లేదా హానికరమైన లింక్‌లపై క్లిక్ చేసేలా ఆకట్టుకునే మెసేజ్‌లు ఉంటే అనుమానించాలి.
- వాట్సాప్ లేదా ఏదైనా ఇతర అధికారిక సంస్థ నుండి వచ్చినట్లు క్లెయిమ్ చేసే మెసేజ్‌ను యాక్సెస్ చేస్తే ముందు దాని ప్రామాణికతను ధ్రువీకరించాలి. సమాచారం చట్టబద్ధంగా ఉందో లేదో తెలుసుకోవడానికి వాట్సాప్ వెబ్‌సైట్, సోషల్ మీడియా అకౌంట్స్, విశ్వసనీయ వార్తా సమాచారాల నుంచి చెక్ చేయాలి.
- పేరొందిన యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా మీ మొబైల్ పరికరాన్ని సురక్షితంగా ఉంచచ్చు. ఇవి హానికరమైన యాప్‌లు లేదా లింక్‌లను గుర్తించి అడ్డుకోవడంలో సహాయపడతాయి.
- వాట్సాప్, ఇతర యాప్‌లను ఎప్పటికప్పుడు తాజా వెర్షన్‌లకు అప్‌డేట్ చేయాలి. సేఫ్టీ అప్‌డేట్ వల్ల బెదిరింపుల నుండి రక్షించుకోవడానికి సహాయపడుతుంది.
- వాట్సాప్ మీ బ్యాంకింగ్ వివరాల వంటి సెన్సిటివ్ సమాచారాన్ని మెసేజ్‌ల ద్వారా ఎప్పటికీ అడగదు. తెలియని లేదా నమ్మదగని అకౌంట్స్‌తో ఎప్పుడూ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు.
- వాట్సాప్ కూడా రెండు దశల ప్రామాణికతతో ఉంటుంది. దీనిని సెట్ చేసుకోవడానికి పిన్ నంబర్ ఉంటుంది. కొత్త ఫోన్‌లో మీ ఫోన్ నంబర్ యాక్సెస్ అవ్వాలంటే ఈ పిన్ నెంబర్ అవసరం అవుతుంది. మీ అకౌంట్ సేఫ్టీని మెరుగుపరచడానికి వాట్సాప్ సెట్టింగ్‌లలో ఈ ఫీచర్‌ని ఇప్పుడే ప్రారంభించవచ్చు.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

ఇంటిప్స్

ఇలా దాచుకోండి!


రుచిగా, వేగంగా వంట చేయాలంటే ఈ మూడు చిట్కాలు పాటిస్తే సరి.



కూర ఏదైనా రుచికోసం అల్లం వెల్లుల్లి పేస్టుని వాడుతుంటాం. ఈ పేస్టుని రిఫ్రిజిరేటర్లో నిల్వ చేసినప్పటికీ కొన్నిసార్లు రంగు మారి, ఎండిపోయినట్లు అవుతుంది. అల్లం వెల్లుల్లి పేస్టుని నిల్వచేసేముందు కొద్దిగా నూనె కలిపి పెడితే మరిన్ని రోజులు తాజాగా ఉంటుంది. అల్లం, వెల్లుల్లి పేస్టులను విడివిడిగా నిల్వచేసినా నూనె కలుపుకోవడం మంచిది.



మిగిలిపోయిన ఆహార పదార్థాలు, మసాలాలు, ఇడ్లీ దోశపిండిలతో రిఫ్రిజిరేటర్ నిండిపోతుంటుంది. దీంతో తలుపు తీసినప్పుడల్లా అదొక రకమైన వాసన వస్తుంటుంది. కాటన్ బాల్‌ను వెనీలా ఎసెన్స్‌లో ముంచి, రిఫ్రిజిరేటర్‌లో ఒక మూలన ఉంచితే దుర్వాసన పోతుంది.



మిగిలిపోయిన దోశ, ఇడ్లీ పిండి, గారెల పిండి వంటివాటిని రిఫ్రిజిరేటర్‌లో పెట్టినా, కొన్నిరోజులకే ఎండిపోవడమో, బాగా పులిసిపోవడమో జరుగుతుంది. అందువల్ల మిగిలిపోయిన పిండిలో రెండు మూడు ఎండు మిరపకాయలు వేసి రిఫ్రిజిరేటర్‌లో పెట్టుకోవాలి.

స్పోర్ట్స్



రష్మిక సంచలన విజయం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయిలు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి సింగిల్స్ విభాగంలో శుభారంభం చేశారు. థాయ్‌లాండ్‌లో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక 6-0, 6-2తో ఎనిమిదో సీడ్ ఇకుమి యామజాకి (జపాన్)పై సంచలన విజయం సాధించగా... ఏడో సీడ్ సహజ 3-6, 6-2, 6-2తో దశ ఇవనోవా (అమెరికా)ను ఓడించింది. ఇకుమితో జరిగిన మ్యాచ్‌లో రష్మిక రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ఐదు బ్రేక్ పాయింట్లు సాధించింది.

టాప్ ర్యాంక్‌లోనే అశ్విన్



భారత వెటరన్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ టాప్ ర్యాంక్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 860 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాడు రవీంద్ర జడేజా అగ్రస్థానంలోనే ఉన్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు టాప్ ర్యాంక్ నిలబెట్టుకుంది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో విష్ణువర్ధన్-కృష్ణ ప్రసాద్ జోడీ

కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణ ప్రసాద్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో విష్ణువర్ధన్-కృష్ణ ప్రసాద్ ద్వయం 21-14, 21-16తో చెన్ జి రే-లు చెన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో కామన్వెల్త్ గేమ్స్ మాజీ చాంపియన్ పారుపల్లి కశ్యప్‌కు నిరాశ ఎదురైంది. 36 ఏళ్ల కశ్యప్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో కశ్యప్ 21-14, 22-20తో కాయ్ ష్కాఫెర్ (జర్మనీ)పై నెగ్గి.. రెండో రౌండ్‌లో 17-21, 20-22తో లె లాన్ జి (చైనా) చేతిలో ఓడిపోయాడు.

విండీస్‌కు తొలి విజయం



హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ 'సూపర్ సిక్స్' దశలో వెస్టిండీస్ తొలి విజయం నమోదు చేసింది. ఒమన్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా ఒమన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లకు 221 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (50; 5 ఫోర్లు, 1 సిక్స్), సూరజ్ కుమార్ (53; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో రొమారియో షెఫర్డ్ మూడు, కైల్ మేయర్స్ రెండు వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ 39.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (100; 15 ఫోర్లు) సెంచరీ చేశాడు. షై హోప్ (63 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్) అజేయ అర్ధ సెంచరీ సాధించాడు. వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించాలంటే తప్పనిసరిగా 'సూపర్ సిక్స్' దశలో తాము ఆడే మూడు మ్యాచ్‌లు గెలవాల్సిన వెస్టిండీస్ తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్ చేతిలో ఓడిపోయి మొదటిసారి వన్డే వరల్డ్‌కప్‌నకు దూరమైంది.

'ఈతరం బ్రాడ్‌మన్'

100వ టెస్టు ఆడనున్న స్టీవ్ స్మిత్ ● ఆస్ట్రేలియా తరఫున 15వ క్రికెటర్‌గా ఘనత



సాక్షి క్రీడా విభాగం

2010 జూలై... లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియా, పాకిస్తాన్ మధ్య తొలి టెస్టు మ్యాచ్. దిగ్గజ క్రికెటర్ షేన్ వార్న్ రిటైరై అప్పటికి మూడేళ్లవుతోంది. అతని స్థానాన్ని భర్తీ చేసే స్పిన్నర్ల వేట కొనసాగిస్తున్న ఆస్ట్రేలియా వేర్వేరు కొత్త ఆటగాళ్లతో ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో 21 ఏళ్ల లెగ్‌స్పిన్నర్ స్టీవెన్ స్మిత్‌కు అవకాశం కల్పించింది. బౌలింగ్‌లో 3 వికెట్లు తీసిన అతను... బ్యాటింగ్ 8వ, 9వ స్థానాల్లో బరిలోకి దిగి 1, 12 పరుగులు మాత్రమే చేశాడు. అయితే తర్వాతి రోజుల్లో అతను బౌలింగ్‌ను పక్కన పెట్టి అద్భుతమైన బ్యాటర్‌గా ఎదుగుతాడని ఎవరూ ఊహించలేకపోయారు. టెస్టు క్రికెట్‌లో ఘనమైన రికార్డులతో ఇప్పటికే ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడిగా నిలిచిన స్మిత్ నేడు కెరీర్‌లో 100వ టెస్టు బరిలోకి దిగనుండటం విశేషం.

కెరీర్‌లో తొలి ఐదు టెస్టుల్లో రెండు అర్ధ సెంచరీలు సాధించినా... ఆస్ట్రేలియా టీమ్ మేనేజ్‌మెంట్ స్మిత్‌ను బ్యాటర్‌గా గుర్తించలేదు. బౌలింగ్‌లోనూ మూడు వికెట్లే తీయడంతో సహజంగానే జట్టులో స్థానం పోయింది. మళ్లీ టీమ్‌లోకి రావడానికి అతనికి రెండేళ్లు పట్టింది. 'హోంవర్క్‌గేట్' కారణంగా సీనియర్లపై వేటు పడటంతో అదృష్టవశాత్తూ మొహాలిలో భారత్‌తో జరిగిన టెస్టులో అతనికి అవకాశం దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో 92 పరుగులు చేసిన స్మిత్ బ్యాటింగ్ విలువేమిటో అందరికీ అర్థమైంది. కెరీర్‌లో తొలి మూడు సెంచరీలు ఇంగ్లండ్‌పైనే నమోదు చేసిన స్మిత్... స్టెయిన్, మోర్కెల్, ఫిలాండర్‌ల పదునైన పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొని సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికాపై సాధించిన శతకం అతని స్థానాన్ని సుస్థిరం చేసింది. ఆ తర్వాత అతను వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు అత్యుత్తమ ప్రదర్శనలతో దూసుకుపోయి స్మిత్ టెస్టుల్లో శిఖరానికి చేరుకున్నాడు. కెరీర్‌లో ఒకదశలో అత్యుత్తమంగా 64.81 సగటును అందుకున్న స్మిత్... డాన్ బ్రాడ్‌మన్ తర్వాత రెండో స్థానంలో నిలిచి 'ఆధునిక బ్రాడ్‌మన్' అనిపించుకున్నాడు. పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రపంచంలోనే అన్ని వేదికల్లోనూ పరుగులు సాధించగలడం స్మిత్ సాధించిన ఘనత.

ఎదురులేని ప్రదర్శనలతో...

2014-2018 మధ్య కాలం స్మిత్ కెరీర్‌లో అత్యుత్తమం. ఈ సమయంలో ఎన్నో అసాధారణ రికార్డులను అతను తన ఖాతాలో వేసుకున్నాడు. 79 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 75.81 సగటుతో 5004 పరుగులు నమోదు చేశాడు. 2015 యాషెస్ సిరీస్‌లో 508 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన అతను ఈ సిరీస్ ముగియగానే పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. భారత గడ్డపై జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో 3 సెంచరీలు సహా 499 పరుగులతో అతనే అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సిరీస్‌లో కఠినమైన పుణే పిచ్‌పై ప్రతికూల పరిస్థితులను అధిగమించి రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ చేసిన శతకం టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటి. కొద్ది రోజులకే కెప్టెన్‌గా సొంతగడ్డపై 4-0తో యాషెస్ సిరీస్‌ను గెలిపించడంతోపాటు 687 పరుగులతో టాపర్‌గా నిలిచాడు. వరుసగా నాలుగేళ్లు వేయికి పైగా పరుగులు చేసి తన స్థాయి ఏమిటో అతను చూపించాడు. 2014లో తొలిసారి 50 బ్యాటింగ్ సగటును స్మిత్ అందుకోగా, ఇప్పటి వరకూ అది అంతకంటే తగ్గకపోవడం అతని నిలకడను చూపిస్తోంది.

టాంపరింగ్ వివాదాన్ని దాటి...

తెలివితేటలు, వ్యూహ చతురత, సాంకేతికాంశాలపై పట్టు స్మిత్‌ను విజయవంతమైన కెప్టెన్‌గా నిలిపాయి. అయితే ఇదే తెలివి కాస్త 'అతి'గా మారడంతో 2018 ఆరంభంలో దక్షిణాఫ్రికాతో టెస్టులో బాల్ టాంపరింగ్‌కు పాల్పడి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఏడాది పాటు నిషేధం కూడా పడింది. అయితే సంవత్సరం తర్వాత తిరిగొచ్చాక అతను తనలోని పాత స్మిత్‌ను మళ్లీ చూపించాడు. 2019 యాషెస్‌లో 4 టెస్టుల్లోనే ఏకంగా 774 పరుగులతో సత్తా చాటాడు. తర్వాత కొన్నాళ్లపాటు తడబాటు కనిపించినా... గత ఏడాది గాలే టెస్టులో 145 పరుగులతో ఫామ్‌లోకి వచ్చిన అతను ఇప్పటికీ అదే జోరును కొనసాగిస్తున్నాడు. తాజాగా డబ్ల్యూటీసీ ఫైనల్లో, లార్డ్స్ టెస్టులోనూ శతకాలు బాది మరిన్ని రికార్డులపై స్మిత్ గురి పెట్టాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో 99 టెస్టులు ముగిసేసరికి అత్యుత్తమ సగటు (59.56)తో నిలిచిన ఆటగాడైన స్మిత్ 32 సెంచరీలు, 37 అర్ధ సెంచరీలతో 9113 పరుగులు సాధించాడు.

నేటి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య మూడో 'యాషెస్' టెస్టు లీడ్స్‌లో జరగనుంది. హెడింగ్లీ మైదానంలో జరిగే ఈ పోరు కోసం ఇంగ్లండ్ ఇప్పటికే తుది జట్టును ప్రకటించింది. గత మ్యాచ్ ఆడిన పోప్, అండర్సన్, టంగ్ స్థానాల్లో వోక్స్, అలీ, వుడ్‌లను ఎంపిక చేశారు. సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన ఆస్ట్రేలియా 2-0తో ఆధిక్యంలో ఉంది.

మధ్యాహ్నం గం. 3:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను 'సోనీ నెట్‌వర్క్'లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

భారత టి20 జట్టులో తిలక్ వర్మ

వెస్టిండీస్‌తో సిరీస్‌కు ఎంపికైన హైదరాబాద్ క్రికెటర్ ● కోహ్లి, రోహిత్ శర్మకు విశ్రాంతి



న్యూఢిల్లీ: గత రెండు ఐపీఎల్ సీజన్‌లలో ముంబై ఇండియన్స్ జట్టు తరఫున నిలకడగా రాణించిన హైదరాబాద్ యువ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ తొలిసారి భారత టి20 జట్టులోకి ఎంపికయ్యాడు. వెస్టిండీస్ జట్టుతో వచ్చే నెలలో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బుధవారం రాత్రి బీసీసీఐ ప్రకటించింది. 20 ఏళ్ల తిలక్ వర్మ 2022 ఐపీఎల్‌లో 14 మ్యాచ్‌లు ఆడి 131.02 స్ట్రయిక్‌రేట్‌తో 397 పరుగులు చేశాడు. ఇందులో రెండు అర్ధ సెంచరీలున్నాయి. 2023 ఐపీఎల్‌లో తిలక్ 11 మ్యాచ్‌లు ఆడి 164.11 స్ట్రయిక్‌రేట్‌తో 343 పరుగులు సాధించాడు. ఐపీఎల్, దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో కలిపి ఓవరాల్‌గా తిలక్ ఇప్పటి వరకు 47 మ్యాచ్‌లు ఆడి 142.51 స్ట్రయిక్‌రేట్‌తో 1,418 పరుగులు చేశాడు. తిలక్ ఖాతాలో మొత్తం పది అర్ధ సెంచరీలున్నాయి.

మరోవైపు సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు వెస్టిండీస్ సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వగా... హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా, సూర్యకుమార్ యాదవ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున పలు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ ఉత్తరప్రదేశ్ డాషింగ్ క్రికెటర్ రింకూ సింగ్ జాతీయ జట్టుకు ఎంపిక కాలేకపోయాడు. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ఐదు టి20 మ్యాచ్‌లు ఆగస్టు 3న (ట్రినిడాడ్), 6న, 8న (గయానా), 12న, 13న (ఫ్లోరిడా) జరుగుతాయి.

భారత టి20 జట్టు: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సూర్యకుమార్ యాదవ్ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, సంజూ సామ్సన్, అక్షర్ పటేల్, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ఉమ్రాన్ మాలిక్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.

నార్త్‌జోన్ 198 ఆలౌట్


విద్వత్

బెంగళూరు: సౌత్ జోన్ జట్టుతో బుధవారం ఆరంభమైన దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో నార్త్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 58.3 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. సౌత్‌జోన్ పేసర్లు విద్వత్ కావేరప్ప (5/28), శశికాంత్ (2/52) నార్త్ జోన్‌ను హడలెత్తించారు. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (49; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. అనంతరం తొలిరోజు ఆటనిలిచే సమయానికి సౌత్‌జోన్ 17 ఓవర్లలో 4 వికెట్లకు 63 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (37 బ్యాటింగ్; 4 ఫోర్లు), తిలక్‌వర్మ (12 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ హనుమ విహారి (0), రికీ భుయ్ (0) డకౌటయ్యారు. హర్షిత్, బల్తేజ్ చెరో 2 వికెట్లు తీశారు. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌జోన్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 216 పరుగులు చేసింది. పృథ్వీ షా (26; 4 ఫోర్లు), పుజారా (28; 3 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. శివమ్ మావికి 4 వికెట్లు దక్కాయి.

స్వియాటెక్ సులువుగా...


స్వియాటెక్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో స్వియాటెక్ 6-2, 6-0తో సారా సారిబెస్ టోర్మో (స్పెయిన్)పై గెలిచింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 11వ సీడ్ కసత్‌కినా (రష్యా) కూడా మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. కసత్‌కినా 6-0, 6-2 తో జోడీ బరేజ్ (బ్రిటన్)పై గెలిచింది. మరోవైపు మార్టా కోస్టిక్ (ఉక్రెయిన్) తొలి రౌండ్‌లో 0-6, 7-5, 6-2తో ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) తొలి రౌండ్‌లో 7-5, 6-4, 6-3తో ఆర్థర్ ఫెరీ (బ్రిటన్)పై గెలిచాడు. ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్), తొమ్మిదో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా), పదో సీడ్ టియాఫో (అమెరికా) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

సినిమా

"'రంగబలి' మంచి మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. ఈ సినిమా చూస్తున్నంతసేపు సొంత ఊరు గుర్తొస్తుంది. ఆ ఊరిని మిస్ అవుతున్నామనే ఫీలింగ్ కలిగి ఓసారి ఊరెళ్లి వద్దామనే ఆలోచన కలుగుతుంది" అని హీరో నాగశౌర్య అన్నారు. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా నటించిన చిత్రం 'రంగబలి'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా నాగశౌర్య చెప్పిన విశేషాలు.

సినిమా చూశాకే ప్రమోట్ చేస్తానన్నా!

- నాగశౌర్య


● నాగశౌర్య

● నటుడికి దర్శకుడు స్పేస్ ఇవ్వాలి. ఆ స్పేస్‌ని పవన్ నాకు ఇచ్చాడు. దర్శకునిగా తనకు తొలి సినిమా కాబట్టి ఏ విషయంలోనూ ఒత్తిడి తీసుకోవద్దని, ఏ సాయం కావాలన్నా చేస్తానని ముందే చెప్పాను. నా అనుభవాన్ని, పవన్ విజన్‌ని జోడించి అనుకున్నది అనుకున్నట్లుగా 'రంగబలి' లాంటి ఓ మంచి సినిమా తీశాం. ● 'రంగబలి' ప్రివ్యూ చూశాకే ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తానని దర్శక-నిర్మాతలకు చెప్పాను. చూసిన తర్వాత చాలా మంచి మూవీ చేశామనే అనుభూతి కలిగింది. అందుకే సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని ప్రేక్షకులకు నమ్మకంగా చెప్పగలుగుతున్నాను. సుధాకర్‌గారు ఎక్కడా రాజీ పడకుండా 'రంగబలి' తీశారు. ఈ మూవీతో పవన్‌కి మంచి పేరొస్తుంది. యుక్తి తరేజ మంచి యాక్టర్ అండ్ డ్యాన్సర్. తెలుగులో లీడింగ్ హీరోయిన్ అయ్యే అవకాశాలు తనకు చాలా ఉన్నాయి. పవన్ సంగీతం, నేపథ్య సంగీతాన్ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. ● ఇప్పుడున్న పోటీలో హీరోలందరూ అద్భుతమైన నటన, డ్యాన్స్, యాక్షన్ చేస్తున్నారు. ఇలాంటి సమయంలో నేనూ ది బెస్ట్ ఇవ్వాలి. ఈ క్రమంలో ఒక్కోసారి గాయాలవుతాయి. కష్టపడితేనే సక్సెస్ వస్తుంది. ● ఏ ప్రొడక్షన్ హౌస్‌లోనైనా పది హిట్స్ పడిన తర్వాత కూడా ఒక సినిమా నిరాశ పరిస్తే దాన్ని రికవర్ చేయడం అంత తేలిక కాదు. సినిమా అంటే మాకు పిచ్చి.. ప్యాషన్‌తోనే మా ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో సినిమాలు నిర్మిస్తున్నాం తప్ప డబ్బులు సంపాదించుకోవాలని కాదు. మాకు సినిమా తప్పితే వేరేది తెలియదు. ప్రస్తుతానికి దర్శకత్వం ఆలోచన లేదు. నేను నటిస్తున్న 24వ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యింది.

సినిమా బాగుంటే చాలు...

- అజయ్ సామ్రాట్



"'యమదొంగ' సినిమాలో మమతా మోహన్ దాస్‌గారి నటనంటే నాకు ఇష్టం. ఆమె క్యాన్సర్ నుంచి కోలుకోవడంతో 'రుద్రంగి'లో నటించమని కోరాను. 'పదేళ్ల నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాలేదు.. నన్ను సంప్రదించినందుకు థ్యాంక్స్' అన్నారామె" అని డైరెక్టర్ అజయ్ సామ్రాట్ అన్నారు. జగపతిబాబు, ఆశిష్ గాంధీ, మమతా మోహన్ దాస్, విమలా రామన్, గానవి లక్ష్మణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. అజయ్ సామ్రాట్ దర్శకత్వంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో అజయ్ సామ్రాట్ మాట్లాడుతూ– "'బాహుబలి, రాజన్న' సినిమాలకు డైలాగ్ రైటర్‌గా చేశాను. ఇక నా బాల్యంలో విన్న కథలు, చూసిన పరిస్థితులు, చదివిన చరిత్ర నుంచి 'రుద్రంగి' కథ రాసుకున్నాను. తెలంగాణలో దొరల అణచివేతల మీద ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి. కానీ, 'రుద్రంగి'ని పూర్తి భిన్నంగా ఫ్యామిలీ ఎమోషనల్, సోషల్ డ్రామాగా తీశాను. రసమయిగారికి సినిమా తీయాలనే తపన ఎక్కువగా ఉంది.. నిర్మాతగా ఆయన ఏం చేయగలడో అన్నీ చేశారు. సినిమా బాగుంటే జనాలు చూస్తారు. 'కాంతారా'కి ప్రమోషన్స్ కూడా పెద్దగా చేయలేదు. కానీ, జనాలు విపరీతంగా చూశారు. మా 'రుద్రంగి' కూడా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు.

కొత్త కబురు

కొత్త సినిమా కబురు చెప్పారు హీరో కల్యాణ్‌రామ్. ఆయన హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ యాక్షన్ ఫిల్మ్ రూపొందనుంది. జూలై 5న (బుధవారం) కల్యాణ్‌రామ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మించనున్నారు. "కల్యాణ్ రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందనున్న సినిమా ఇది. అవుట్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది.


● 'డెవిల్'లో కల్యాణ్ రామ్

గూఢచారి లక్షణం అదే!

"మనసులో ఉన్న భావన ముఖంలో తెలియకూడదు. మెదడులో ఉన్న ఆలోచన మాటల్లో బయట పడకూడదు. అదే గూఢచారికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణం" అని కల్యాణ్ రామ్ చెప్పిన డైలాగ్స్‌తో 'డెవిల్' గ్లింప్స్ విడుదలైంది. కల్యాణ్ రామ్ హీరోగా నవీన్ మేడారం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు.


● సమంత

లాంగ్ బ్రేక్

దాదాపు దశాబ్దానికి పైగా సినిమాలతో బిజీగా ఉంటున్న సమంత వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా కొంతకాలం బ్రేక్ తీసుకోవాలని అనుకుంటున్నారు. ఈ కారణంగానే ఇటీవల కాలంలో ఏ కొత్త సినిమాకు సమంత సైన్ చేయలేదని సమాచారం. ఇప్పటికే కొత్త ప్రాజెక్ట్స్ కోసం తీసుకున్న అడ్వాన్స్‌ని ఆయా నిర్మాతలకు తిరిగి ఇవ్వాలనే ఆలోచనలో సమంత ఉన్నారని భోగట్టా. ఇక గత ఏడాది మయోసైటిస్ అనే వ్యాధితో తాను బాధపడుతున్నానని సమంత వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ వ్యాధి నుంచి కోలుకున్నాక సమంత కొన్ని సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం సమంత చేతిలో 'ఖుషి', ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్ సిరీస్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. మూడు రోజుల్లో 'ఖుషి' పూర్తవుతుంది. 'సిటాడెల్' షూటింగ్ పూర్తి కావచ్చింది. ఇక ఆ తర్వాత సమంత ఏడాది పాటు బ్రేక్‌లో ఉండాలనుకుంటున్నారు. ఈ బ్రేక్‌ని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, అదనపు చికిత్సకు కేటాయించాలనుకుంటున్నారట.

ఆయనే పిలిచి చాన్స్ ఇవ్వాలనుకుంటున్నా!

- శ్రీ సింహా



"ప్రేక్షకులకు సందేశం ఇవ్వాలనో, భావోద్వేగాలతో ఏడిపించాలనో 'భాగ్ సాలే' సినిమా తీయలేదు. ప్రేక్షకులు రెండు గంటల పాటు థియేటర్లో నవ్వుకోవాలని తీశాం" అని హీరో శ్రీ సింహా కోడూరి అన్నారు. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వంలో శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'భాగ్ సాలే'. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ అవుతోంది.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శ్రీ సింహా మాట్లాడుతూ–"'భాగ్ సాలే' కథని ప్రణీత్ ఎప్పుడో చెప్పాడు. కానీ, 'తెల్లవారితే గురువారం, దొంగలున్నారు జాగ్రత్త, ఉస్తాద్' సినిమాల కమిట్‌మెంట్స్ వల్ల 'భాగ్ సాలే' ఆలస్యం అయింది. ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ వల్ల లాభాలు, నష్టాలుంటాయి. కథల ఎంపిక అనేది పూర్తిగా నా నిర్ణయమే. నాకు స్క్రిప్ట్ విషయంలో ఏదైనా డౌట్ వస్తే నాన్న (కీరవాణి), బాబాయ్ (రాజమౌళి) సలహాలు తీసుకుంటాను. 'భాగ్ సాలే' బడ్జెట్ ఎక్కువైనా నిర్మాతలు రాజీ పడలేదు. 'రంగస్థలం' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన అనుభవం నాకు యాక్టింగ్‌లో ఉపయోగపడింది. రాజమౌళిగారితో సినిమా చేయాలనేది అందరికీ ఓ కల. అలాగని ఆయన్ను నేను ఛాన్స్ అడగలేను. నేనింకా చాలా నేర్చుకోవాలి. ఆ తర్వాత ఆయనే పిలిచి నాకు అవకాశం ఇవ్వాలి. ప్రస్తుతం 'ఉస్తాద్' సినిమా చేస్తున్నాను" అన్నారు.

నా నమ్మకం నిజమైంది

- శ్రీ విష్ణు


● శ్రీవిష్ణు, రాజేష్, రెబా మోనికా జాన్, అనిల్ సుంకర

"'సామజ వరగమన' కథని రామ్ చెప్పినప్పుడే 'నువ్వు నాకు నచ్చావ్' లాంటి సినిమా అవుతుందని నమ్మాను. నా నమ్మకం నిజమైంది. 'సామజ వరగమన' చూసి అందరూ హాయిగా నవ్వుతున్నారు" అని హీరో శ్రీ విష్ణు అన్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ జంటగా రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా జూన్ 29న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో శ్రీ విష్ణు మాట్లాడుతూ– "ఈ సినిమా ట్రైలర్ లాంచ్ టైమ్‌లో చిరంజీవిగారి చేయి నా గుండె మీద ఎప్పుడైతే ఆటోగ్రాఫ్‌గా పడిందో అప్పటి నుంచి ఈ సినిమా జాతకం మారిపోయింది" అన్నారు. "నవ్వించడం అంత తేలిక కాదు. ఆ విషయంలో వెంకటేశ్‌గారు సీనియర్ మోస్ట్. ఆ ప్లేస్‌కి ఇప్పుడు శ్రీవిష్ణు యాడ్" అన్నారు అనిల్ సుంకర. "ఐదు రోజులుగా నిద్రపట్టడం లేదు. అంత సంతోషంగా ఉంది" అన్నారు రాజేష్ దండా. "అన్ని వర్గాల ప్రేక్షకులు మా సినిమాని ఎంజాయ్ చేస్తున్నారు" అన్నారు రామ్ అబ్బరాజు. ఈ కార్యక్రమంలో దర్శకులు మెహర్ రమేష్, విజయ్ కనకమేడల, వశిష్ఠ, నటుడు వీకే నరేష్, రెబా మోనికా జాన్ మాట్లాడారు.

పరస్పర అంగీకారంతోనే విడిపోయాం


● నిహారిక కొణిదెల


నటి-నిర్మాత నిహారిక, చైతన్య జొన్నలగడ్డ తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. ఈ సందర్భంగా నిహారిక సోషల్ మీడియాలో ఓ పోస్ట్‌ను షేర్ చేశారు. "పరస్పర అంగీకారంతోనే నేను, చైతన్య విడిపోవాలని నిర్ణయించుకున్నాం. నాకు సపోర్ట్‌గా నిలిచిన నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ధన్యవాదాలు. ఈ పరిస్థితుల అనంతరం మా జీవితాల్లో మేం ముందుకు కొనసాగేందుకు కావాల్సిన ప్రైవసీని ఇవ్వాలని కోరుకుంటున్నాను" అంటూ ఆ పోస్ట్‌లో నిహారిక పేర్కొన్నారు. ఇదే తరహా పోస్ట్‌ను చైతన్య కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక 2020 డిసెంబరులో చైతన్య, నిహారిక వివాహం జరిగింది. కాగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో గత నెల 5న నిహారిక, చైతన్యలకు విడాకులు మంజూరు అయ్యాయి.

సెప్టెంబర్‌లో ప్రజాకవి కాళోజీ


● మూల విరాట్

తెలంగాణకు చెందిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ చిత్రంలో కాళోజీగా మూలవిరాట్ నటించారు. సెప్టెంబర్ 9న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– "కాళోజీగారి కుటుంబ సభ్యులతో పాటు ఈ సినిమా చూసినవారంతా మూల విరాట్‌ని చూసి, కాళోజీయే తమ కళ్ల ముందు నడయాడుతున్నట్లు అనిపించిందన్నారు. కాళోజీగారు తిరిగిన ప్రదేశాల్లో, ఆయన నివసించిన ఇంట్లోనూ సన్నివేశాలు తీశాం. కాళోజీగారు వాడిన కళ్లజోడు, చేతి కర్రను ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో ఉపయోగించాం" అన్నారు. కాళోజీ సినిమా పనులు పూర్తి కావడంతో స్వాతి వారపత్రిక అధినేత వేమూరి బలరామ్ బయోపిక్ పనుల్లో బిజీగా ఉన్నారు ప్రభాకర్ జైనీ.

జీనీ షురూ


● కల్యాణి, కృతీశెట్టి, వామిక, రవి

'జయం' రవి హీరోగా 'జీనీ' సినిమా షురూ అయింది. అర్జునన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతీ శెట్టి, కల్యాణీ ప్రియదర్శన్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా.ఐసరి కె.గణేష్ నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. "వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో రూపొందుతోన్న 25వ సినిమా 'జీనీ'. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. దేవయాని కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మహేష్ ముత్తుస్వామి, సంగీతం: ఏఆర్ రెహమాన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె.అశ్విన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కేఆర్ ప్రభు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	33	65,446
నిఫ్టీ △	10	19,399

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,808	▽	9
డోజోన్స్	34,296	▽	123
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,442	▽	1
డాక్స్	15,938	▽	102
షాంఘై	3,223	▽	22
నికాయ్	33,339	▽	84

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (24 క్యారట్)	58,631	△	109
బంగారం (22 క్యారట్)	58,396	△	108
వెండి (కిలో)	69,699	▽	250

భారత్‌లో ట్రయంఫ్ కొత్త బైక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం బైక్స్ తయారీలో ఉన్న బ్రిటిష్ కంపెనీ ట్రయంఫ్ తాజాగా భారత మార్కెట్లో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ట్రయంఫ్ స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్ వీటిలో ఉన్నాయి. బజాజ్ ఆటో, ట్రయంఫ్ సంయుక్తంగా ఈ రెండు మోడళ్లను అభివృద్ధి చేశాయి. 2017లో ఇరు సంస్థలు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఎక్స్‌షోరూంలో ట్రయంఫ్ స్పీడ్ 400 ధర రూ.2.23 లక్షలు ఉంది. ఈ నెల నుంచే లభిస్తుంది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్ ధర ఇంకా ప్రకటించలేదు. అక్టోబర్ నుంచి ఈ మోడల్ డెలివరీలు ఉంటాయి. పెద్ద ఎత్తున అమ్మకాలను ఆశిస్తున్నట్టు బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ ఈ సందర్భంగా తెలిపారు. మహారాష్ట్ర పుణే సమీపంలోని చకన్ వద్ద ఉన్న కొత్త ప్లాంటులో ఈ బైక్స్ తయారు చేస్తామన్నారు. 2024 మార్చి నాటికి 80 నగరాలు, పట్టణాల్లో ట్రయంఫ్ వరల్డ్ షోరూంలు 100కుపైగా రానున్నాయి.



పీకేహెచ్ వెంచర్స్ ఐపీవో వెనక్కి

న్యూఢిల్లీ: నిర్మాణం, ఆతిథ్య రంగ కంపెనీ పీకేహెచ్ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూ ప్రక్రియను ఉపసంహరించుకుంది. మూడు రోజుల గడువులో ఇన్వెస్టర్ల నుంచి తగిన స్పందన లభించకపోవడంతో ఇష్యూని వెనక్కి తీసుకుంది. చివరి రోజు మంగళవారాని(4)కల్లా కేవలం 65 శాతం సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. కంపెనీ 2,56,32,000 షేర్లు విక్రయానికి ఉంచగా.. 1,67,25,800 షేర్లకు మాత్రమే బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 140–148 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 379 కోట్లు సమీకరించాలని ప్రణాళికలు వేసిన విషయం విదితమే.



మారుతీ ఖరీదైన కారు ఇన్విక్టో

ధర రూ. 24.8 లక్షల నుంచి ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ తాజాగా భారత మార్కెట్లో ప్రీమియం మల్టీ పర్పస్ వెహికల్ ఇన్విక్టో మోడల్‌ను విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.24.8 లక్షల నుంచి ప్రారంభం. కస్టమర్లు 7 లేదా 8 సీట్ల మోడల్‌ను ఎంచుకోవచ్చు. రెండు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులోని ఇంటెలిజెంట్ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ సిస్టమ్ డ్రైవింగ్‌నుబట్టి ప్యూర్ ఎలక్ట్రిక్, పెట్రోల్ మోడ్, హైబ్రిడ్ మోడ్‌కు దానంతట అదే మారుతుంది. ఇన్–బిల్ట్ కనెక్ట్ వ్యవస్థతో స్మార్ట్‌వాచ్‌ను కారుకు అనుసంధానించవచ్చు. ఆరు ఎయిర్ బ్యాగ్స్, స్పీడ్ వార్నింగ్ బజర్, స్పీడ్ సెన్సింగ్ ఆటో డోర్ లాక్ వంటి భద్రతా ఫీచర్లను జోడించారు. స్ట్రాంగ్ హైబ్రిడ్ టెక్నాలజీతో 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ పొందుపరిచారు. మైలేజీ లీటరుకు 23.24 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది.

ఖరీదైన విభాగంలోకి..

ఇన్విక్టో చేరికతో మారుతీ సుజుకీ ఇండియా రూ.20 లక్షలకుపైగా ఖరీదు చేసే వాహన విభాగంలోకి ఎంట్రీ ఇచ్చినట్టు అయింది. ప్రస్తుతం ఎంపీవీ విభాగంలో కంపెనీ వాటా సుమారు 50 శాతం ఉంది. ఇన్విక్టో రాకతో ఈ వాటా మరింత అధికం అవుతుందని సంస్థ ధీమాగా ఉంది. మూడు వరుసల్లో సీట్లు ఉండే ఎస్‌యూవీ మాదిరి ప్రీమియం వాహనం కోరుకునే కస్టమర్ల కోసం దీనిని తీర్చిదిద్దినట్టు మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ ఈ సందర్భంగా తెలిపారు. కాగా, అంతర్జాతీయ భాగస్వామ్యంలో భాగంగా ఈ స్ట్రాంగ్ హైబ్రిడ్ మోడల్‌ను టయోటా కిర్లోస్కర్ మోటార్ నుంచి సుజుకీ కొనుగోలు చేయనుంది. టయోటా ఇప్పటికే భారత్‌లో ఇన్నోవా హైక్రాస్‌ను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. ఇదే కారుకు డిజైన్‌తోపాటు పలు మార్పులు చేసి మారుతీ సుజుకీ ఇండియాకు సరఫరా చేస్తుంది.



జూన్‌లో సేవల వేగం డౌన్!

58.5కు పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం వేగం మేతో పోల్చితే జూన్‌లో కొంత మందగించింది. మేలో 61.2 వద్ద ఉన్న ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్, జూన్‌లో 58.5కు తగ్గింది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ఈ ప్రాతిపదికన సూచీ 50పైన కొనసాగడం వరుసగా 23వ నెల. సూచీ తాజా సమీక్షా నెల్లో కొంత మందగించినప్పటికీ, వ్యవస్థలో డిమాండ్, కొత్త వ్యాపార పరిమాణాలు, ఉపాధి కల్పనకు సంబంధించి సానుకూల వాతావరణమే ఉన్నట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు.

తయారీ, సేవలు కలిపితే...

తయారీ, సేవల రంగాలు కలిపిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూన్‌లో 61.6 వద్ద ఉంటే, మేలో 59.4కు తగ్గింది. ఈ సూచీ కూడా వృద్ధి ధోరణిలోనే పటిష్టంగా ఉన్నట్లు పోలీయానా డీ లిమా తెలిపారు. భారత పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70% వాటా కలిగిన ఒక్క తయారీ రంగాన్ని చూస్తే, మేలో 31 నెలల గరిష్ట 58.7 స్థాయిని చూసిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ జూన్‌లో 57.8కి తగ్గింది. 400 తయారీ సంస్థల పర్చేజింగ్ మేనేజర్లకు పంపిన సమాధానాల ప్రాతిపదికన కదలికలు ఉంటాయి.

గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

- రికార్డుల ర్యాలీకి బ్రేక్
- మిశ్రమంగా ముగిసిన సూచీలు
- సెన్సెక్స్‌కు నష్టం, నిఫ్టీకి లాభం

ముంబై: గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో స్టాక్ సూచీల వరుస రికార్డు ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్ల మూడుశాతం పతనం, జూన్ దేశీయ సేవల రంగ గణాంకాలు నిరాశపరచడం సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 15 పాయింట్ల లాభంతో 65,494 వద్ద, నిఫ్టీ 17 పాయింట్లు పెరిగి 19,406 వద్ద మొదలయ్యాయి. ప్రారంభం నుంచీ తీవ్ర ఒడిదుడుకులకు లోనైన సూచీలు ట్రేడింగ్‌లో నష్టాలు చవిచూశాయి. ఆర్థిక, టెలికం, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 223 పాయింట్లు క్షీణించి 65,256 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 49 పాయింట్లు పతనమై 19,340 స్థాయికి దిగివచ్చింది. ఆఖరి ఎఫ్‌ఎంసీజీ, ఆటో, ఇంధన, వినిమయ, విద్యుత్, సర్వీసుల రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు దాదాపు నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. చివరికి సెన్సెక్స్ 33 పాయింట్లు నష్టపోయి 65,446 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్లు స్వల్పంగా పెరిగి 19,399 వద్ద నిలిచింది. బెంచ్‌మార్క్ సూచీలు మిశ్రమంగా ముగిసినా.., మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.68%, 0.62% లాభపడ్డాయి. ఈక్విటీ మార్కెట్లో లాభాల స్వీకరణ, స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించలేకపోవడంతో ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో 24 పైసలు క్షీణించి 82.25 స్థాయి వద్ద స్థిరపడింది చైనా, అమెరికాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తెరపైకి రావడం, ఎఫ్‌ఓఎంసీ మినిట్స్(బుధవారం రాత్రి) వెల్లడికి ముందు అప్రమత్తత పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లో మారుతీ షేరు పరుగులు పెట్టింది. 4 శాతం ర్యాలీ చేసి రూ.10,037 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 3.61% శాతం పెరిగి రూ.9,994.50 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.10,520 కోట్లు పెరిగి మొత్తం రూ.3.01 లక్షల కోట్లకు చేరింది.
- స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్ల తయారీ సంస్థ జీనస్ పవర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్షన్ షేరు బీఎస్‌ఈలో 20% ఎగసి రూ.169 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. సింగపూర్ సవరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ 74 శాతం వాటాను రూ.16వేల కోట్లకు దక్కించుకుందనే వార్తలు ఈ షేరుకు డిమాండ్ పెంచాయి.
- హోండా మోటార్స్ అనుబంధ సంస్థ యచియో ఇండస్ట్రీలో 81 శాతం వాటాను చేజిక్కించుకుంటామని ప్రకటించడంతో సంవర్థన మదర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ షేరు ఆరుశాతానికి లాభపడి రూ.90 వద్ద స్థిరపడింది.

ఇన్వెస్టర్ల సంపద @ రూ.300 లక్షల కోట్లు

ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ తొలిసారిగా రూ.300 లక్షల కోట్లు దాటింది. అయితే గరిష్ట స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో రూ.300 లక్షల కోట్ల మార్కు నుంచి వెనక్కి వచ్చింది. మార్కెట్ ముగిసేసరికి రూ.299.90 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. ఇటీవల స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయి ర్యాలీ చేస్తుండటంతో ఇన్వెస్టర్ల సంపద అమాంతం పెరుగుతూ వస్తోంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ విషయంలో అమెరికా, చైనా, జపాన్, హాంగ్‌కాంగ్ దేశాల తరువాత భారత్ అయిదో స్థానంలో ఉంది.

మార్కెట్ క్యాప్	అందుకున్న తేది
రూ.10 లక్షల కోట్లు	సెప్టెంబర్ 2003
రూ.25 లక్షల కోట్లు	డిసెంబర్ 2005
రూ.50 లక్షల కోట్లు	సెప్టెంబర్ 2007
రూ.100 లక్షల కోట్లు	డిసెంబర్ 2014
రూ.200 లక్షల కోట్లు	ఫిబ్రవరి 2021
రూ.300 లక్షల కోట్లు	జూలై 2023

ఈసారి రూ. 2 వేల కోట్ల బుకింగ్స్

- 2023–24లో రామ్‌కీ ఎస్టేట్స్ లక్ష్యం
- సంస్థ ఎండీ నంద కిషోర్ వెల్లడి
- త్వరలో వేర్‌హౌసింగ్‌లోకి ఎంట్రీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్ ఎస్టేట్ దిగ్గజం రామ్‌కీ ఎస్టేట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) రూ. 2,000 కోట్ల విలువ చేసే బుకింగ్స్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది ఇది సుమారు రూ. 1,200 కోట్లుగా ఉంది. అలాగే వేర్‌హౌసింగ్ విభాగంలోకి కూడా ప్రవేశించడంపై సంస్థ దృష్టి పెడుతోంది. బుధవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో రామ్‌కీ ఎస్టేట్స్ ఎండీ ఎం నంద కిషోర్ ఈ విషయాలు తెలిపారు. సంస్థ ఇప్పటివరకు రూ. 3,500 కోట్ల పైచిలుకు విలువ చేసే 27 ప్రాజెక్టులను పూర్తి చేయగా, 15 మిలియన్ చ.అ. విస్తీర్ణంతో దాదాపు రూ. 10,000 కోట్ల విలువ చేసే 15 ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నట్లు వివరించారు. కొత్తగా మరో రూ. 3,600 కోట్ల విలువ చేసే ప్రాజెక్టులపై కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు. మారుతున్న కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా 'కమ్యూనిటీ లివింగ్' కాన్సెప్ట్‌కు పెద్దపీట వేస్తూ ప్రాజెక్టులను రూపొందిస్తున్నట్లు వివరించారు. మరోవైపు, వచ్చే 3–4 ఏళ్లలో వేర్‌హౌసింగ్ విభాగంలోకి కూడా ప్రవేశించనున్నట్లు నంద కిషోర్ చెప్పారు. తొలుత 15 మిలియన్ చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. వడ్డీరేట్ల హెచ్చుతగ్గుల ప్రభావంతో సంబంధం లేకుండా నివాస గృహాలకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. సంస్థ దగ్గర దాదాపు రూ.6,500 కోట్ల విలువ చేసే 1,000 ఎకరాల స్థలం ఉన్నట్లు డైరెక్టర్ తారక రాజేశ్ దాసరి చెప్పారు.

రామ్‌కీవర్స్ ఆవిష్కరణ..: ప్రాపర్టీ కొనుగోళ్లకు సంబంధించి కస్టమర్లు ఎంపిక చేసుకునే ప్రక్రియను సులభతరం చేసేలా రామ్‌కీ ఎస్టేట్స్ అత్యాధునిక టెక్నాలజీని తీసుకొచ్చింది. 'రామ్‌కీవర్స్'ను ఆవిష్కరించింది. దీనితో ప్రాజెక్టును చూసేందుకు, వివరాలు తెలుసుకునేందుకు కస్టమర్లు ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా, సౌకర్యంగా ఇంటి దగ్గర్నుంచే వర్చువల్ టూర్ చేయొచ్చని .. సేల్స్ సిబ్బందితో కూడా మాట్లాడవచ్చని సంస్థ వైస్ ప్రెసిడెంట్ శరత్ బాబు తెలిపారు.

'లాయిడ్స్' సీఈవోగా శిరీష ఓరుగంటి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫైనాన్షియల్ సర్వీసుల్లో ఉన్న యూకే సంస్థ లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ హైదరాబాద్‌లోని లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ సీఈవో, ఎండీగా శిరీష ఓరుగంటిని నియమించింది. స్థాపన, దీర్ఘకాలిక వృద్ధి వ్యూహాన్ని ఆమె పర్యవేక్షిస్తారని కంపెనీ బుధవారం ప్రకటించింది. ఇప్పటివరకు ఆమె జేసీపెన్నీ ఎండీగా, కంపెనీ బోర్డ్ మెంబర్‌గా పనిచేశారు. పలు అంతర్జాతీయ సంస్థల్లో కీలక విధులను నిర్వర్తించారు. ఐటీ ఆర్కిటెక్చర్, డేటా ఇంజనీరింగ్, ఫిన్‌టెక్ ఆవిష్కరణలలో విస్తృత అనుభవాన్ని తీసుకు వస్తారని లాయిడ్స్ ఆశాభావం వ్యక్తం చేసింది.

పేదలకు భరోసాతో..
పెత్తందారులు బతికేదెలా?

- నాలుగేళ్లలో పేదలకు డీబీటీ, నాన్ డీబీటీతో రూ.3.15 లక్షల కోట్లకుపైగా లబ్ధి
- కోవిడ్‌లోనూ కొనుగోలు శక్తి తగ్గకుండా నగదు బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పండుగలా ఇళ్ల నిర్మాణంతో ఆర్థిక వ్యవస్థకు ఊతం, భారీగా ఉపాధి
- గ్రామీణ సుస్థిరాభివృద్ధి దిశగా సీఎం జగన్ సంక్షేమ పాలన
- టమాటా ధరలు పెరిగిన మర్నాడే రైతు బజార్లలో సబ్సిడీపై విక్రయం
- మార్కెట్ జోక్యంతో వినియోగదారులకు ఉపశమనం
- నాలుగేళ్లలో రూ.70.32 కోట్ల విలువైన 15 వేల టన్నుల ఉల్లిపాయలు, టమాటా, బత్తాయి కొనుగోలు
- కేంద్ర ఆజమాయిషీలోని గ్యాస్, పెట్రోల్ రేట్లతో రాష్ట్రానికి ఏం సంబంధం?
- వాటి రేట్లు రాష్ట్ర ప్రభుత్వమే పెంచిందనే తరహాలో 'ఈనాడు' బండ రాతలు

సాక్షి, అమరావతి: నిత్యావసరాల ధరల పెరుగుదల ప్రభావం సహజంగానే దేశమంతా ఉంటుంది. వీటిని ఒక్క రాష్ట్రమే నియంత్రించాలంటే సాధ్యం కాదు!! మరి ఇలాంటప్పుడు ఏం చేయాలి? ఆయా ప్రభుత్వాలు తక్షణం స్పందించి రాయితీపై వినియోగదారులకు అందించి ఊరట కల్పించాలి! రాష్ట్ర ప్రభుత్వం అదే చేస్తుంటే కొందరు పెత్తందారులు మాత్రం సహించలేకపోతున్నారు! దేశవ్యాప్తంగా టమాటా ధరలు ఆకాశాన్ని అంటిన మర్నాడే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై రైతు బజార్ల ద్వారా రూ.50కే అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించింది. నిత్యావసరాల బ్లాక్ మార్కెటింగ్‌కు తావులేకుండా నిల్వలపై పరిమితులు విధించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇలా గంటల వ్యవధిలోనే స్పందించడం ఇదేమీ తొలిసారి కాదు. గతంలో ఉల్లి ధరలు భగ్గుమన్నప్పుడు కూడా కర్నూలు సహా వివిధ ప్రధాన మార్కెట్లలో మార్కెటింగ్ శాఖను రంగంలోకి దించి నేరుగా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి రాయితీపై ప్రజలకు అందచేసింది. ధరలు పెరిగినా, పతనమైనా ప్రతి సందర్భంలోనూ వెంటనే జోక్యం చేసుకుని వినియోగదారులను, రైతన్నలను ఆదుకుంటోంది. నాలుగేళ్లలో రూ.70.32 కోట్ల విలువైన 15 వేల టన్నుల ఉల్లిపాయలు, టమాటా, బత్తాయిలను రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి సబ్సిడీపై వినియోగదారులకు పంపిణీ చేయడమే ఇందుకు నిదర్శనం.

చరిత్ర ఎరుగని సంక్షేమం

చరిత్రలో ఎన్నడూ లేనంత సంక్షేమాన్ని అందించి పేదల జీవన ప్రమాణాలు పెరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), ఇతర పథకాల (నాన్–డీబీటీ) ద్వారా ఏకంగా రూ.3.15 లక్షల కోట్లకుపైగా లబ్ధి చేకూర్చారు. కోవిడ్ సంక్షోభంలోనూ సంక్షేమ యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. దీనివల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరిగింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాలుగా కానరాని గ్రామీణ ఆర్థిక సుస్థిరత నాలుగేళ్లలోనే సాధ్యమైంది. గతంలోనూ ప్రభుత్వాలకు ఇదే బడ్జెట్ ఉన్నా ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం దక్కలేదు. ఇప్పుడు ప్రతి నిరుపేద బాగుపడుతున్నాడు. తన కుటుంబానికి ఆపదొస్తే ప్రభుత్వం చూసుకుంటుందన్న భరోసాతో జీవిస్తున్నాడు. ఇదంతా పచ్చమంద, పెత్తందారులకు కంటగింపుగా మారింది. అధికార దండం దూరం కావడంతో కాళ్లు చేతులు ఆడని రామోజీ ›ఈ బాదుడుకు.. పేదలు బతికేదెలా‹? అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఓ కథనాన్ని తమ కరపత్రంలో ముద్రించారు.

పెత్తనం కేంద్రానిదే

వంట గ్యాస్ ధరలపై అజమాయిషీ కేంద్ర ప్రభుత్వానిదే. 2020 – 21 నుంచి వంట గ్యాస్‌పై సబ్సిడీని కేంద్రం భారీగా తగ్గించింది. మరోవైపు సిలిండర్ ధర క్రమంగా రూ.1,100కి ఎగబాకింది. సబ్సిడీ రూపంలో రూ.11 మాత్రమే జమ చేస్తోంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదిస్తూ ›ఈనాడు‹ మభ్యపుచ్చే యత్నం చేసింది. ఇదే తరహాలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలను బట్టి దేశంలో పెట్రోల్ రేట్లు నిర్ణయిస్తారు. పెట్రోల్ రేట్లు పెరిగినప్పుడల్లా ఆ ప్రభావం నిత్యావసరాలపై సహజంగానే ఉంటుంది. ఈ విషయం ఏమాత్రం ఇంగిత జ్ఞానం ఉన్న ఎవరికైనా తెలుస్తుంది!

రూ.15 లక్షలకు పైగా విలువైన స్థిరాస్తి

నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.75 వేల కోట్ల విలువైన 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను అక్కచెల్లెమ్మలకు పంపిణీ చేసింది. ఇంటి నిర్మాణ సాయంతో కలిపి ఒక్కొక్కరికీ రూ.15 లక్షల విలువైన స్థిరాస్తిని అందిస్తోంది. రెండు దశల్లో 21.25 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా ఇప్పటికే 5 లక్షల ఇళ్లు (టిడ్కో ఇళ్లు 72,400 + సాధారణ ఇళ్లు 4 లక్షలకు పైగా) పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో శరవేగంగా నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాల ద్వారా కార్మికులకు 30 కోట్లకుపైగా పని దినాలను కల్పించింది.

ఏపీ పొదుపు సంఘాలకే ఎక్కువ రుణాలు

డ్వాక్రా మహిళలకు రూ.14,204 కోట్ల రుణాలను మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు మోసగించడంతో ఆ భారం రూ.25,571 కోట్లకు చేరుకుంది. 18.36 శాతం సంఘాలు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా మిగిలాయి. అలాంటి తరుణంలో సీఎం జగన్ మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఆదుకున్నారు. ఇప్పటి వరకు పొదుపు సంఘాల మహిళలకు రూ.19,178.17 కోట్లు చెల్లించారు. దీంతో ఇప్పుడు ఎన్‌పీఏ రేటు 0.45 శాతానికి తగ్గిపోయింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. దేశంలో మొత్తం పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాల్లో 30 శాతం ఏపీలో సంఘాలకే పంపిణీ చేయడం విశేషం. ఈ నాలుగేళ్లలో ఏకంగా రూ.1.16 లక్షల కోట్ల మేర బ్యాంకు రుణాలు కూడా ఇప్పించారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు వైఎస్సార్ చేయూత కింద 26.39 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.14,129 కోట్లు ఆర్థిక సాయం చేశారు. తద్వారా సుమారు 10 లక్షల మంది మహిళలు వ్యాపారాలు, స్వయం ఉపాధి, చిరు దుకాణాల ద్వారా శాశ్వత జీవనోపాధి పొందుతున్నారు.

రైతు సాధికారత..

అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద 52.38 లక్షల కుటుంబాలకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.30,985.30 కోట్లను ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల కింద రూ.73.88 లక్షల మంది రైతులకు రూ.1,834.55 కోట్లు అందచేయగా వైఎస్సార్ పంటల బీమా కింద 44.28 లక్షల మందికి రూ.6,684.84 కోట్లు అందించింది. 22.74 లక్షల మంది రైతులకు పంట నష్ట పరిహారం కింద రూ.1,965.43 కోట్లు సీజన్ ముగియక ముందే చెల్లించింది.

నాడు ముక్కిపోయిన బియ్యమే..

గత సర్కారు హయాంలో రేషన్ పంపిణీ అంటే పెద్ద ప్రహసనమే! ముక్కిపోయినవి, పురుగులు పట్టిన బియ్యాన్ని ఇస్తే పేదలు ఎలా తినగలరని ఈనాడు ఏనాడు ప్రశ్నించలేదు. రీ సైక్లింగ్ చేస్తున్నా స్పందించిన పాపాన పోలేదు. సబ్సిడీ కందిపప్పు పేరుతో గత సర్కారు మార్కెట్ కంటే అధిక రేట్లకు టీడీపీ నేతలకు టెండర్లను కట్టబెట్టింది. గరిష్టంగా కిలో రూ.120కి విక్రయించారు. 2014 సెప్టెంబర్ నుంచి 2015 జూలై వరకు కందిపప్పు పంపిణీ చేపట్టలేదు. అలాంటి అధ్వాన్న పరిస్థితులకు తెరదించి ఇప్పుడు నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని ఇంటి వద్దే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. రాళ్లు, పురుగులు, నూక, పొట్టు లేని బియ్యాన్ని ఇస్తుండటంతో ప్రతి నెలా రేషన్ తీసుకునేవారు 90 శాతానికి పెరిగారు. ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా తొలిదశలో రాయలసీమ జిల్లాల్లో ఉచితంగా రాగులు, జొన్నల పంపిణీని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో గోధుమపిండి కిలో రూ.16కే అందిస్తున్నారు. కార్డుకు అరకిలో పంచదార ఇవ్వడంతో పాటు కందిపప్పు రేటు ఎంత పెరిగినా 2020 నుంచి ఇప్పటిదాకా సబ్సిడీపై కిలో రూ.67కే అందిస్తుండటం గమనార్హం. మరోవైపు ప్రజా పంపిణీలో యువతను భాగస్వాములను చేస్తూ 9,260 మందికి ఉపాధి కల్పించింది. కేంద్ర ప్రభుత్వం 80 లక్షల ఎన్‌ఎఫ్‌ఎస్ కార్డులకు మాత్రమే ఉచితంగా బియ్యం ఇస్తుండగా నాన్–ఎన్‌ఎఫ్‌ఎస్ కార్డుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ అందరికీ సార్టెక్స్ బియ్యాన్నే అందిస్తోంది. వీటితో పాటు 18 జిల్లాల్లో బలవర్థకమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. మొత్తంగా రూ.23,860 కోట్లు పీడీఎస్‌పై ఖర్చు చేయడం విశేషం.

దవ్యోల్బణం దేశంలోనే తక్కువ..

ప్రపంచవ్యాప్తంగా పోలిస్తే భారత్‌లోనే ద్రవ్యోల్బణం రేటు తక్కువగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాల్లో 7 నుంచి 9 శాతం వరకు రేట్ల పెరుగుదల ఉండగా మన దేశంలో 4.5 శాతం వద్ద నిలకడగా కొనసాగుతోంది. విదేశీ దిగుమతులను తగ్గించుకుని స్వదేశీ ఎగుమతులను పెంచుకోవడం ద్వారా ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. గతంలో విదేశాల నుంచి వంట నూనె దిగుమతి చేసుకోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. ఇప్పుడు నిలకడగా ఉన్నాయి. స్థానికంగా ఆయిల్ పామ్ రైతులకు రాయితీలు కల్పించడం ద్వారా సాగును ప్రోత్సహించాయి. ఫలితంగా డిమాండ్, సప్లై మధ్య వ్యత్యాసాన్ని 37 నుంచి 25 శాతానికి తగ్గించగలిగారు. అందుకే వంట నూనెల ధరలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు పీడీఎస్ కింద పంపిణీ చేసే నిత్యావసరాలను రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి స్థానికంగానే వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఫలితంగా ధరల పెరుగుదలకు అడ్డుకట్ట పడి తక్కువ రేట్లకే నిత్యావసరాలు లభించనున్నాయి.

తాజాగా నిత్యావసరాల ధరలు (కిలో/లీటర్‌కు రూపాయిల్లో)

సరుకులు	రాష్ట్రంలో సగటు ధర	దేశంలో సగటు ధర
బియ్యం(కామన్)	37.87	40.26
కందిపప్పు	137.67	131.10
మినపపప్పు	112.04	112.89
పెసర పప్పు	115.65	110.27
శనగపప్పు	72.58	74.85
ఉల్లి-2	18.84	25.33
సన్‌ఫ్లవర్ నూనె	116.01	133.07
వేరుశనగ నూనె	174.04	189.31
పామాయిల్	92.38	104.99
షుగర్	41.50	43.04
బంగాళదుంప	29.09	23.06
టమాటా	93.05	83.29

ఇక అధునాతన రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ

- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో రూపొందిస్తున్న ఖరగ్‌పూర్ ఐఐటీ
- ప్రమాదాల నివారణకు రైల్వేశాఖ నిర్ణయం

సాక్షి, అమరావతి: రైలు ప్రమాదాల నివారణ దిశగా రైల్వేశాఖ కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. అందుకోసం సరికొత్త ట్యాంపర్‌ప్రూఫ్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించింది. ఇటీవల ఒడిశాలో ఘోర రైలు ప్రమాదానికి సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఎవరో ఉద్దేశపూర్వకంగా మార్చడమా, పొరపాటున జరిగిన వైఫల్యమా అన్నది తుది విచారణలో నిగ్గుతేలనుంది. కానీ ప్రమాదానికి సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యమే కారణమన్నది స్పష్టమైంది. దీంతో అసాంఘిక శక్తులుగానీ, ఇతరులుగానీ ట్యాంపర్ చేసేందుకు అవకాశం లేకుండా సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికీకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. కొత్త సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించే బాధ్యతను ఖరగ్‌పూర్ ఐఐటీకి అప్పగించింది. డేటా లాగర్ టెక్నాలజీని వినియోగిస్తోంది. ఈ విధానంలో అత్యవసర సమయాల్లో నియంత్రించేందుకు పరిమితంగానే అవకాశాలున్నాయని గుర్తించారు. దీంతోపాటు ఇతరులెవరైనా ట్యాంపర్ చేసేందుకు కూడా అవకాశం ఉండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. అందుకే డేటా లాగర్ టెక్నాలజీ స్థానంలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని ప్రవేశపెట్టారు.

బాల్యం బడిబాట పట్టాలి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్

సాక్షి, అమరావతి: బడిలో భవితకు పునాదులు వేసుకోవాల్సిన బాల్యం పనిలో మగ్గిపోకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్యక్రమాన్ని చేపట్టింది. జూన్ 1 నుంచి నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగించింది. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో మహిళా శిశు సంక్షేమ, కార్మిక, పోలీస్ శాఖతోపాటు బాలల సంక్షేమ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కార్యాచరణ చేపట్టింది. జిల్లాస్థాయిలో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థలతో కమిటీలను ఏర్పాటు చేసింది. పట్టణాలు, పల్లెల్లోని క్షేత్రస్థాయిలో బాల కార్మికులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగిస్తోంది. పరిశ్రమలు, ఇటుక బట్టీలు, వ్యవసాయ అనుబంధ రంగాలు, షాపులు, హోటళ్లు, మెకానిక్ షెడ్లు తదితర షాపుల్లో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. జూన్ 20 నాటికి రాష్ట్రంలో 521 మంది బాల కార్మికులను (14 ఏళ్లలోపు బాలలు) అధికారులు గుర్తించారు. వారిలో 463 మంది బాలురు, 58 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 432 మందిని పనిలోకి వెళ్లొద్దని, చదువుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మరో 89 మందిని బాలల సంరక్షణ గృహాలకు తరలించారు.

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ యూని వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2023- 24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియలో భాగంగా ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టి ఫికెట్ల పరిశీలన బుధవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రారంభమైంది. కార్యక్రమాన్ని చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి ప్రారంభించారు. ఎన్‌సీసీకి సంబంధించి 250 మంది, మాజీ సైనిక ఉద్యోగుల కోటాకు సంబంధించి 65 మంది అభ్యర్థులు హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు తెలిపారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశ గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరంలో బీఏ, బీకామ్, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 12 వరకు పొడిగించినట్టు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ తెలిపారు. ప్రవేశాల షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించారు. ఇంటర్ పూర్తిచేసిన వి ద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 24వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

హైకోర్టులో వాదనలు వినిపించండి

వివేకా పీఏ కృష్ణారెడ్డి పిటిషన్‌పై సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తనను బాధితుడిగా గుర్తించాలంటూ ఆయన పీఏ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం పిటిషన్‌ను విచారిస్తూ.. ఈ అంశంలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. హైకోర్టు ముందు వాదనలు వినిపించుకోవాలని ఇరు వర్గాలకు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు అభిప్రాయాలతో సంబంధం లేకుండా హైకోర్టు తగిన నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది.

బాప్టిజం ఘాట్ నిర్మాణపనులు నిలిపివేత

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని డొంక భూమిలో క్రైస్తవుల కోసం చేపడుతున్న బాప్టిజం ఘాట్ నిర్మాణ పనులను హైకోర్టు నిలిపేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, గుంటూరు జిల్లా కలెక్టర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లను ఆదేశించింది. అందులో భాగంగా వారికి నోటీసులు జారీచేసింది. విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. డొంక భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ మంగళగిరికి చెందిన ముప్పరాజు ప్రదీప్, మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ జయసూర్య విచారించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. డొంక భూమిలో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించిన పనులను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను ఈ నెల 26కి వాయిదా వేశారు.

విశాఖ వేదికగా జిమెక్స్ -2023 ప్రారంభం



ఫ్లోటిల్లావన్, గురుచరణ్ సింగ్ కరచాలనం

సాక్షి, విశాఖపట్నం: సాగర తీర భద్రతలో సహకారం బలోపేతం చేసుకునేందుకు భారత్, జపాన్ నౌకాదళాల మధ్య జరిగే జపాన్-ఇండియా మారీటైమ్ ఎక్సర్‌సైజ్ -2023(జిమెక్స్) ఏడో ఎడిషన్ విశాఖ వేదికగా బుధవారం ప్రారంభమైంది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం వద్ద జరుగుతున్న ఈ ద్వైపాక్షిక విన్యాసాల్లో భారత్ తరపున మొట్టమొదటి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ కమోర్తా, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ ఐఎన్ఎస్ శక్తి యుద్ధ నౌకలతో పాటు సబ్‌మెరైన్, పీ8ఐ యుద్ధ విమానాలు, డోర్నీ యర్లు, హెలికాప్టర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అదేవిధంగా జపాన్‌కు సంబంధించి.. జేఎంఎస్‌డీఎఫ్ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ జేఎస్ సమిదారే, హెలికాప్టర్లు పాల్గొంటున్నాయి. ఆరు రోజుల పాటు ఈ విన్యాసాలు రెండు దశల్లో జరగనున్నాయి. ఈ నెల 10తో జిమెక్స్ విన్యాసాలు ముగియనున్నాయి. తొలిరోజున జేఎంఎస్‌డీఎఫ్ యూనిట్‌కమాండర్ ఎస్కార్ట్ ఫ్లోటిల్లావన్, ఈస్ట్రన్ ఫ్లీట్ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ సంయుక్తంగా విన్యాసాలు ప్రారంభించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఎస్.వి.భట్టి

ప్రస్తుతం కేరళ హైకోర్టు సీజేగా ఉన్న భట్టి

- తెలంగాణ హైకోర్టు సీజే భుయాన్ కూడా..
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కేరళ, తెలంగాణ హైకోర్టుల సీజేలను సిఫార్సు చేసిన కొలీజియం
- ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ భట్టి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి, ప్రస్తుతం కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తులుగా సీనియారిటీ, మెరిట్, పనితీరు వంటి అంశాలతోపాటు హైకోర్టుల ప్రాతినిధ్యం, అట్టడుగు వర్గాలు, సమాజంలో వెనకబడిన వర్గాలు, లింగ వైవిధ్యం, మైనారిటీల ప్రాతినిధ్యం వంటివి మూల్యాంకనం చేసి ఈ ఇద్దరు న్యాయమూర్తులను సిఫార్సు చేసినట్లు సుప్రీంకోర్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2022 ఆగస్టు నుంచి సుప్రీంకోర్టులో ఏపీకి ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో మాతృ హైకోర్టు అయిన ఏపీ హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తుల్లో సీనియర్ జస్టిస్ భట్టిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

జస్టిస్ భట్టి అనుభవం అపారం

ఏపీ, కేరళ హైకోర్టుల్లో సుదీర్ఘకాలం పనిచేసిన జస్టిస్ భట్టి చట్టంలోని పలు అంశాలపై అపార అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. జస్టిస్ భట్టి తీర్పులే ఆయన న్యాయపరమైన యోగ్యతకు నిదర్శనమని తెలిపింది. జస్టిస్ భట్టి జ్ఞానం, అనుభవం సుప్రీంకోర్టుకు అదనపు విలువ అందిస్తాయని పేర్కొంది. జస్టిస్ ఎస్.వి. భట్టి 1962 మే 6న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. తల్లిదండ్రులు రామకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ. మదనపల్లెలోని గిరిరావు థియోసోఫికల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన బీసెంట్ థియోసోఫికల్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. బెంగళూరులోని జగద్గురు రేణుకాచార్య కాలేజీ నుంచి లా డిగ్రీ పొంది, 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఇ.కళ్యాణ్‌రామ్ వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 2013 ఏప్రిల్ 12న అవిభాజ్య ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా 2019లో ప్రమాణం చేశారు. అదే ఏడాది జస్టిస్ భట్టిని కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ సిక్రీ, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అరుణమిశ్రాలతో కూడిన కొలీజియం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 24న కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, జూన్ 1న పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సమగ్రత, సామర్థ్యం ఉన్న న్యాయమూర్తి భుయాన్

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సమగ్రత, సామర్థ్యం ఉన్న న్యాయమూర్తి అని సుప్రీంకోర్టు పేర్కొంది.

అడ్మిషన్ రద్దు చేసుకుంటే ఫీజులు తిరిగివ్వాల్సిందే

- ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ ఆదేశం
- నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శుభవార్త చెప్పింది. నచ్చిన కోర్సును కోరుకున్న విద్యాసంస్థలో అభ్యసించాలనుకునే వారికి మేలు కలిగించే నిర్ణయాన్ని ప్రకటించింది. ముందుగా ఏదైనా కాలేజీలో ఏదో ఒక కోర్సులో చేరిన విద్యార్థి అక్కడ నచ్చని పరిస్థితుల్లో ప్రవేశాన్ని రద్దు చేసుకుంటే.. ఆ విద్యార్థి చెల్లించిన ఫీజులను తిరిగి ఇచ్చేయాలని దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థలను ఆదేశించింది. ఈ నిబంధనను విద్యాసంస్థలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు యూజీసీ ఫీజు రిఫండ్ పాలసీని విడుదల చేసింది.

ఎప్పటినుంచో నిబంధన ఉన్నా..

ఈ నిబంధనలు ఎప్పటినుంచో ఉన్నా కాలేజీలు మాత్రం పట్టించుకోవడం లేదు. మరోవైపు ఏ విద్యాసంస్థ విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను తమ వద్ద ఉంచుకోవడానికి వీల్లేదని, ప్రవేశాల సమయంలో పరిశీలన చేసి వెంటనే విద్యార్థులకు ఇచ్చేయాలని స్పష్టమైన తీర్పు ఇచ్చినా పలు ఉన్నత విద్యాసంస్థలు అమలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో యూజీసీ ఈ విద్యాసంవత్సరం నుంచి ఫీజు రిఫండ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ పాలసీ ప్రకారం విద్యార్థులు తాము ఎంచుకున్న ప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి వీలుగా నిర్దిష్ట వ్యవధిలోపు ఫీజులను తప్పనిసరిగా పూర్తిగా వాపసు చేయాలని పేర్కొంది. 2023 సెప్టెంబర్ 30 వరకు విద్యార్థుల అడ్మిషన్ రద్దు, మైగ్రేషన్ కారణంగా విద్యార్థి ప్రవేశాన్ని విరమించుకుంటే కనుక ఆ విద్యార్థి చెల్లించిన ఫీజుల మొత్తంలో రూ.1000కి మించకుండా మినహాయించుకుని తక్కిన మొత్తాన్ని తిరిగి వాపసు చేయాలని స్పష్టం చేసింది. ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆయా సంస్థలు తమ వద్ద ఉంచుకుంటే చర్యలు తప్పవని పేర్కొంది.

రూ.30 కోట్ల రికవరీ

గత విద్యా సంవత్సరం 2022-23లో ప్రవేశాలు రద్దు చేసుకున్న విద్యార్థులకు ఫీజులను తిరిగి ఇచ్చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ సంస్థలు పాటించడం లేదు. యూజీసీ ఆయా సంస్థలపై చర్యలు చేపట్టి ఆ నిధుల్ని తిరిగి వాపసు చేయిస్తోంది. ఇలా 2022-23లో రూ.30 కోట్ల వరకు యూజీసీ రికవరీ చేసింది. ఆ మొత్తాన్ని 14,443 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపింది.



మరోసారి టీడీపీ పెద్దలకు పేదలే లక్ష్యం

అప్పుడు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకునేందుకు విఫలయత్నం

ఇప్పుడు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకునేందుకు హైకోర్టులో పిటిషన్

- ఇళ్ల నిర్మాణంపై తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేయాలని అభ్యర్థన
- ముఖ్యమంత్రిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చి నిందారోపణలు
- విచారించిన జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం
- సీఎం మినహా మిగిలిన వారికి నోటీసులు
- సుప్రీంకోర్టు ఇళ్ల నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చిందో లేదో చెప్పాలని ఆదేశం.. విచారణ ఈ నెల 11కి వాయిదా

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లస్థలాలు దక్కకుండా చేసేందుకు సర్వశక్తులు ఒడ్డి విఫలమైన తెలుగుదేశం పార్టీ పెద్దలు ఇప్పుడు మరోసారి ఆ పేదలను లక్ష్యంగా చేసుకున్నారు. రాజధాని ప్రాంతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు పేదలు సిద్ధమవుతున్న తరుణంలో.. అడ్డుకునేందుకు మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలన్నింటినీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ తమకు అనుకూలురైన వారిచేత పిటిషన్ వేయించారు. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్పించి, ఆయనపై పలు నిందారోపణలు చేయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకటజ్యోతిర్మయి ధర్మాసనం విచారించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మినహా మిగిలిన ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర గృహనిర్మాణ శాఖ డిప్యూటీ కార్యదర్శి, ఏపీ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్, ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, భూ కేటాయింపు కమిటీ, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో పాటు వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మికి నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వీరిని ఆదేశించింది. అలాగే రాజధాని ప్రాంతంలో పేదల కోసం ఏర్పాటు చేసిన ఆర్ 5 జోన్‌లో పేదలకు ఇళ్లపట్టాల పంపిణీకి మాత్రమే సుప్రీంకోర్టు అనుమతినిచ్చిందా? లేక ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కూడా అనుమతినిచ్చిందా? పంపిణీ చేసిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు కూడా అనుమతినిచ్చిందా? అన్న విషయంలో స్పష్టతనివ్వాలని ప్రభుత్వం తరపున హాజరైన అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని ధర్మాసనం ఆదేశించింది. విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది.

అప్పుడు అలా..

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీఆర్‌డీఏ చట్ట నిబంధనలు చెబుతున్నా.. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో చట్ట నిబంధనలను అమలు చేసేందుకు సిద్ధమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో 1,402 ఎకరాల్లో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ఏకంగా ఆర్ 5 జోన్‌ను సృష్టించింది. పేదల కోసం ఆ భూములను సీఆర్‌డీఏ నుంచి కొనుగోలు చేసింది. ఈ భూముల్లో 50,793 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. తమ ప్రాంతంలో పేదలు ఉండకూడదన్న ఉద్దేశంతో వారికి పట్టాలు రాకుండా చేసేందుకు తెలుగుదేశం పార్టీ పెద్దలు సర్వశక్తులు ఒడ్డారు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. కోట్ల రూపాయలు వెచ్చించి సీనియర్ న్యాయవాదులను రంగంలోకి దించారు. అయినా కూడా టీడీపీ ప్రయత్నాలు ఫలించలేదు. పేదలకు ఇళ్లస్థలాల మంజూరు అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం నొక్కి చెప్పడంతో పట్టాల మంజూరుకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రభుత్వం విజయవంతంగా పేదలకు పట్టాలు పంపిణీ చేసింది. పేదలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు కేంద్రం అనుమతులు సైతం మంజూరు చేసింది. దీంతో ఖంగుతున్న టీడీపీ పెద్దలు ఇప్పుడు పేదల స్థలాల్లో చేపట్టబోతున్న ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకున్నారు.

ఇప్పుడు ఇలా..

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకునేందుకు హైకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సవాలు చేసిన విధంగానే ఆర్ 5 జోన్ ఏర్పాటు కోసం తీసుకొచ్చిన సవరణ చట్టాన్ని, 1,402 ఎకరాల బదలాయింపు జీవోలను కూడా తాజా పిటిషన్‌లోను సవాలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

రూ.58.94 కోట్లతో 'ఆడుదాం ఆంధ్ర'

మంత్రి రోజా వెల్లడి



తిరుచానూరు: రాష్ట్ర స్థాయిలో కనీవినీ ఎరుగని రీతిలో క్రీడా సంబరాలను నిర్వహించేందుకు సీఎం జగన్ నిర్ణయించినట్లు రాష్ట్ర సాంస్కృతిక, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా చెప్పారు. తిరుపతి జిల్లా తిరుచానూరు సమీపంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం ఆదేశాల మేరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఈ క్రీడోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. గ్రామ, వార్డుల్లోని 15,004 సచివాలయాల్లో గ్రామ స్థాయి నుంచి 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్‌ల పోటీలు ఉంటాయని, వీటికి కిట్లను పంపిణీ చేస్తామని వెల్లడించారు. మండల స్థాయిలో గెలిస్తే ప్రొఫెషనల్ కిట్లను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో నగదు బహుమతులు ఉంటాయని, వీటి కోసం రూ.12 కోట్లకు పైగా వెచ్చించినట్లు తెలిపారు. కిట్ల కోసం రూ.42 కోట్లను సీఎం కేటాయించినట్లు తెలిపారు. రూ.58.94 కోట్లతో దేశంలో ఏ సీఎం చేయనటువంటి విధంగా ఈ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

జల పుష్ప విలాసం!

- ఆశాజనకంగా చేపలవేట
- రెండు నెలల నిషేధం తర్వాత పుష్కలంగా లభ్యత
- గత ఏడాదికంటే బాగుందంటున్న బోటు యజమానులు
- బోట్ల నిండా చేపలతో తిరిగొస్తున్న మత్స్యకారులు



గులివిందలు



రొయ్యలు



హార్బర్‌లో చేపలు

సాక్షి, విశాఖపట్నం: రెండు నెలల విరామం తర్వాత వేటకు వెళ్లిన బోట్లకు చేపలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఇవి మత్స్యకారుల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. గత ఏడాదికంటే ఈసారి సీజను ప్రారంభం ఆశాజనకంగా ఉండడం వీరికి ఊరటనిస్తోంది. చేపల వేట నిషేధం అనంతరం జూన్ 15 నుంచి బోట్లు తొలి దఫా వేటకు వెళ్లి వచ్చాయి. సాధారణంగా మరబోట్లు 10-12 రోజులు, మరికొన్ని బోట్లు వారం రోజులు వేట సాగిస్తాయి. ప్రస్తుతం వీటిలో కొన్ని బోట్లు రెండో విడత వేట కూడా పూర్తి చేశాయి. వారంలోపు వేట సాగించిన బోట్లకు 2-3 టన్నుల చేపలు లభ్యమవుతున్నాయి. వీరి వలలకు మార్కెట్లో మంచి ధర పలికే చేపలు కూడా చిక్కుతున్నాయి. వీటిలో కండవాలు, కానాగడసలు, పారలు, మెత్తని పారలు, గులివిందలు, కళ్ల ఒడుగులు, బడే మట్టలు, సైమన్‌లు వంటివి ఉన్నాయి. కండవాలు, చందువాలు వంటివి కిలోల లెక్కన, మిగిలిన చేపలు బాస్కెట్ (7 కిలోలు) చొప్పున కొనుగోలు చేస్తుంటారు. ఇలా కండవాలు కిలో రూ.200-275 ధర పలుకుతోంది. కానాగడసలు బాస్కెట్ రూ.700-800, మెత్తని పారలు రూ.500-600 (పెద్దవి రూ.800-900), సైమన్లు రూ.500-600 (పెద్దవి రూ.1000-1200), పారలు రూ.800-1000 వరకు ధర పలుకుతోంది. ఇవి గిట్టుబాటు ధరలే అయినప్పటికీ ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి కూడా ఈ హార్బర్‌కు వ్యాన్లలో చేపలు తెచ్చి విక్రయిస్తుండడం వల్ల వ్యాపారులు/దళారులు రింగ్ అయి తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తున్నారని దూడ పోలయ్య అనే బోటు యజమాని 'సాక్షి'తో చెప్పారు.

పశ్చిమ తీరానికి ఎగుమతి..

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి దాదాపు 600 మర బోట్లు, 1250 వరకు మోటారు బోట్లు సముద్రంలో వేట సాగిస్తుంటాయి. ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు తూర్పు తీరంలో వేట నిషేధం అమలులో ఉంటుంది. ఇక్కడ నిషేధం పూర్తయ్యాక పశ్చిమ తీరంలో మొదలవుతుంది. ఈ సమయంలో తూర్పు తీరంలో పట్టుబడిన చేపలు కొచ్చిన్, మంగుళూరు, ఉడిపి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అందువల్ల ఈ తరుణంలో చేపలకు మంచి ధర లభించడానికి దోహదపడుతుందని దానయ్య అనే బోటు యజమాని 'సాక్షి'కి చెప్పారు.

రొయ్యల లభ్యత కూడా..

మరోవైపు ప్రస్తుతం చేపలతో పాటు రొయ్యల లభ్యత కూడా బాగుంది. వారంలోపు వేట సాగిస్తున్న కొన్ని బోట్లకు టన్ను వరకు పడుతున్నాయి. వీటిలో చిన్న రొయ్యలతో పాటు బ్రౌన్, పింక్, వైట్, టైగర్ రొయ్యలు కూడా ఉంటున్నాయి. కానీ వీటి ధరలు కూడా తక్కువగా ఉండడం వల్ల గిట్టుబాటు కావడం లేదని బోటు యజమానులు చెబుతున్నారు. అయితే విదేశాల నుంచి కొనుగోళ్లు సన్నగిల్లడంతో ఎగుమతులు క్షీణించాయని, దీంతో ఆ ప్రభావం రొయ్యలపై కూడా పడుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

సీఐడీ విచారణకు రామోజీ, శైలజా కిరణ్ డుమ్మా

- హాజరైన 'మార్గదర్శి' బ్రాంచ్ మేనేజర్లు
- నిధులు మళ్లించినట్టు అంగీకారం
- ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకే నడుచుకున్నట్టు వెల్లడి



సీఐడీ కార్యాలయంలోకి వెళ్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు

సాక్షి, అమరావతి/నగరంపాలెం (గుంటూరు వెస్ట్):మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చెరుకూరి రామోజీరావు, ఏ-2 శైలజాకిరణ్ బుధవారం సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. కాగా.. ఈ కేసులో ఏ-3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 7 బ్రాంచ్ కార్యాలయాల మేనేజర్లు (ఫోర్‌మెన్) గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. చందాదారుల నిధులను మళ్లించామని, ఇదంతా తమ ప్రధాన కార్యాలయం ఆదేశాలతోనే చేశామని వారు సీఐడీ విచారణలో వెల్లడించినట్టు సమాచారం. తమ సంస్థలో చాలా ఏళ్లుగా చేస్తున్నట్టుగానే తాము కూడా చేశామని.. అందులో తాము కేవలం పాత్రధారులమేనని.. పూర్తి నిర్ణయాధికారం తమ ప్రధాన కార్యాలయానిదేనని స్పష్టం చేసినట్టు సమాచారం.

22న నోటీసులు జారీ చేసినా..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం చేపట్టే విచారణకు హాజరుకావాలని ప్రధాన నిందితులైన రామోజీరావు, శైలజాకిరణ్‌లతోపాటు ఏ-3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 7 బ్రాంచ్‌ల మేనేజర్లకు గత నెల 22వ తేదీన దర్యాప్తు అధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ ఏ-1 రామోజీరావు, ఏ-2 శైలజాకిరణ్ విచారణకు మాత్రం మొహం చాటేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ విశాఖపట్నం (సీతంపేట), రాజమహేంద్రవరం (శ్యామలా థియేటర్ సెంటర్), ఏలూరు (నర్సింహరావుపేట), విజయవాడ (లబ్బీపేట), గుంటూరు (అరండల్‌పేట), నరసరావుపేట, అనంతపురం (లక్ష్మీనగర్) బ్రాంచ్‌ల కార్యాలయాల మేనేజర్లు (ఫోర్‌మెన్) మాత్రం విచారణకు హాజరయ్యారు. అనారోగ్య కారణాలతో రామోజీరావు, రాలేని పరిస్థితుల్లో ఉన్నట్టు శైలజాకిరణ్ సమాచారం ఇచ్చారు. రామోజీరావు, శైలజాకిరణ్ విచారణకు హాజరు కాకపోవడంతో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వారందరినీ కలిపి విచారించలేకపోయారు. అయితే.. నిధుల మళ్లింపుల వ్యవహారంపై హాజరయిన 7 బ్రాంచ్ కార్యాలయాల మేనేజర్లను బుధవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు విచారించారు. ఈ విచారణలో సీఐడీ అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలుస్తోంది. కాగా.. ప్రధాన నిందితులైన రామోజీరావు, శైలజాకిరణ్ విషయంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై న్యాయసలహా తీసుకోవాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.


ఆస్తి కోసం ముగ్గురి దారుణహత్య

- చిన్నమ్మ, సోదరి, సోదరుడిని హతమార్చిన వైనం
- పల్నాడు జిల్లా సత్తెనపల్లి, ధూళిపాళ్లలో కలకలం రేపిన ఘటనలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో చిన్నమ్మ, ఆమె ఇద్దరు పిల్లలను నరికి చంపిన ఘటన సంచలనం రేకెత్తించింది. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో షేక్ రహీమూన్ (65), ఆమె కుమార్తె షేక్ మాలింబి (36), సత్తెనపల్లి పట్టణంలో ఆమె కుమారుడు షేక్‌రహిమాన్ (33) దారుణహత్యకు గురయ్యారు. పూర్తి వివరాలు.. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లకు చెందిన షేక్ ఖాశీంకు పెద్దమీరాసాహెబ్, చినమీరాసాహెబ్ కుమారులు. ఆయన మరణానంతరం ఇద్దరు కొడుకులకు చెరో రెండెకరాల పొలం వచ్చింది. ఈ క్రమంలో పెదమీరాసాహెబ్‌కు ముగ్గురు కుమార్తెలు, ఇరువురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు ఖాశిం, ఆయన కుమారుడు జాకీర్ వీరి వాటాగా వచ్చిన పొలం మొత్తం అప్పుల కారణంగా అమ్ముకున్నారు. వీరి కుటుంబం సత్తెనపల్లిలో నివాసం ఉంటుంది. చినమీరాసాహెబ్‌కు భార్య రహీమూన్ (65)తో పాటు ఒక కుమార్తె, ఇరువురు కుమారులు. చినమీరాసాహెబ్ నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో రహీమూన్ తన ముగ్గురు బిడ్డలతో ధూళిపాళ్లలోనే నివసిస్తుంది. వీరిలో పెద్ద కుమారుడు జబ్బార్ 2021లో రెండోవిడత కరోనా సమయంలో మృతి చెందాడు. కుమార్తె షేక్ మాలింబీ (36) ఇంటివద్దే ఉంటుండగా, మరో కుమారుడు షేక్ రహిమాన్ (33) సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వీరందరినీ హతమారిస్తే రెండెకరాల ఆస్తి తనకే వస్తుందని ఆలోచించిన పెదమీరాసాహెబ్ పెద్ద కుమారుడు ఖాశీం బుధవారం తన కుమారుడు జాకీర్‌తో కలిసి ధూళిపాళ్ల వెళ్లాడు. అక్కడ చిన్నమ్మ రహీమూన్, సోదరి మాలింబీని ఇంట్లోనే అతి కిరాతకంగా నరికాడు. రహీమూన్ అక్కడికక్కడే మృత్యువాత పడగా, మాలింబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. అనంతరం పిడుగురాళ్ల రోడ్డులోని ఎస్‌వీఆర్ దాభా హోటల్ వెనుక ప్రాంతంలో రహిమాన్‌ను పట్టుకుని హతమార్చారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ఆవుల బాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఖాశింను పోలీసులు అదుపులోకి తీసుకోగా జాకీర్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

ట్రాన్స్‌జెండర్ల రక్షణ కోసం 'స్వాభిమాన్'

- హెల్ప్‌లైన్ నంబర్ 1091 అందుబాటులోకి..
- సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల భద్రత, హక్కుల పరిరక్షణ, సామాజిక గౌరవం కోసం ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని సీఐడీ అదనపు డీజీ సంజయ్ చెప్పారు. ట్రాన్స్‌జెండర్ల ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటుతో పాటు స్వాభిమాన్ హెల్ప్‌లైన్ నంబర్-1091ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సదస్సులోఆయన మాట్లాడారు. బాధితుల ఫిర్యాదులపై స్పందించి.. తక్షణమే ఎఫ్ఐఆర్‌ల నమోదుతో పాటు ఇతర విధివిధానాలపై అన్ని పోలీస్‌స్టేషన్లకు మార్గదర్శకాలు ఇచ్చినట్లు చెప్పారు. ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అదనపు డీజీ(శాంతి భద్రతలు) శంకబ్రత బాగ్చీ మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ట్రాన్స్‌జెండర్ల ప్రొటెక్షన్ సెల్ నోడల్ అధికారి సరిత మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో కూడా ప్రొటెక్షన్ సెల్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సదస్సులో సీఐడీ మెడికల్ కౌన్సిలర్ మండవ శ్రీనివాసరావు, శాంతి ఎన్‌జీవో ఉపాధ్యక్షుడు డా.ఎల్.రామకృష్ణ, వీహెచ్ఎస్ ఎన్‌జీవో డిప్యూటీ డైరెక్టర్ విజయరామన్ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.